www.trinetnews.com

# ట్రైనెట్ తెలంగాణ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

సంపుటి 01 సంచిక 89 ఎడిటర్ :వెంకటేశ్వర్లు రాపోలు ఆదివారం నవంబర్ 01, 2026 పేజీలు:12 వెల.10/-

## రెస్క్యూ మిషన్ విఫలం..

### భూమిపై కూలిపోనున్న టెలిస్కోప్


2లో

# దేశ ఐక్యతే బలం..
# అభివృద్ధే లక్ష్యం!

- దేశాన్ని అస్థిరపరిచే కుట్రలను భగ్నం చేయాలి.
- ఐకమత్యంతోనే భారత్ ప్రగతి: మోదీ.
- పేదరికం 3 శాతం దిగువకు తగ్గింది.
- నక్సలిజం నుంచి దేశానికి విముక్తి కల్పించాం.
- 2047 నాటికి వికసిత్ భారత్ సాధించాలి.
- 'ఏక్ భారత్.. శ్రేష్ఠ్ భారత్' మన నినాదం కావాలి.



ఐకమత్యమే మనల్ని ఒక దేశంగా ముందుకు నడిపిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. దేశాన్ని ఒక్కటిగా చేసి సురక్షితంగా మార్చిన ఘనత సర్దార్ వల్లభభాయ్ పటేల్‌కు దక్కుతుందని పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గంలో దేశం పయనిస్తోందని తెలిపారు. పటేల్ జయంతి పురస్కరించుకుని గుజరాత్‌లోని ఏక్తానగర్‌లో నిర్వహించిన 'రాష్ట్రీయ ఏక్తా దివస్' కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొని ప్రసంగించారు. ప్రతిపక్షాలు విభజన రాజకీయాలు చేయడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. దేశాన్ని అస్థిరపరచాలనుకునే వారి కుట్రలను భగ్నం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

"గత పాలకులు 'గరీబీ హటావో' నినాదానికే పరిమితమయ్యారు. కానీ.. గత 12 ఏళ్లలో మా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల వల్ల పేదరికం వేగంగా తగ్గుతూ.. మూడు శాతం కంటే దిగువకు వచ్చింది. భారత్‌లో పేదరికం భారీగా తగ్గిందని తాజాగా ప్రపంచ బ్యాంకు నివేదిక సైతం చెప్పింది. నక్సలైట్ల హింస నుంచి దేశానికి విముక్తి కల్పించాం. కానీ.. 'మేధో నక్సల్స్' అశాంతిని సృష్టించాలని చూస్తున్నారు. ప్రజలు ఐక్యంగా ఉంటే.. వారంతా ఏమీ చేయలేరు. దేశాభివృద్ధిని ఎవరూ అడ్డుకోలేరు. 'ఏక్ భారత్.. శ్రేష్ఠ్ భారత్' అనేదే మన నినాదం కావాలి. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని అందుకోవాలి" అని ప్రధాని మోదీ తెలిపారు.



2లో

## కోదాడలో రూ.75 లక్షల గంజాయి పట్టివేత.. హైవేపై ఈగల్ ఫోర్స్, పోలీసుల జాయింట్ ఆపరేషన్

**హైదరాబాద్:**
కోదాడలో భారీగా గంజాయి పట్టుబడింది. కారులో తరలిస్తున్న 150 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.75 లక్షలు ఉంటుందని తెలిపారు. కోదాడ హైవేపై ఈగల్ ఫోర్స్, కోదాడ టౌన్ పోలీసుల జాయింట్ ఆపరేషన్ చేపట్టి గంజాయి ముఠా గుట్టురట్టు చేశారు. ఇద్దరు అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్లను అరెస్ట్ చేశారు. నిందితులను కర్ణాటకకు చెందిన సెల్వ సూర్య (26), రాజా గౌండర్ మురుగన్ గా గుర్తించారు. గంజాయి రవాణాకు ఉపయోగించిన హోండా సిటీ కారును సీజ్ చేశారు. ఒడిశా నుంచి కర్ణాటకకు గంజాయి తరలిస్తున్నట్లు పోలీసులు ప్రాథమికంగా

## క్రాప్ హాలిడేపై
# తప్పుడు ప్రచారం!



- ప్రభుత్వం క్రాప్ హాలిడే ప్రకటించలేదు.
- ప్రతిపక్షాల ప్రచారం నమ్మొద్దు: తుమ్మల
- ఎల్‌నినో ప్రభావంతో ఆరుతడి పంటలకు ప్రోత్సాహం.
- ప్రత్యామ్నాయ విత్తనాలు రాయి ఎతీపై పంపిణీ.
- రైతులకు నష్టం కలగకుండా అన్ని చర్యలు.

# నీటి ఎద్దడిపై సర్కారు అలర్ట్!

- రిజర్వాయర్ల నీటి నిల్వలపై నిరంతర నిఘా.
- తాగునీటి సరఫరాకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు.
- సింగూరు ప్రత్యామ్నాయ అవసరాలకు రూ.120 కోట్లు.
- ఇంకుడు గుంతలు, మ్యాజిక్ పిట్ల పనులు 2 రోజుల్లో పూర్తి.
- నీటి ఎద్దడి ప్రాంతాల్లో ట్యాంకర్లతో సరఫరా.
- ఎల్‌నినోపై గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన: సీతక్క

**హైదరాబాద్:**
వర్షపు నీరు భూగర్భంలోకి ఇంకేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. ఇంకుడు గుంతలు, మ్యాజిక్ పిట్ల నిర్మాణాలు రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఎల్‌నినో, నీటి పొదుపుపై గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని దిశానిర్దేశం చేశారు. గ్రామీణ తాగునీటి సరఫరా ఇంజినీర్లతో సీతక్క శనివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎల్‌నినో నేపథ్యంలో సింగూరు ప్రత్యామ్నాయ తాగునీటి అవసరాలకు రూ.120 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు.


2లో




## ఖాకీ చాటున కక్కుర్తి!

- సీజ్ చేసిన ఫోన్ నుంచి రూ.1.70 లక్షలు స్వాహా.
- బాధితుల ఖాతా నుంచి బంధువుల ఖాతాలకు నగదు బదిలీ.
- కేసులో స్వాధీనం చేసుకున్న 12 తులాల బంగారం తాకట్టు.
- సుమారు రూ.12 లక్షలు సొంతానికి వాడుకున్న కానిస్టేబుల్.
- కానిస్టేబుల్ శ్రవణ్ అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు.

## ఇద్దరు పిల్లలకు ఉరి వేసి తల్లి ఆత్మహత్య

**వికారాబాద్:**
జిల్లాలో తీవ్ర విషాదకర ఘటన చోటుచేసుకుంది. ధరూర్ మండలం చింతకుంట గ్రామంలో ఓ తల్లి తన ఇద్దరు పిల్లలకు ఉరివేసి వారి ప్రాణాలు తీసింది. అనంతరం తాను కూడా ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.



## ఇందిరమ్మ ఫ్లాట్లకు మళ్లీ లాటరీ!

- » నవంబర్ 3న నాలుగు నియోజకవర్గాల్లో డ్రా.
- » ముషీరాబాద్, ఎల్బీనగర్, చాంద్రాయణగుట్ట, గోషామహల్‌లో కేటాయింపులు.
- » నవంబర్ 4న రద్దయిన ఫ్లాట్లకు మాప్ అప్ లాటరీ.
- » అనర్హులు, డబ్బులు చెల్లించని వారి కేటాయింపులు రద్దు.
- » ఆన్‌లైన్‌లో లాటరీ.. యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం.



**హైదరాబాద్:**
కోర్ అర్బన్‌లోని మరో నాలుగు నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఎల్ఐజీ ఫ్లాట్ల కేటాయింపు కోసం నవంబరు 3న డ్రా తీయనున్నట్లు హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ గౌతమ్ తెలిపారు. ముషీరాబాద్, ఎల్బీనగర్, చాంద్రాయణగుట్ట, గోషామహల్ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్లలో ఫ్లాట్లకు డ్రా తీయనున్నారు.

మిగతాద్ది 2 లో

# ఓట్ల తొలగింపుపై
# కాంగ్రెస్ రాద్ధాంతం!

- 13 కోట్ల ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం!
- 2.8 కోట్ల మంది మృతి.. వారి ఓట్లు ఉంచాలా?
- 6.30 కోట్ల మంది వలస.. అచూకీ ఏదీ?
- దొంగ ఓట్లు, అక్రమ వలస ఓట్లు కొనసాగాలా?
- కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే ఆధారాలు చూపాలి: కిషన్‌రెడ్డి
- పీవీ ఓటు ఇంకా జాబితాలోనే ఉంది: బండి సంజయ్


2లో

**హైదరాబాద్:**
దేశంలో 13కోట్ల మంది ఓట్లను తొలగించారని చెబుతున్న కాంగ్రెస్.. వాస్తవాలు ఎందుకు చెప్పడంలేదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ధ్వజమెత్తారు. అందులో 2.8 కోట్ల మంది ఓటర్లు చనిపోయారు, వాటిని తొలగించాలా? వద్దా? అని ప్రశ్నించారు.



## నిర్లక్ష్యానికి అధికారిపై వేటు!

- నిజామాబాద్ DCSO శ్రీకాంత్‌రెడ్డి సస్పెండ్.
- రైస్ మిల్లుల తనిఖీల్లో అలసత్వం.
- జవీ= నిర్వహణలోనూ నిర్లక్ష్యం.
- నెలవారీ తనిఖీలు చేయనట్లు విచారణలో వెల్లడి.
- నిర్లక్ష్య అధికారులపై చర్యలు తప్పవు: స్టీఫెన్ రవీంద్ర

## ఘోరం.. కుళ్లిన కూరగాయలు.. ఫంగస్ పట్టిన ఫుడ్

TG-SAFE
Telangana Standards Authority for Food and Essential Drugs

**హైదరాబాద్:**
నగరం పరిధిలోని 22 హోటళ్లు, రెస్టారంట్లలో టీజీ సేఫ్ అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. పలు హోటళ్లలో అపరిశుభ్ర వాతావరణం ఉన్నట్లు గుర్తించారు. వంటగదుల్లో బొద్దింకలు, ఈగలు, ఎలుకల వ్యర్థాలు కనిపించాయి. ఫ్రిజ్‌లో మాంసాహారం, శాకాహారం కలిపి నిల్వ చేస్తున్నారు. మిగిలిన ఆహార పదార్థాలను మళ్లీ విక్రయిస్తున్నారు. వినియోగించిన వంట నూనెను మళ్లీ వినియోగిస్తున్నట్లు గుర్తించారు. కుళ్లిన కూరగాయలు, ఫంగస్ పట్టిన ఆహార పదార్థాలు, గడువు ముగిసిన వస్తువులను అధికారులు సీజ్ చేశారు. 544 కిలోల కుళ్లిన కూరగాయలు, కలుషిత ఆహారాన్ని ధ్వంసం చేశారు. తీవ్రమైన ఉల్లంఘనలకు పాల్పడిన 8 హోటళ్లకు అధికారులు షోకాజ్ నోటీసులిచ్చారు. 14 హోటళ్లు, రెస్టారంట్ల లైసెన్సులను సస్పెండ్ చేశారు.

## చెరువులో బార్..
# హైడ్రా బుల్డోజర్!

- రామంతపూర్ చెరువు ఎఫ్‌టీఎల్‌లో అక్రమ నిర్మాణాలు.
- మధురా బార్ షెడ్, రేకుల షెడ్ కూల్చివేత.
- పోలీసుల బందోబస్తు మధ్య హైడ్రా ఆపరేషన్.
- కూల్చివేతలను అడ్డుకున్న బార్ యజమానులు.
- 40 ఏళ్లుగా పన్నులు, బిల్లులు చెల్లిస్తున్నామని యజమానుల వాదన.

2లో..



# ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ రాద్ధాంతం!

మొదటిపేజీ తరువాయి

దేశంలో 6.30 కోట్ల ఓటర్లు శాశ్వతంగా వలస వెళ్లారని, ఎక్కడున్నారో తెలియదని.. వాళ్లకు ఎన్నికల సంఘం నోటీసులిచ్చినా స్పందించడం లేదని తెలిపారు. కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే 6.30 కోట్ల ఓటర్ల ఆచూకీ కనిపెట్టి ఆధారాలు సమర్పించాలని డిమాండ్ చేశారు. మరణించిన వాళ్లను, దొంగ ఓట్లను, ఆచూకీ లేని వలస ఓట్లను ఓటర్ జాబితాలో చేర్చాలని కాంగ్రెస్ ధర్నాలు చేస్తోందా? అని కిషన్ రెడ్డి మండిపడ్డారు. పాతబస్తీ, మహేశ్వరం నియోజకవర్గాల్లో 2014కు ముందు పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్ సహా విదేశాల నుంచి అక్రమంగా వలస వచ్చిన వేల మంది ఓట్లున్నాయని, వాటిని తొలగించాలా? వద్దా? ప్రజలే ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 2004లో చనిపోతే ఆయన ఓటు ఇంకా ఉందని, ఆ ఓటును తొలగించాలా వద్దా అని మరో కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. ఓడిపోతే ఈవీఎంలపైనా విష ప్రచారం చేయడం కాంగ్రెస్‌కే చెల్లిందని దుయ్యబట్టారు.

# ఆ ప్రచారం నమ్మొద్దు.. ప్రభుత్వం క్రాప్ హాలిడే ప్రకటించలేదు: మంత్రి తుమ్మల

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ ప్రభుత్వం క్రాప్ హాలిడే ప్రకటించిందని ప్రచారం జరగుతున్న వేళ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దీనిపై క్లారిటీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి క్రాప్ హాలిడే ప్రకటన చేయలేదని, ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని రైతులు నమ్మొద్దని స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపుతున్న విపత్తు అని పేర్కొన్నారు. ఎల్‌నినో దృష్ట్యా ఆరుతడి పంటల సాగును ప్రోత్సహిస్తున్నట్లు మంత్రి వివరించారు. ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను రాయితీపై అందజేస్తున్నట్లు తెలిపారు. ఆరు నెలలుగా ఎల్‌నినోపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని.. వారు నష్టపోకుండా ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందని చెప్పారు.

# నీటి ఎద్దడిపై సర్కారు అలర్ట్!

మొదటిపేజీ తరువాయి

సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు ప్రత్యేక నిధులు కేటాయించామని, ఇతర జిల్లాల్లో తక్షణ తాగునీటి అవసరాలకు రూ. కోటి చొప్పున నిధులు వెచ్చించామని చెప్పారు. తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. నీటి ఎద్దటి ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరాకు ఏర్పాట్లు చేయాలన్నారు. చేతిపంపులు, బావులు, స్థానిక నీటి వనరులను అందుబాటులో ఉంచాలని, రిజర్వాయర్లలో నీటి నిల్వలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.

# సీజ్ చేసిన ఫోన్ నుంచి నగదు కాజేసిన పోలీసు

మొదటిపేజీ తరువాయి

నగరంలోని మీర్‌పేట్ పోలీసుస్టేషన్ కానిస్టేబుల్‌పై కేసు నమోదైంది. ఓ కేసులో సీజ్ చేసిన మొబైల్ ఫోన్ నుంచి కానిస్టేబుల్ రూ.1.70 లక్షల నగదును కాజేశాడు. తన బంధువుల ఖాతాలకు బదిలీ చేసుకున్నాడు. ఈ కేసులో స్వాధీనం చేసుకున్న 12 తులాల బంగారాన్నీ తాకట్టు పెట్టాడు. దీంతో కానిస్టేబుల్ శ్రవణ్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ నెల 27న జరిగిన ఈ వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

ఇన్‌స్పెక్టర్ శోభన్ వెల్లడించిన వివరాల ప్రకారం.. శ్రవణ్ గత ఆరేళ్లుగా కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇటీవల పీఎస్ పరిధిలో వరకట్నపు కేసు నమోదు కాగా.. 12 తులాల బంగారాన్ని పోలీసులు జప్తు చేసి స్టేషన్‌లో దాచి పెట్టారు. దీనిని గమనించిన శ్రవణ్.. గుట్టుచప్పుడు కాకుండా తాకట్టుపెట్టి సుమారు రూ.12 లక్షల వరకు వాడుకున్నాడు. అదే కేసుకు సంబంధించి ఫోన్ కూడా స్వాధీనం చేసుకోగా.. ఆ మొబైల్ నుంచి రూ.1.70 లక్షల నగదును తన ఖాతాలోకి బదిలీ చేసుకున్నాడు. ఖాతాలో డబ్బులు కనిపించకపోవడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించగా.. అసలు విషయం బయటకు వచ్చింది. తప్పును అంగీకరించడంతో శ్రవణ్‌పై ఈనెల 27వ తేదీన కేసు నమోదు చేశారు. అతని నుంచి బంగారాన్ని రికవరీ చేసి అదే రోజు రిమాండ్‌కు తరలించారు.

# విధుల్లో నిర్లక్ష్యం.. నిజామాబాద్ DCSO శ్రీకాంత్ రెడ్డి సస్పెండ్

మొదటిపేజీ తరువాయి

నిజామాబాద్ ణజూూ శ్రీకాంత్ రెడ్డిని సస్పెండ్ చేశారు. రైస్ మిల్లుల తనిఖీల్లో నిర్లక్ష్యం వహించినందుకు ఆయనపై వేటు పడింది. జవీ= విషయంలోను శ్రీకాంత్ రెడ్డి నిర్లక్ష్యం వహించినట్లు విచారణలో తేలింది. ప్రతి నెలా తనిఖీలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు వెల్లడైంది. నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు ఉంటాయన్న సివిల్ సప్లై శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర హెచ్చరించారు.
బియ్యం మరాడించేందుకు సర్కార్ నుంచి వడ్లు తీసుకుని స్వాహా చేసిన రైస్ మిల్లర్లపై అధికారులు క్రిమినల్, ఆర్ఆర్ యాక్ట్ కింద కేసులు పెట్టడం తప్పితే రికవరీ చేయలేకపోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మిల్లర్లపై కేసులు నమోదవుతున్నప్పటికీ.. బకాయిలు చెల్లించకపోయినా ఆస్తిని జప్తు చేయడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కేసులు నమోదు చేశాక డిమాండ్ నోటీసులు పంపి, నెల రోజుల్లో బకాయిలు చెల్లించకుంటే వారి ఆస్తులు జప్తు చేయాల్సి ఉంటుంది. సంవత్సరాలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఆఫీసర్ల అలసత్వాన్ని ఆసరాగా చేసుకుని వందల కోట్లు కొల్లగొట్టిన మిల్లర్లు.. కొద్ది రోజులు జైలుకు వెళ్లొచ్చి దర్జాగా తిరుగుతున్నారు.

దీంతో ఏటా డీఫాల్టర్ల సంఖ్య పెరుగుతుందే తప్ప తగ్గడం లేదని విమర్శలు వస్తున్నాయి. కొందరు అధికారుల నిర్లక్ష్యం ఇందుకు కారణమని, కొందరు అధికారులు కనీసం రైస్ మిల్లులను ప్రతి నెలా తనిఖీ చేయడం లేదని ఆరోపణలు ఉన్నాయి.

# ఇందిరమ్మ ఫ్లాట్లకు మళ్లీ లాటరీ!

మొదటిపేజీ తరువాయి

గతంలో 16 నియోజకవర్గాల్లో కేటాయించిన ఫ్లాట్లలో వివిధ కారణాలతో రద్దయిన వాటికి నవంబరు 4న మాప్ అప్ (చివరి దశ) లాటరీ తీయనున్నట్లు తెలిపారు. నిగతంలో 16 నియోజకవర్గాల్లో వచ్చిన దరఖాస్తుల్లో ఆయా నియోజకవర్గాల్లోనే లాటరీ నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేశారు. అయితే క్షేత్రస్థాయి పరిశీలనలో కొందరిని అనర్హులుగా గుర్తించగా.. మరికొందరు డబ్బులు చెల్లించలేదు. వివిధ కారణాలతో గతంలో కేటాయించిన ఇళ్లను రద్దు చేసి.. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారికి నవంబరు 4న లాటరీ ద్వారా కేటాయించనున్నారు. రెండు లాటరీల ప్రక్రియలు ఆన్‌లైన్‌లో ఉంటాయని హౌసింగ్ బోర్డు తెలిపింది. ఇ-లాటరీని యూట్యూబ్, ఇతర సామాజిక

# దిల్లీ టు ఆగ్రా 59 నిమిషాల్లోనే.. నార్త్ కారిడార్ బుల్లెట్ రైల్‌కు మోదీ ఆమోదం

దేశ రాజధాని నగరం దిల్లీతో ఉత్తరప్రదేశ్, బిహార్‌లోని ప్రధాన నగరాలను బుల్లెట్ ట్రైన్‌తో అనుసంధానం చేయడమే లక్ష్యంగా చేపట్టిన నార్త్ కారిడార్ బుల్లెట్ రైల్ ప్రాజెక్టుకు ప్రధాని నరేంద్ర మోదీ ఆమోదం తెలిపారు. ఈ విషయాన్ని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ల ప్రకటించారు. వారణాసి – దిల్లీ మధ్య కొత్త వందేభారత్ స్లీపర్ రైలు ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ బుల్లెట్ రైలు ప్రాజెక్టు ప్రజల జీవితాలను మార్చేస్తుందన్నారు. నిర్మాణ పనులు పూర్తిగా మేకిన్ ఇండియా ప్రాతిపదికన చేపట్టనున్నట్లు తెలిపారు. దేశ యువత, వెల్డర్ల చేతుల మీదుగా ఈ ప్రాజెక్టు నిర్మితమవుతుందన్నారు.



ఈ బుల్లెట్ రైలు ప్రాజెక్టు సాకారమైతే.. యువత, మధ్యతరగతి వర్గాలు, చిన్న తరహా పరిశ్రమల్లోని కళాకారులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. తద్వారా ప్రధాని మోదీ రాబోయే 100 ఏళ్ల పాటు ప్రజలకు గుర్తుండిపోతారని తెలిపారు. ఈ రైలు దిల్లీ, ఆగ్రా, కాన్పూర్, లఖ్‌నవూ, అయోధ్య, వారణాసి, ప్రయాగ్‌రాజ్, పట్నా, బెంగాల్‌లోని సిలిగుడిని కలుపుతూ అస్సాం గువాహటి వరకు విస్తరించనున్నారు. తద్వారా ప్రయాణ సమయం కూడా తగ్గనుందన్నారు. దిల్లీ నుంచి కాన్పూర్‌కు గంట 45 నిమిషాల్లోనే చేరుకోవచ్చని తెలిపారు. దిల్లీ నుంచి ఆగ్రాకు 59 నిమిషాల్లో, దిల్లీ నుంచి లఖ్‌నవూకు 2.12గంటల్లో, లఖ్‌నవూ నుంచి వారణాసికి 1.21గంటల్లో, వారణాసి నుంచి దిల్లీకి 3.35 గంటల్లో వెళ్లొచ్చని పేర్కొన్నారు.

# ఆకాశమంత స్వేచ్ఛ... నానమ్మను స్మరించుకున్న రాహుల్ గాంధీ, ప్రియాంక

లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక వాద్రాలు తమ నానమ్మ, దివంగత ఇందిరా గాంధీ 42వ వర్ధంతి సందర్భంగా చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ మేరకు వారి ఫొటోలను ఎక్స్ లో పోస్ట్ చేశారు. రాహుల్ గాంధీ 'దాదీ' ఇందిరా గాంధీ ఫొటోను పంచుకుంటూ " నీ ఒడిలో కూర్చోవడం, రెండు చేతులను పట్టుకోవడం, మాటలు వినడం, ఆ మాటలను తిరిగి చెప్పడం, ఎంతో అందమైన బహుమతి ఇచ్చావు దాదీ" అని అన్నారు.
ప్రియాంక గాంధీ వాద్రా కూడా



నానమ్మతో చిన్ననాటి ఫొటోను పంచుకుంటూ ఇందిరా గాంధీ అసాధారణ



శక్తి, వ్యక్తిత్వం కలిగిన మహిళగా గుర్తింపు తెచ్చుకున్నారని పేర్కొన్నారు.“ ఆమె ఆకాశంలా స్వేచ్ఛగా, సముద్రమంత లోతుగా, భూమిలా దృఢంగా, అగ్నికంటే ప్రకాశవంతంగా ఉండేవారని" ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు.
కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హిందీలో సోషల్ మీడియాలో దివంగత ప్రధానికి నివాళులర్పిస్తూ ఆమె ధైర్యం, సంకల్పం, దేశానికి చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. " నాలో శ్వాస ఉన్నంత వరకు సేవ ఆగదు. నా ప్రతి రక్తపు బొట్టు వరకు దేశాన్ని సజీవంగా ఉంచుతానని చెబుతున్నా " అని మరణానికి ఒక రోజు ముందు ఇందిరా గాంధీ చేసిన ప్రసంగాన్ని ఖర్గే గుర్తు చేసుకున్నారు.

# చెరువు కబ్జా చేసి బార్ నిర్మాణం.. హైదరాబాద్ రామంతపూర్ లో హైడ్రా కూల్చివేతలు!

మొదటిపేజీ తరువాయి

రామాంతపూర్ లో చెరువు ఎఫ్టీఎల్ ఆక్రమించి కట్టిన నిర్మాణాలను హైడ్రా కూల్చివేసింది. 2026 అక్టోబర్ 31న పోలీసుల సహకారంతో రామాంతపూర్ చెరువు ఆక్రమణలను తొలగించింది. ఈ క్రమంలో అక్కడ కాసేపు ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది.
చెరువు ఎఫ్ టీ ఎల్ పరిధిలో నిర్మించిన మధురా బార్ షెడ్ ను హైడ్రా అధికారులు కూల్చివేశారు. బార్ తో పాటు రేకుల షెడ్డును కూడా జేసీబీతో కూల్చివేశారు.
హైడ్రా కూల్చివేతలపై బార్ ఓనర్లు అభ్యంతరం తెలిపారు. గత 40 ఏండ్లుగా మున్సిపల్ బిల్, కరెంట్ బిల్లు, టాక్స్ లను చెల్లిస్తూ వస్తున్నట్లు చెప్పారు. ఇప్పుడు ఎఫ్ఐఎల్ లో ఉందని హైడ్రా కూల్చివేతలకు పాల్పడటం సరికాదని ఓనర్లు నూకల గోవర్ధన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

# ఇద్దరు పిల్లలకు ఉరి వేసి తల్లి ఆత్మహత్య

మొదటిపేజీ తరువాయి

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వాసవి రెడ్డి (45) అనే మహిళ తన పిల్లలు సహస్ర (9), వేదాన్ష్ (5)లకు ఉరివేసి హత్య చేసినట్లు ప్రాథమిక సమాచారం. అనంతరం ఆమె కూడా ఆత్మహత్య చేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అయితే ఈ దారుణ ఘటనకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. జరిగిన ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అనంతరం ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులు, ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు విచారణ అనంతరం వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

# కోదాడలో రూ.75 లక్షల గంజాయి పట్టివేత.. హైవేపై ఈగల్ ఫోర్స్, పోలీసుల జాయింట్ ఆపరేషన్

మొదటిపేజీ తరువాయి

గంజాయి రవాణా చేసినందుకు నిందితులు రూ.20 వేలకు ఒప్పందం చేసుకున్నట్లు విచారణలో వెల్లడైంది.
ఒడిశాలోని చిత్రకొండకు చెందిన రాజు నుంచి గంజాయి సేకరించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కర్ణాటకలోని చామరాజనగర్ ప్రాంతానికి చెందిన ఈశ్వర్ గౌండర్, శివప్ప గంజాయి రిసీవర్లుగా గుర్తించారు. వీరి పాత్రపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఒడిశా నుంచి కర్ణాటక వరకు విస్తరించిన గంజాయి నెట్ వర్క్?పై పోలీసులు ఆరా తీస్తున్నారు.
గంజాయి మూలాలు, నెట్‌వర్క్ వెనుక ఉన్నవారిపై దర్యాప్తు చేస్తున్నారు. నిందితులతో పాటు స్వాధీనం చేసుకున్న గంజాయి, కారును ఈగల్ ఫోర్స్ టీమ్ కోదాడ పోలీసులకు అప్పగించింది. కోదాడ పోలీసులు ఈ ఘటనపై ఎన్డీపీఎస్ యాక్ట్ కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# అబ్బే యుద్ధానికి పెద్దగా ఖర్చేంకాలే.. వెనెజువెలా నుంచి రాబట్టాంగా: ట్రంప్ వ్యాఖ్యలు

ఇరాన్ యుద్ధం వల్ల అమెరికాపై పెద్దగా ఆర్థిక భారమేమీ పడలేదన్నట్టుగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడారు. వెనెజువెలా నుంచి భారీగా ముడిచమురును రవాణా చేశామని, దానితో వచ్చిన ఆదాయంతో ఆ యుద్ధం ఖర్చు అంతా భర్తీ అయిందని అధ్యక్షుడు మీడియాకు వెల్లడించారు. అంతేగాక, ఇరాన్‌తో యుద్ధం ముగించడంలో తొందరేంలేదని వ్యాఖ్యానించారు. టెహ్రాన్‌పై మరోసారి దాడులు జరగొచ్చని సంకేతాలు వెలువడుతోన్న తరుణంలో ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అయితే వెనెజువెలా చమురు వల్ల ఎంత ఆదాయం వచ్చిందో మాత్రం ఆయన వెల్లడించలేదు. ఇక, ఈ యుద్ధంతో ఇప్పటివరకు అమెరికాకు సుమారు 47 బిలియన్ డాలర్ల ఖర్చు అయిందని అంచనా.


# రామ్‌లీలా మైదానంలో ర్యాలీకి భారీ ఏర్పాట్లు



కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని ఇండియా కూటమి నవంబర్ 1న దిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహిస్తున్న భారీ ర్యాలీకి దిల్లీ పోలీసులు అనుమతులిచ్చారు. అయితే సభ నిర్వహణకు సంబంధించి పలు ఆంక్షలు విధించారు. కార్యక్రమాన్ని ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల్లోగా ముగించాలని, రామ్‌లీలా మైదానంలో రాత్రి ఎవరూ ఉండకూడదని స్పష్టం చేశారు. సీసీటీవీ కెమెరాలు, తాగునీరు, మరుగుదొడ్లను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. దిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్ శనివారం రామ్‌లీలా మైదానంలో పర్యటించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.

అనంతరం రామ్‌లీలా మైదానం మీదుగా ఆదివారం ప్రయాణం చేయాలనుకుంటున్న వాళ్లు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని అధికారులు సూచించారు. ర్యాలీ జరిగే ప్రాంతాంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా 4,000 వేలకుపైగా పోలీసు సిబ్బందితోపాటు, కేంద్ర బలగాలను మోహరించినట్లు తెలిపారు. ఈ ర్యాలీకి తెలంగాణ నుంచి వచ్చే కార్యకర్తల రవాణా, బస్సుల పార్కింగ్, ఇతర వసతుల ఏర్పాట్ల కోసం ఎంపీలు మల్లు రవి, బలరాం నాయక్, వేం నరేందర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు ఏర్పాట్లను సమీక్షించారు.

# రెస్క్యూ మిషన్ విఫలం.. భూమిపై కూలిపోనున్న టెలిస్కోప్



మొదటిపేజీ తరువాయి

దాదాపు 22 ఏళ్లుగా అంతరిక్షంలో సేవలందిస్తున్న నాసాకు చెందిన 'స్విఫ్ట్ అబ్జర్వేటరీ' అనే భారీ టెలిస్కోప్ త్వరలో భూమిపై కూలిపోనుంది. ఈ టెలిస్కోప్ రెస్క్యూ కోసం చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో.. అది అంతకంతకూ కిందికి దిగుతూ.. అతికష్టంగా ప్రయాణిస్తోంది. నేడో రేపో భూమిపై కూలిపోవచ్చని యూఎస్ స్పేస్ ఫోర్స్ అంచనా వేస్తోంది.
సుమారు ఒకటిన్నర టన్ను బరువున్న ఈ పరికరం చాలావరకు వాతావరణంలోనే కాలిపోతుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. కొన్ని భాగాలు, అద్దాల ముక్కలు మాత్రం భూమిపై పడే అవకాశాలు ఉన్నాయని మిషన్ ముఖ్య శాస్త్రవేత్త, నాసాకు చెందిన బ్రాడ్ సెంకో తెలిపారు.
స్విఫ్ట్ అబ్జర్వేటరీ 2004 నవంబర్ 20న అంతరిక్షంలోకి దూసుకెళ్లింది. విశ్వంలో అత్యంత శక్తిమంతమైన విస్ఫోటనాలైన గామా రే బరస్ట్స్, సూపర్‌నోవాల అన్వేషణకు దీన్ని ప్రయోగించారు. అయితే.. ఇది వేగంగా కిందికి దిగుతుండటంతో రెస్క్యూ చేసే బాధ్యతను 'కాటలిస్ట్ స్పేస్'కు నాసా అప్పగించింది. ఈ ఏడాది జులైలో ఆ సంస్థ ప్రయోగించిన 'లింక్' అనే మూడు చేతుల రోబో ప్రయోగం విఫలమై.. సెప్టెంబర్‌లో భూమిపై కూలిపోయింది.
ఈ క్రమంలోనే అక్టోబర్ నాటికి పరిస్థితి మరింత దిగజారడంతో టెలిస్కోప్‌లోని వ్యవస్థలను నిలిపివేశారు. 'స్విఫ్ట్ అబ్జర్వేటరీ' తన జీవితకాలంలో 2,000కుపైగా గామా రే బరస్ట్స్, 1,400 సూపర్‌నోవాలు, అనేక తోకచుక్కలు, గ్రహశకలాలను, బ్లాక్ హోల్స్‌ను పరిశీలించింది. ఖగోళంలో ఎక్కడైనా విస్ఫోటనాలు జరుగుతున్నప్పుడు ఆ దిశగా అత్యంత వేగంగా కదిలి దాన్ని కవర్ చేయడం ఈ టెలిస్కోప్ ప్రత్యేకత. అందుకే

# స్వయం సమృద్ధ పంచాయతీల నిర్మాణానికి సమష్టి కృషి

**పంచాయతీ స్థలాల్లో ఈవీ చార్జింగ్, బ్యాటరీ మార్పిడి కేంద్రాలు**
**ప్రజా ప్రణాళిక ప్రచారంపై జాతీయ కార్యశాలలో కేంద్ర మంత్రి లలన్ సింగ్ పిలుపు**

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 31:**

'ఆత్మనిర్భర్ పంచాయతీలు', 'వికసిత పంచాయతీలు' సాధించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమష్టిగా కృషి చేయాలని కేంద్ర పంచాయతీరాజ్, మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమల శాఖల మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ అలియాస్ లలన్ సింగ్ పిలుపునిచ్చారు. కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అక్టోబర్ 30న న్యూఢిల్లీలో నిర్వహించిన ప్రజా ప్రణాళిక ప్రచారం (పీపీసీ) 2026--27 జాతీయ కార్యశాలలో ఆయన ప్రసంగించారు. దేశవ్యాప్తంగా 400 మందికిపైగా ప్రతినిధులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో పీపీసీ ఆంగ్ల, హిందీ సమాచార పుస్తకాలను విడుదల చేశారు.

వికసిత భారత్ లక్ష్యానికి అనుగుణంగా స్థానిక పాలనలో మార్పులు తీసుకువచ్చేందుకు ఉద్దేశించిన ప్రధానమంత్రి వికసిత గ్రామ స్వరాజ్ యోజనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని మంత్రి వెల్లడించారు. ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచడం, గ్రామస్థాయిలో చర్చలను ప్రోత్సహించడం, కేంద్ర--రాష్ట్ర పథకాలను ఉమ్మడి డిజిటల్ వేదిక ద్వారా అనుసంధానించడం, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను సకాలంలో రూపొందించడం ఈ పథకం ప్రధాన లక్ష్యాలని వివరించారు.

గ్రామసభలు విశ్వాసంతో ప్రణాళికలు రూపొందించినప్పుడు, సొంత ఆదాయ వనరులు పెరిగినప్పుడు, అన్ని స్థాయిల ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేసినప్పుడే పంచాయతీలు నిజమైన స్వయం సమృద్ధిని సాధిస్తాయని లలన్ సింగ్ పేర్కొన్నారు. పనితీరు ఆధారిత గ్రాంట్లు పొందేందుకు పంచాయతీలు సొంత ఆదాయాన్ని పెంచుకోవాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. స్థానిక ప్రాధాన్యాలకు అనుగుణంగా అభివృద్ధి జరిగేలా స్థిరమైన ఆదాయ మార్గాలను అన్వేషించాలని సూచించారు. అక్టోబర్ 2న ప్రారంభమైన పీపీసీ 2026--27లో ప్రజలను ప్రణాళికా రూపకల్పనకు కేంద్రబిందువుగా నిలిపినట్లు తెలిపారు.

ప్రజల అవసరాలే ప్రణాళికలకు ప్రాతిపదిక

పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి డాక్టర్ వినీత్ జోషి మాట్లాడుతూ.. 'సబ్‌కీ యోజన--సబ్‌కా వికాస్' నినాదంతో 2018 నుంచి నిర్వహిస్తున్న ప్రజా ప్రణాళిక ప్రచారం గ్రామ, మండల, జిల్లా పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు బలమైన వ్యవస్థగా ఎదిగిందన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను స్థానిక స్థాయిలో అమలు చేయడం, పథకాలు, వనరులను సమన్వయం చేయడంలో ఇది కీలకంగా నిలుస్తోందని చెప్పారు.

2026--31 కాలానికి 28 రాష్ట్రాల్లోని నిబంధనల ప్రకారం ఏర్పాటైన పంచాయతీరాజ్ సంస్థలు, గ్రామీణ స్థానిక సంస్థలకు 16వ ఆర్థిక సంఘం మొత్తం రూ.4,35,236 కోట్ల గ్రాంట్లను సిఫార్సు చేసినట్లు తెలిపారు. ఈ నిధులను సమర్థంగా వినియోగించే బాధ్యత పంచాయతీలపై ఉందన్నారు. అభివృద్ధి ప్రణాళికలను అందుబాటులో ఉన్న పథకాలు, నిధులకే పరిమితం చేయకుండా ప్రజల అవసరాలు, ఆకాంక్షల ఆధారంగా రూపొందించాలని సూచించారు.

గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల్లో సొంత ఆదాయ వనరులకు ప్రత్యేక స్థానం కల్పించాలని పేర్కొన్నారు. ఈ--గ్రామ్‌స్వరాజ్, సమర్థ్ పంచాయత్ పోర్టల్‌తోపాటు కేంద్ర--రాష్ట్ర వేదికలను సాంకేతికంగా అనుసంధానించడం ద్వారా మెరుగైన ప్రణాళికలు రూపొందించవచ్చన్నారు. 2027--28 ఆర్థిక సంవత్సర ప్రణాళికల్లో స్థానిక సమాచారం, గ్రామసభల భాగస్వామ్యం, శాఖల సమన్వయానికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

తాగునీరు, పారిశుద్ధ్య శాఖ కార్యదర్శి అశోక్ కె.కె. మీనా మాట్లాడుతూ.. తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య సేవల నిరంతర నిర్వహణలో పంచాయతీల పాత్ర కీలకమన్నారు. నీటి వనరులు, నాణ్యత, నిర్వహణ, శిక్షణ పొందిన సిబ్బంది లభ్యత, చెత్త నిర్వహణ అంశాలను అభివృద్ధి ప్రణాళికల్లో చేర్చాలని సూచించారు. 'జల్ సేవా', 'స్వచ్ఛ సేవా ఆంకలన్' ద్వారా లోపాలను గుర్తించి పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. సేవల స్థిరమైన నిర్వహణకు వినియోగ రుసుములు ఉపయోగపడతాయని, గ్రామసభల ద్వారా జవాబుదారీతనం పెరగాలని పేర్కొన్నారు.

పంచాయతీరాజ్ శాఖ సంయుక్త కార్యదర్శి పల్కా సాహ్ని, గ్రామీణాభివృద్ధి శాఖ సంయుక్త కార్యదర్శి రోహిణి ఆర్. భాజిభాకరే సమగ్ర ప్రణాళికల ప్రాధాన్యాన్ని వివరించారు. జాతీయ కార్యశాల అనంతరం రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల్లో మార్గదర్శక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఈవీ కేంద్రాలతో పంచాయతీలకు ఆదాయ అవకాశాలు

పంచాయతీల ఆర్థిక స్థిరత్వాన్ని పెంచడంతోపాటు స్వచ్ఛ ఇంధన వినియోగాన్ని విస్తరించేందుకు పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ కీలక ఒప్పందం కుదుర్చుకుంది. దేశవ్యాప్తంగా పంచాయతీ స్థలాల్లో విద్యుత్ వాహనాల చార్జింగ్, బ్యాటరీ మార్పిడి కేంద్రాల ఏర్పాటుకు కన్వర్జెన్స్ ఎనర్జీ సర్వీసెస్ లిమిటెడ్ (సీఈఎస్ఎల్)తో అవగాహన ఒప్పందం చేసుకుంది. కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ పరిధిలోని ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్‌కు సీఈఎస్-ఎల్ పూర్తి అనుబంధ సంస్థగా ఉంది.

కేంద్ర మంత్రి లలన్ సింగ్, కార్యదర్శి వినీత్ జోషి సమక్షంలో పంచాయతీరాజ్ శాఖ సంయుక్త కార్యదర్శి ముక్తా శేఖర్, సీఈఎస్ఎల్ డైరెక్టర్ అఖిలేశ్ కుమార్ దీక్షిత్ ఒప్పంద పత్రాలను పరస్పరం అందజేసుకున్నారు. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని గ్రామ, మండల, జిల్లా పంచాయతీలకు ఈ భాగస్వామ్యం కొత్త సొంత ఆదాయ అవకాశాలను కల్పించనుంది.

జాతీయ, రాష్ట్ర రహదారుల వెంబడి అనువైన ప్రాంతాలు, పంచాయతీ ప్రాంగణాల్లో ద్విచక్ర, మూడు చక్రాలు, నాలుగు చక్రాల వాహనాలతోపాటు మధ్యతరహా, భారీ వాహనాలకు అవసరమైన సదుపాయాల ఏర్పాటును చేపట్టనున్నారు. అనువైన స్థలాల గుర్తింపు, పర్యవేక్షణ కోసం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖలతో కేంద్ర మంత్రిత్వ శాఖ సమన్వయం చేస్తుంది. స్థలాల పరిశీలన, డిమాండ్ అంచనా, పరికరాల సరఫరా, ఏర్పాటు, పరీక్షలు, సేవల ప్రారంభం, నిర్వహణ బాధ్యతలను సీఈఎస్ఎల్ చేపడుతుంది.

ఇటీవల విడుదల చేసిన నమూనా పంచాయతీ పన్నులు, రేట్లు, రుసుముల నిబంధనలకు అనుగుణంగా ఈ కార్యక్రమం పంచాయతీల ఆదాయ వనరులను బలోపేతం చేయనుంది. పంచాయతీ స్థలాలను ఆదాయం సమకూర్చే సామాజిక ఆస్తులుగా వినియోగించడం ద్వారా పౌర సేవలు, మౌలిక వసతులు, సంక్షేమ కార్యక్రమాలకు తోడ్పాటు లభించనుంది. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ వాహన సేవలను విస్తరించడం, కర్బన ఉద్గారాలను తగ్గించడం, ఆర్థికంగా బలమైన పంచాయతీలను తీర్చిదిద్దడం ఈ భాగస్వామ్యం లక్ష్యంగా ఉంది.

# ఐక్యతకు యోగా.. ఆరోగ్య భారత్‌కు బాట

**'యోగా ఫర్ యూనిటీ' సందేశాన్ని ప్రోత్సహిస్తున్న ఆయుష్ మంత్రిత్వ శాఖ**
**నిత్య సాధనకు 'యోగా 365'తో ప్రోత్సాహం**

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 31:**

సర్దార్ వల్లభభాయ్ పటేల్ 151వ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ 'యోగా ఫర్ యూనిటీ' సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళుతోంది. జాతీయ సమైక్యత, సామాజిక సామరస్యం, సమష్టి శ్రేయస్సును పెంపొందించడంలో యోగా పాత్రను తెలియజేస్తూ ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తోంది.

'యోగా 365' కార్యక్రమంతో అనుసంధానించిన ఈ ప్రచారం ద్వారా యోగాను ప్రజల దైనందిన జీవితంలో భాగం చేయాలని మంత్రిత్వ శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఆరోగ్యం పట్ల ఉమ్మడి బాధ్యతను పెంపొందించడంతోపాటు కలిసికట్టుగా జీవించే స్ఫూర్తిని బలోపేతం చేయనుంది. దేశవ్యాప్తంగా తన పరిధిలోని యోగా, ప్రకృతి చికిత్స సంస్థలు ఈ సందేశాన్ని సమాజంలోని అన్ని వర్గాలకు చేరవేసే కార్యక్రమాలు చేపట్టాలని ప్రోత్సహిస్తోంది.

కేంద్ర ఆయుష్ శాఖ సహాయ మంత్రి స్వతంత్ర హోదా, ఆరోగ్య--కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావు జాధవ్ మాట్లాడుతూ.. సర్దార్ వల్లభభాయ్ పటేల్ తన దూరదృష్టి, దృఢ సంకల్పంతో దేశాన్ని ఏకం చేశారని పేర్కొన్నారు. సమష్టి కార్యాచరణ ద్వారా ఆయన ఐక్యతా సందేశాన్ని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. వయస్సు, ప్రాంతం, నేపథ్య భేదాలకు అతీతంగా యోగా ప్రజలను ఒక్కటిగా కలుపుతుందని, శారీరక--మానసిక ఆరోగ్యానికి దోహదపడుతుందని తెలిపారు. ప్రతి పౌరుడు నిత్యం యోగా సాధన చేసి ఆరోగ్యవంతమైన, ఐక్య భారత నిర్మాణంలో భాగస్వామి కావాలని కోరారు.

ఆయుష్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి వైద్య రాజేశ్ కొటేచా మాట్లాడుతూ.. శారీరక, మానసిక శ్రేయస్సును మెరుగుపరచుకునేందుకు యోగా సులభమైన, అందరికీ అందుబాటులో ఉండే సాధనమని అన్నారు. వ్యక్తులు, సమాజాల మధ్య అనుబంధాన్ని పెంపొందించడంలోనూ ఇది ఉపయోగపడుతుందని వివరించారు. ఏడాది పొడవునా యోగా సాధనను ప్రోత్సహించే 'యోగా 365' ద్వారా వ్యాధి నివారణకు తోడ్పడే ఆరోగ్య అలవాట్లను రోజువారీ జీవితంలో భాగం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

యోగా సాధనను ప్రత్యేక రోజులు, వేడుకలకే పరిమితం చేయకుండా నిరంతర అలవాటుగా కొనసాగించాలని ఈ ప్రచారం సూచిస్తోంది. సామూహిక యోగా కార్యక్రమాలు, ప్రజల భాగస్వామ్యం ద్వారా జాతీయ ఐక్యతా స్ఫూర్తిని ఆరోగ్యకర జీవన విధానంతో అనుసంధానించనున్నారు. ఇందులో భాగంగా క్రమం తప్పకుండా యోగా సాధన, దాని ప్రయోజనాలపై అవగాహన, సామాజిక భాగస్వామ్యాన్ని పెంచే కార్యక్రమాల నిర్వహణకు ఆయుష్ సంస్థలను ప్రోత్సహిస్తున్నారు.

పటేల్ ఆకాంక్షించిన జాతీయ సమైక్యతా స్ఫూర్తిని కొనసాగిస్తూ, ఆరోగ్యకర జీవనం, సమష్టి శ్రేయస్సు కోసం యోగాను ప్రజలకు మరింత చేరువ చేయాలన్న తమ నిబద్ధతను ఆయుష్ మంత్రిత్వ శాఖ పునరుద్ఘాటించింది.

# ఎన్నికల కమిషన్ తన బాధ్యతలను నిర్వర్తించడంలో విఫలమైతుందని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు.

**హైద్రాబాద్ , ట్రైనెట్ న్యూస్, అక్టోబర్,31.**

ఎన్నికల కమిషన్ తన బాధ్యతలను నిర్వర్తించడంలో విఫలమైతుందని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. శనివారం ఆయన సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలోని బన్సీలాల్ పేట, మోండా, పద్మారావు నగర్ డివిజన్ లలో నిర్వహించిన గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు అని, అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. త్వరలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమం కొనసాగుతున్నదని చెప్పారు. వాస్తవానికి ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్ పై ఉన్నప్పటికీ దానిని విస్మరిస్తుందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అవసరమైన మేరకు సిబ్బందిని నియమించుకొని ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించాల్సి ఉందని అన్నారు. ఎన్నికల కమిషన్ తన బాధ్యతలను పట్టించుకోని కారణంగా తమ బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తమ నాయకులు ఎంతో కష్టపడి కలెక్ట్ చేసిన ఓటరు నమోదు పత్రాలను అధికారుల వద్దకు తీసుకెళ్ళి ఇస్తే తీసుకోకుండా అనేక ఇబ్బందులు కల్పిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషన్ బాధ్యతా రాహిత్యం స్పష్టంగా కనిపిస్తుందని విమర్శించారు. ఓటరు నమోదు కార్యక్రమం కు సంబంధించి ఎక్కడ అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని అన్నారు. గత గ్రాడ్యుయేట్ ఎన్నికలలో ఓటు వేసిన వారు కూడా తిరిగి ఓటరుగా నమోదు చేసుకోవాలనడం విడ్డూరంగా ఉందన్నారు. ఇదే విషయాన్ని ఎన్నికల కమిషన్ అధికారులను ప్రశ్నిస్తే వారి వద్ద సమాధానం లేదని విమర్శించారు. సుమారు కోటి జనాభా కలిగి ఉన్న హైదరాబాద్ నగరంలో లక్షలాదిగా గ్రాడ్యుయేట్ లు ఉన్నప్పటికీ నామమాత్రంగా ఓటరుగా నమోదు ప్రక్రియ సాగుతుందని విచారం వ్యక్తం చేశారు. అర్హులైన గ్రాడ్యుయేట్ లు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు.





**బన్సీలాల్ పేట డివిజన్..**

గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమం లో భాగంగా బన్సీలాల్ పేట డివిజన్ లోని గాంధీ నగర్ కమిటీ హాల్ లో గ్రాడ్యుయేట్ లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీమంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. అర్హులైన గ్రాడ్యుయేట్ లు అందరు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు గ్రాడ్యుయేట్ లు తమ ఓటరు నమోదు పత్రాలను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కు అందజేశారు. అదేవిధంగా పలువురు గ్రాడ్యుయేట్ లకు ఓటరు నమోదు దరఖాస్తు పత్రాలను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కుర్మ హేమలత, నాయకులు లక్ష్మీపతి, ప్రేమ్, అరుణ్ గౌడ్, కుమార్ యాదవ్, నాగభూషణం, వెంకట్ బాబు, అబ్బాస్, శాంతి కుమార్, జగదీష్, సీమా తదితరులు పాల్గొన్నారు.

**మోండా డివిజన్..**

మోండా డివిజన్ లోని బండి మెట్ లో ఏర్పాటు చేసిన గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమం లో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్ళి అర్హులైన గ్రాడ్యుయేట్ లను గుర్తించి ఓటరుగా నమోదు చేయించాలనిపార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పలువు గ్రాడ్యుయేట్ లు తమ ఓటరు నమోదు పత్రాలను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కు అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆకుల రూప, డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆకుల హరికృష్ణ, నాయకులు తలసాని స్కైలాబ్ యాదవ్, గందే నాగులు, కొండాపురం మహేష్ యాదవ్, సత్యనారాయణ, కిషోర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

**పద్మారావు నగర్..**

పద్మారావు నగర్ లోని భోలక్ పూర్ లో గల పాటిదాన్ భవన్ లో నిర్వహించిన గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమం లో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. ముందుగా ఓటరు నమోదు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలు, బస్తీలు అనే తేడా లేకుండా ఇంటింటికీ వెళ్ళి అర్హులైన గ్రాడ్యుయేట్ లను ఓటర్లుగా నమోదు చేయించాలని కోరారు. గతంలో ఓటు వేసిన గ్రాడ్యుయేట్ లు కూడా తిరిగి ఓటరుగా నమోదు చేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా పలువురు గ్రాడ్యుయేట్ లు తమ ఓటరు నమోదు పత్రాలను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కు అందజేశారు. కార్యక్రమంలో పద్మారావు నగర్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి గుర్రం పవన్ కుమార్ గౌడ్, మాజీ కార్పొరేటర్ ఏసూరి సావిత్రి బన్సీలాల్ పేట డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, నాయకులు ఏసూరి మహేష్, మహేందర్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, వెంకటరమణ, సుధాకర్ రెడ్డి, వినోద్, ముక్కా శ్రీనివాస్, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా జాతీయ ఐక్యతా దినోత్సవం

**నల్లగొండ జిల్లా ఇన్‌చార్జ్: విశ్వనాథ్**




హాలియా: భారతదేశ ఉక్కు మనిషి, స్వాతంత్ర్య సమరయోధుడు, దేశ తొలి ఉప ప్రధానమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని హాలియా మున్సిపల్ కార్యాలయంలో రాష్ట్రీయ ఏక్తా దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్ యాదవ్ సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జాతీయ ఐక్యత, సమగ్రత, సమైక్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, పటేల్ చూపిన మార్గంలో నడుస్తామని ప్రతిజ్ఞ చేశారు.

దేశ ఐక్యత, సమగ్రత కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు.

ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు చేరుపల్లి ముత్యాలు, బొంగరాల యేసురాజు, దీపావత్ ప్రసాద్ నాయక్, కౌన్సిలర్ల సలహాదారులు చిట్టిపోలు కరుణాసాగర్, ఎడపల్లి రంజిత్, కోఆప్షన్ సభ్యులు వర్కాల శేఖర్ రెడ్డి, ఎండీ రషీద్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ ఐక్యతా ప్రతిజ్ఞ చేయించిన కేంద్ర మంత్రి జేపీ నడ్డా

**సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం**



**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 31:**

సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా అధికారులతో జాతీయ ఐక్యతా ప్రతిజ్ఞ చేయించారు. న్యూఢిల్లీలోని కర్తవ్య భవన్--1లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖతోపాటు రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.దేశ సమైక్యతకు, సమగ్రతకు సర్దార్ వల్లభభాయ్ పటేల్ అందించిన విశిష్ట సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. దేశ ఐక్యత, సమగ్రత, భద్రతను కాపాడేందుకు కట్టుబడి ఉంటామని అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. దేశ ఏకీకరణలో పటేల్ పోషించిన పాత్ర తరతరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని కార్యక్రమం చాటిచెప్పింది.

ఈ కార్యక్రమంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి పుణ్య సలిలా శ్రీవాస్తవ, ఎరువుల శాఖ కార్యదర్శి రజత్ కుమార్ మిశ్రా, రసాయనాలు, పెట్రోకెమికల్స్ శాఖ కార్యదర్శి తేజ్‌వీర్ సింగ్, ఆరోగ్య పరిశోధన శాఖ కార్యదర్శి, భారత వైద్య పరిశోధన మండలి డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజీవ్ బహల్, ఆరోగ్య సేవల డైరెక్టర్ జనరల్ డాక్టర్ లవ్‌నీష్ జి. కృష్ణ, జాతీయ ఆరోగ్య ప్రాధికార సంస్థ సీఈవో సునీల్ కుమార్ బర్న్‌వాల్‌తోపాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సర్దార్ వల్లభభాయ్ పటేల్ సేవలకు గుర్తుగా ప్రతి ఏడాది అక్టోబర్ 31న జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. దేశ ప్రజల్లో ఐక్యత, సంఘీభావాన్ని పెంపొందించడంతోపాటు జాతీయ సమగ్రత పరిరక్షణలో ప్రతి ఒక్కరి బాధ్యతను గుర్తుచేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం.

# భారత్ పర్వ్‌లో సీసీఐసీ పెవిలియన్‌ను సందర్శించిన ప్రధాని

**భారతీయ చేనేత, హస్తకళా వైభవాన్ని చాటుతున్న ప్రదర్శన**



**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 31:**

గుజరాత్‌లోని కేవడియా ఏక్తా నగర్‌లో జరుగుతున్న భారత్ పర్వ్--2026లో ఏర్పాటు చేసిన సెంట్రల్ కాటేజ్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సీసీఐసీ) పెవిలియన్‌ను ప్రధానమంత్రి అక్టోబర్ 30న సందర్శించారు. కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థ సీసీఐసీ ఈ ప్రదర్శనలో భారతీయ చేనేత, హస్తకళల గొప్ప వారసత్వాన్ని పరిచయం చేస్తోంది.

సంప్రదాయ కళలను ప్రోత్సహించడంలో సంస్థ ప్రస్థానం, కళాకారులు, చేనేత కార్మికులతో కొనసాగిస్తున్న సుదీర్ఘ అనుబంధాన్ని ప్రధానికి తెలియజేసేందుకు ఈ సందర్శన అవకాశం కల్పించింది. కళాకారుల ఉత్పత్తులకు మెరుగైన మార్కెట్ సదుపాయాలు, స్థిరమైన జీవనోపాధి అవకాశాలు కల్పించేందుకు చేపడుతున్న కార్యక్రమాలను పెవిలియన్‌లో ప్రదర్శిస్తున్నారు.

'వోకల్ ఫర్ లోకల్', 'లోకల్ టు గ్లోబల్' లక్ష్యాలకు అనుగుణంగా దేశీయ సంప్రదాయ కళా ఉత్పత్తులను విస్తృతమైన దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లకు చేరువ చేసేందుకు సీసీఐసీ కృషి చేస్తోంది. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారుల నైపుణ్యం, సృజనాత్మకతను ప్రతిబింబించే చేనేత వస్త్రాలు, చేతితో రూపొందించిన విభిన్న ఉత్పత్తులు సందర్శకులకు భారతీయ కళా వైవిధ్యాన్ని పరిచయం చేస్తున్నాయి.

ప్రధాని సందర్శన సందర్భంగా సీసీఐసీ మేనేజింగ్ డైరెక్టర్ బిమల్ గోపాలాచారి, సంస్థ అధికారులు, కళాకారులు, చేనేత కార్మికులు పెవిలియన్‌లో ఉన్నారు. గుజరాత్‌కు చెందిన కళాకారులు అగేట్ రాళ్లు, అర్ధ విలువైన రాళ్లతో రూపొందించే సంప్రదాయ కళాకృతులు, సునిశితమైన అప్లికే పనితనాన్ని ప్రదర్శిస్తున్నారు.

భారతీయ సంస్కృతి, స్థానిక కళారూపాల సౌందర్యాన్ని చాటడంతోపాటు వాటిని రూపొందించే కళాకారులకు విస్తృత గుర్తింపు, మార్కెట్ అవకాశాలు కల్పించే వేదికగా ఈ పెవిలియన్ నిలుస్తోంది.

# చీడకు 'కంది'పోకుండా రైతులు జాగ్రతవహించాలి

**పంట మొగ్గ దశ నుండే రైతులు అప్రమత్తం కావాలి!**
**సమగ్ర చీడపీడల యాజమాన్యంతోనే అధిక దిగుబడులు**

**యాదాద్రి భువనగిరి, అక్టోబరు31/ట్రైనెట్ న్యూస్:**
వాతావరణ పరిస్థితుల్లో మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతంలోటు నేపథ్యంలో ఈ వానాకాలంలో వ్యవసాయశాఖ క్షేత్రస్థాయిలో ఆరుతడి పంటల సాగుపై రైతులకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది, ప్రభుత్వం జాతీయ ఆహార భద్రతా పథకం ద్వారా డబ్ల్యూ.ఆర్.జిఇ -255, పి.ఆర్.జి-176 కంది విత్తనాలను రైతులకు సబ్సిడీపై ఇవ్వడం జరిగింది. తదనుగుణంగా కొంత వరకు రైతులు కంది సాగుకు మొగ్గు చూపారు. ప్రస్తుతం కంది పంట మొగ్గ నుండి పూత దశకు చేరుకుంటుండటంతో రైతులు చీడపీడల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలి. ఈ దశ నుంచి పూత, కాయల అభివృద్ధి దశ వరకు పంటను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ, పురుగుల ఉనికిని ముందుగానే గుర్తించి తగిన చర్యలు చేపడితే దిగుబడి నష్టాలను తగ్గించుకోవచ్చని వ్యవసాయ విస్తరణ అధికారులు ముప్పిడి అశోక్ కుమార్,బి రాజశేఖర్ లు తెలిపారు.

క్రమంతప్పకుండా పర్యవేక్షణ అవసరం: కంది పంటలో మొగ్గ, పూత, కాయల దశలు అత్యంత కీలకమైనవి. ముఖ్యంగా కందిలో మారుకా మచ్చల పురుగు, శనగ పచ్చ పురుగు, కాయ ఈగ వంటి చీడలు పంట దిగుబడిపై ప్రభావం చూపుతాయి. మొగ్గలు, పూతలను పురుగులు ఆశించడం ప్రారంభిస్తే కాయలు ఏర్పడే సమయంలో నష్టం మరింత పెరిగే అవకాశం ఉంది. అందువల్ల రైతులు వారానికి కనీసం రెండుసార్లు పొలాన్ని పరిశీలిస్తూ మొగ్గలు, ఆకులు, పూత, లేత కాయలపై పురుగుల లక్షణాలను గమనించాలి.

**మారుకా మచ్చల పురుగుతో మొగ్గలు,పూతకు నష్టం :**
దీనినే బూజు పురుగు అని అంటారు,సరియైన సమయంలో నివారణ చర్యలు చేపట్టకపోతే దీనివలన సుమారు 80% దిగుబడి నష్టపోయే ప్రమాదం ఉంది.ఈ పురుగు లార్వాలు మొగ్గలు, పూతలను ఒకదానితో ఒకటి కలిపి జాలంలా అల్లి లోపల ఉండి తింటాయి. పూతలు అతుక్కొని ఎండిపోవడం, మొగ్గలు దెబ్బతినడం దీని ప్రధాన లక్షణాలు.పూత ప్రారంభ దశలోనే వేపనూనే ఏ5మీ.లి/లీ నీటికి కలిపి పిచికారీ చేసుకోవడం వలన రెక్కలపురుగు గుడ్లను పెట్టకుండా నివారించవచ్చు. చీడ లార్వాలు కనిపించినట్లయితే వెంటనే క్లోరిపైరిపాస్ఏ2.5మీ.లి లేదా ఎసిఫెట్ఏ1.5గ్రా లీ.నీటికి





కలిపి పిచికారీ చేసుకోవాలి. ఒకవేళ పురుగు ఉధృతి అధికంగా ఉన్నట్లయితే వెంటనే స్పైనోసాడ్ఏ0.3 మీ.లి లేదా ఇమామేక్టిన్ బెంజోయెట్ ఏ0.4గ్రా క్లోరాంట్రానిలిప్రోల్ ఏ0.3 మీ.లి లేదా ల్యాండా సైహలోత్రిన్ఏ1.0 మీ.లి ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చెయాలి.

**శనగ పచ్చ పురుగుతో కాయ తొలిచే ప్రమాదం :**
శనగ పచ్చ పురుగు కంది పూత, లేత కాయల దశలో తీవ్ర నష్టం కలిగించగలదు. చిన్న లార్వాలు పూతను తినగా, పెరిగిన లార్వాలు కాయలకు రంధ్రాలు చేసి లోపలి గింజలను తింటాయి. పంటలో గుడ్లు, లార్వాల ఉనికిని గుర్తిస్తూ పర్యవేక్షణ చేయాలి. పురుగుల సహజ శత్రువులను కాపాడటం, ఎకరాకు 12-15 పక్షి స్థావరాలను ఏర్పాటు చేయడం,10-12 లింగాకర్షక బుట్టలతో పురుగుల ఉనికిని పర్యవేక్షించడం వంటి చర్యలు చేపట్టాలి.ఉధృతి ఎక్కువ ఉన్నపుడు క్లోరాంట్రానిలిప్రోల్ ఏ60మీ.లి లేదా స్పైనోసాడ్ ఏ60మీ.లి/ఎకరా ఏదోఒకటి పిచికారీ చెయ్యాలి.

**కాయ ఈగతో గింజల నాణ్యతకు దెబ్బ :**
కాయ ఈగ ఎక్కువగా దీర్ఘకాలిక రకాలను సాగుచేస్తున్నప్పుడు,వెట్ట పరిస్థితుల్లో ఉధృతి ఎక్కువ ఉంటుంది.కాయ ఈగ ఆశించినప్పుడు దాని లార్వాలు కాయల లోపలికి చేరి గింజలను దెబ్బతీస్తాయి. కావున పిందే దశలోనే వేపనూనెఏ5మీ.లి/లి నీటికి కలిపి పిచికారీ చేసుకున్నట్లయితే తల్లి పురుగులు గుడ్లుపెట్టకుండా నివారించవచ్చు.దీని నివారణకు గింజగట్టిపడే దశలో ప్రొఫినోఫాస్ఏ2.0మీ.లి లేదా ఎసిఫెట్ ఏ 1.5 గ్రా/లి లేదా డైనో టెఫ్యురాన్ ఏ0.2మీ.లి/లి నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేసుకుంటే నష్టాన్ని తగ్గించవచ్చు.

**సమగ్ర యాజమాన్యమే పంట దిగుబడికి శ్రీరామరక్ష:**
రైతులు చేనులో చీడపురుగుల గుడ్లు,లార్వాలను గుర్తించి నాశనం చేయాలి,అలాగే ఎకరాకు 12--15 పక్షి స్థావరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా పక్షులు పురుగుల గుడ్లు,లార్వాలు తినడం ద్వారా వాటి ఉధృతి/నష్టశాతంను కొంతవరకు తగ్గించుకోవచ్చు. అలాగే ఎకరాకు 10--12 లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేయడం ద్వారా పురుగుల ఉనికిని గమనించవచ్చు,బుట్టల్లో చిక్కే పురుగుల సంఖ్య,పంట చీడ నష్టం ఆర్థిక పరిమిత స్థాయి దాటినా తరువాతే రసాయన మందులు పిచికారీ చేసుకోవాలి.

ముగింపు:
ప్రస్తుతం మొగ్గదశ నుండి పూత దశలో ఉన్న కంది పంటలో చీడపీడలపై ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటునే, మొగ్గదశలో మరియు కాయ అభివృద్ధి దశలో రైతులు చేనుకి తగిన తేమ ఉండేలా తడులు ఇవ్వాలి,ఎట్టి పరిస్థితుల్లో పుతాదశలో అధిక తడులు ఇవ్వకూడదు,నేలలోని అధిక తేమ కారణంగా పూత రాలిపోయే ప్రమాదం ఉంది. రైతులు స్థానిక వ్యవసాయ అధికారులను సంప్రదించి పురుగు లక్షణాలకు అనుగుణంగా సిఫారసులు పొందాలి. సరైన సమయంలో తీసుకునే జాగ్రత్తలే కంది పంటలో పెట్టుబడిని కాపాడి, మెరుగైన దిగుబడికి బాటలు వేస్తాయి.

# సర్దార్ పటేల్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నివాళి

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 31:**
సర్దార్ వల్లభభాయ్ పటేల్ 151వ జయంతిని పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం ఆయనకు పుష్పాంజలి ఘటించారు. రాష్ట్రపతి భవన్‌లో పటేల్‌కు పూలు సమర్పించి నివాళులర్పించారు.అంతకుముందు న్యూఢిల్లీలోని సర్దార్ పటేల్ చౌక్‌ను రాష్ట్రపతి సందర్శించారు. అక్కడి సర్దార్ వల్లభభాయ్ పటేల్ విగ్రహానికి పుష్పాంజలి సమర్పించి గౌరవ నివాళులర్పించారు.



# 490 మంది సిబ్బందికి 'కేంద్రీయ గృహమంత్రి దక్షతా పతకం'

**విధుల్లో అత్యుత్తమ ప్రతిభకు గుర్తింపు**

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 31:**
విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, కేంద్ర సాయుధ పోలీసు బలగాలు, కేంద్ర పోలీసు సంస్థలకు చెందిన 490 మంది సిబ్బందికి 2026 సంవత్సరానికి 'కేంద్రీయ గృహమంత్రి దక్షతా పతకం' ప్రకటించారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ఈ పురస్కారాలను వెల్లడించారు.
అధికారులు, సిబ్బంది అందించిన విశిష్ట సేవలను గుర్తించడం, వృత్తిపరమైన ఉన్నత ప్రమాణాలను ప్రోత్సహించడం, వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడం ఈ పతకం ప్రధాన ఉద్దేశం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో, కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి అమిత్ షా మార్గదర్శకత్వంలో ప్రవేశపెట్టిన ఈ పురస్కారం పోలీసు సిబ్బందికి మరింత ప్రోత్సాహాన్ని అందిస్తుందని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పేర్కొంది.
కేంద్ర హోం మంత్రిత్వ శాఖ 2024 ఫిబ్రవరి 1న జారీ చేసిన నోటిఫికేషన్ ద్వారా ఈ పతకాన్ని ఏర్పాటు చేసింది. ప్రత్యేక ఆపరేషన్లలో అత్యుత్తమ పనితీరు, దర్యాప్తులో విశిష్ట సేవలు, అసాధారణ ప్రతిభ, ధైర్యసాహసాలతో కూడిన నిఘా సేవలు, ఫోరెన్సిక్ సైన్స్ రంగంలో ప్రభుత్వ శాస్త్రవేత్తలు చేసిన ప్రతిభావంతమైన కృషికి గుర్తింపుగా దీనిని ప్రదానం చేస్తారు.
రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పోలీసు బలగాలు, భద్రతా సంస్థలు, నిఘా విభాగాలు, ప్రత్యేక శాఖలు, కేంద్ర పోలీసు సంస్థలు, కేంద్ర సాయుధ పోలీసు బలగాలు, నేషనల్ సెక్యూరిటీ గార్డ్, అసోం రైఫిల్స్‌తోపాటు కేంద్ర, రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాల ఫోరెన్సిక్ సైన్స్ విభాగాల్లో సేవలందించే వారికి ఈ పురస్కారం అందజేస్తారు.
ప్రతి ఏడాది అక్టోబర్ 31న సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి సందర్భంగా 'కేంద్రీయ గృహమంత్రి దక్షతా పతకం' విజేతలను ప్రకటిస్తారు.

# మిజోరంలో గ్రామీణ రహదారులకు రూ.710.40 కోట్లు

**509.54 కిలోమీటర్ల మేర 45 పనులకు ఆమోదం**

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 31:**
మిజోరంలో గ్రామీణ రవాణా అనుసంధానాన్ని మెరుగుపరిచేందుకు ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన--4 (పీఎంజీఎస్‌వై--4) కింద 45 రహదారి పనులకు కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. 2026--27 ఆర్థిక సంవత్సరానికి తొలి విడతలో భాగంగా రూ.710.40 కోట్ల అంచనా వ్యయంతో 509.54 కిలోమీటర్ల మేర ఈ పనులు చేపట్టనున్నారు.
ఈ ప్రాజెక్టుల ద్వారా 48 జనావాసాలకు తొలిసారిగా అన్ని కాలాల్లో రాకపోకలకు అనువైన రహదారి సౌకర్యం అందుబాటులోకి రానుంది. ఆయా ప్రాంతాల ప్రజలు పాఠశాలలు, ఆసుపత్రులు, గ్రామీణ మార్కెట్లు వంటి అత్యవసర సేవలను సులభంగా చేరుకునేందుకు ఈ రహదారులు దోహదపడనున్నాయి. స్థానిక ప్రజల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి తోడ్పడటంతోపాటు వికసిత భారత్ లక్ష్య సాధనకు ఊతమివ్వనున్నాయి.
తాజా ఆమోదాలకు అదనంగా, పీఎంజీఎస్‌వై కింద మిజోరంలో ఇప్పటికే రూ.3,412 కోట్ల వ్యయంతో 4,935 కిలోమీటర్ల మేర 367 రహదారి పనులు, ఏడు వంతెనలు మంజూరయ్యాయి.

# నవంబరు 3 , 4 తేదీల్లో ఈ లాటరీ ద్వారా ఇందిరమ్మ టవర్స్ ఇండ్ల కేటాయింపు

**యూట్యూబ్ లో ప్రత్యక్ష ప్రసారం**
**హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ శ్రీ వీపి గౌతం**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్,**
**అక్టోబరు 31:**
అల్పాదాయ వర్గాల కోసం ప్రభుత్వం నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ లో ఇండ్ల కోసం దరఖాస్తులు స్వీకరించి లబ్ధిదారుల ఎంపిక చేపట్టాల్సి ఉన్న నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన లాటరీ ప్రక్రియను నవంబర్ 3 వ తేదీన నిర్వహిస్తున్నట్లు హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ వి.పి.గౌతం తెలిపారు. అలాగే గతంలో 16 నియోజకవర్గాల్లో లాటరీ ద్వారా కేటాయించిన ఇండ్లలో వివిధ కారణాలతో కేటాయింపు రద్దు కావడంతో అందుబాటులోకి వచ్చిన ఇండ్లను కూడా లబ్ధిదారులకు కేటాయించనున్నామని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన మాప్ అప్ లాటరీ (ఎశీజూ-బజూ శ్రీశీవతీఎ) ప్రక్రియను నవంబరు 4 వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా ఆన్ లైన్ విధానంలో నిర్వహించనున్నామన్నారు. ఈ రెంటిండిని ఇ-లాటరీ ద్వారా నిర్వహిస్తున్నామని, ప్రజలందరూ ఆన్ లైన్ లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించవచ్చని తెలిపారు.
ముషీరాబాద్, ఎల్.బి.నగర్, చంద్రాయణగుట్ట, గోషామహల్ నియోజకవర్గాల్లో ప్రతిపాదించిన ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ లో ఫ్లాట్ల కోసం ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించిన సంగతి తెలిసిందే. ఈ దరఖాస్తుల ప్రాథమిక పరిశీలన పూర్తి అయి లాటరీ ప్రక్రియ ద్వారా లబ్ధిదారుల ఎంపిక చేపట్టాల్సి ఉన్నది. ఈ ప్రక్రియను నవంబరు 3 వ తేదీన నిర్వహిస్తున్నట్లు వైస్ ఛైర్మన్ తెలిపారు. ఈ లాటరీ ప్రక్రియను హౌసింగ్ డిపార్ట్ మెంట్ కు చెందిన యూట్యూబ్ తోపాటు ఇతర సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్ష ప్రసారం చేస్తామని పేర్కొన్నారు.

4 వ తేదీన మాప్-అప్ లాటరీ
ఇందిరమ్మ ఇండ్ల పథకంలో పైలట్ ప్రాజెక్టు గా తొలి విడతగా అవుటర్ రింగ్ రోడ్ పరిధిలో ఉన్న ప్రతి నియోజకవర్గంలోనూ (కంటోన్మెంట్ మినహా) 480 ఇండ్ల నిర్మాణాలను చేపట్టిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా 16 నియోజకవర్గాల్లో వచ్చిన దరఖాస్తుల్లో అర్హులైన వారి జాబితాతో ఆయా నియోజకవర్గాల్లోనే లాటరీ నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేశారు. పలు ప్రాంతాల్లో టవర్స్ నిర్మాణపు పనులు కూడా ప్రారంభమై పురోగతిలో ఉన్నాయి. అయితే క్షేత్ర స్థాయి పరిశీనల్లో లాటరీలో ఎంపికైన వారిలో కొంత మంది ఆయా నియోజకవర్గాల్లో ప్రస్తుతం నివాసం ఉండకపోవడం, కొంత మంది తాము ప్రస్తుతం డబ్బులు చెల్లించలేమని పేర్కొనడం, ఇప్పటికే సొంత ఇల్లు ఉండటం మొదలైన కారణాలతో లాటరీలో ఇండ్లు వచ్చినప్పటికీ అనర్హులయ్యారు. ఇలా పలు కారణాలతో ఇండ్ల ఖాళీలు ఏర్పడి, కొత్తవారికి కోసం అందుబాటులోకి వచ్చాయి. ఈ ఇండ్లను ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారి జాబితా నుంచే అర్హులైన వారికి కేటాయించడానికి ఆన్ లైన్ ద్వారా నవంబరు 4 వ తేదీన ఈ -లాటరీ ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు వీపి గౌతం వివరించారు.
చిరునామా ఆధారంగా సుమోటోగా నియోజకవర్గాల మార్పు
కాగా 16 నియోజకవర్గాల్లో కొంత మంది తాము ప్రస్తుతం నివసిస్తున్న నియోజకవర్గంలో కాకుండా, ఇతర నియోజకవర్గాల్లో ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని, అటువంటి వారిపేర్లు గతంలో నిర్వహించిన లాటరీలో చేర్చలేదన్నారు. అయితే సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని, దరఖాస్తు దారులు సమర్పించిన చిరునామాల ఆధారంగా, గూగుల్ ద్వారా వారు ఏ నియోజకవర్గం పరిధిలోకి వస్తారన్న విషయాన్ని తెలుసుకున్నామని శ్రీ వీపి గౌతం తెలిపారు. ఆ సమాచారం ఆధారంగా వారందరి పేర్లను, ఖాళీల భర్తీ కోసం నిర్వహించే లాటరీ లో సుమోటోగా చేర్చుతున్నామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇండ్లు లభించేలా చూడాలన్నది ప్రభుత్వ అభిమతమని, ఏ నియోజకవర్గంలోని వారికి ఆ నియోజకవర్గంలోనే సొంత ఇంటి వసతి కల్పించాలన్న లక్ష్యంలో భాగంగా దరఖాస్తు దారుల చిరునామాలకు జియోకోడ్స్ సేకరించి గూగుల్ మ్యాప్ లతో వారి చిరునామాలను అనుసంధానించుకుంటూ మ్యాపింగ్ చేశామన్నారు.
గతంలో దరఖాస్తుదారులు వివరాల నమోదులో పొరపాటు చేసినప్పటికీ, ప్రభుత్వ పరంగా దానికి పరిష్కారం కనుగొని అర్హులైన అందరికీ అవకాశం కల్పిస్తున్నామన్నారు. నియోజకవర్గ మార్పు కోసం దరఖాస్తుదారులు చేసుకున్న విజ్ఞప్తులను కూడా పరిష్కరించామని ఆయన వివరించారు.

# మలక్ పేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లో జాయింట్ సీపీ తనిఖీ

**- పలు రికార్డుల పరిశీలన.. పలు సూచనలు**
**- నగరంలో వాహనాల రాకపోకలు సజావుగా సాగేలా చూడాలి:**
**- 'ఆపరేషన్ రోప్' ను, డ్రంక్ అండ్ డ్రై వ్ తనిఖీలను మరింత కఠినతరం చేయాలి :**
**- నగర ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ డి. జోయల్ డేవిస్ (ఐపీఎస్) పోలీస్ అధికారులకు సూచన...**

**ట్రైనెట్ న్యూస్, హైదరాబాద్ అక్టోబర్ 31:**
నగర ట్రాఫిక్ జాయింట్ కమి షనర్ డి. జోయల్ డేవిస్ వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం మలక్ పేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ను సందర్శించారు. ఈ సందర్భం గా ఇన్స్ స్పెక్టర్ కె.ఆదిరెడ్డి పోలీ స్ ఉన్నతాధికారులతో కలిసి జాయింట్ కమిషనర్ కు పూల మొక్క అందజేసి స్వాగతం పలి కారు. అనంతరం డి.జోయల్ డేవిస్ (ఐపీఎస్) స్టేషన్‌లోని నామినల్ రోల్, ఆర్డర్ బుక్, డ్యూటీ చార్ట్, ఇ-కాప్స్, కో ర్టు సంబంధిత విషయాలు, డిడి కేసులు తదితర రికార్డులను పరిశీలించారు. గత మరియు ప్రస్తుత సంవత్సరాలలో పరి ష్కరించబడిన కేసుల వివరాలను సమీ క్షించారు. నగరంలో వాహనాల రాకపోక లు సజావుగా సాగేలా చూడాలని, ము ఖ్యంగా వర్షాల సమయంలో రోడ్లపై నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టడం ద్వారా ట్రాఫిక్ జామ్ లను నివారించాలని సూచించారు. రో డ్లపై, ఫుట్ పాత్ పై ఉన్న ఆక్రమణలను తొలగించడానికి మరియు అనధికారిక పార్కింగ్ లను అరికట్టడానికి ఉద్దేశించిన 'ఆపరేషన్ రోప్' ను మరింత ఉధృతం చేయాలని స్పష్టం చేశారు. అలాగే, రాత్రి వేళల్లో రోడ్డు భద్రతను పర్యవేక్షించి, డ్రం క్ అండ్ డ్రైవ్ తనిఖీలను కఠినతరం చేయాలని అధికారులను ఆదేశించారు.



అనంతరం పోలీస్ స్టేషన్‌లో అందుబా టులో ఉన్న అన్ని రికార్డులు, వాహనాల ను తనిఖీ చేశారు. ఈ తనిఖీ కార్యక్ర మంలో అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్-2) శ్రీరాములు, అసి స్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్-7) వి.చంద్రకుమార్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మాజీ ప్రధాని ఇందిరా గాంధీ కి నివాళులు అర్పించిన సీఎం రేవంత్ రెడ్డి



**ఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 31:**
మాజీ ప్రధాని, భారతరత్న ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా న్యూఢిల్లీలో "శక్తి స్థల్" వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుష్పాంజలి ఘటించారు. ఏఐసీసీ అగ్రనాయకులు సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్ తో కలిసి "శక్తి స్థల్" సీఎం వద్ద నివాళులు నివాళులు అర్పించారు.

# పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ

**2047 నాటికి 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా భారత్, 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ ఎదగాలంటే 8 శాతం వృద్ధి అవసరం: మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి**

**పరిశ్రమలు, విద్యాసంస్థల మధ్య సమన్వయం పెంపునకు పిలుపు**



హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 31:

భారతదేశం 2047 నాటికి 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, తెలంగాణ రాష్ట్రం 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగి అభివృద్ధి చెందిన దేశంగా, రాష్ట్రంగా రూపాంతరం చెందాలంటే ఏటా 8 శాతం ఆర్థిక వృద్ధిని సాధించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ, గనులు మరియు భూగర్భ వనరుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. ఆర్థిక వృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధికి సమ ప్రాధాన్యత నివ్వాలని ఆయన స్పష్టం చేశారు.

డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (డాక్టర్ ఎం.సి.ఆర్. హెచ్.ఆర్.డి.ఐ.) స్వర్ణోత్సవాల సందర్భంగా నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సు ఆర్థిక వృద్ధి, సుస్థిర అభివృద్ధి మరియు ప్రజా విధానాలు ముగింపు కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి

ఆర్థికాభివృద్ధిలో మానవ వనరుల నైపుణ్యాభివృద్ధి కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి పేర్కొన్నారు. విద్యాసంస్థల నుంచి బయటకు వస్తున్న యువతకు ఉన్న నైపుణ్యాలకు, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలకు మధ్య అంతరం ఉందని, ఈ వ్యత్యాసాన్ని తొలగించాల్సిన అవసరం ఉందని అన్నారు.

విద్యాసంస్థలు తమకు అందుబాటులో ఉన్న కోర్సులు, శిక్షణకే పరిమితం కాకుండా పరిశ్రమలకు వాస్తవంగా అవసరమైన నైపుణ్యాలను యువతకు అందించాలని సూచించారు. ఇందుకోసం పరిశ్రమలు, విద్యాసంస్థల మధ్య సమన్వయం, భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పించే విధంగా ప్రాయోగిక పరిజ్ఞానం, సాంకేతిక నైపుణ్యాలతో కూడిన శిక్షణ అందించాల్సిన అవసరాన్ని వివరించారు.

ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం 65 పారిశ్రామిక శిక్షణా సంస్థలను (ఐటీఐలు) అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లుగా ఆధునీకరిస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. మరో 54 అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్ల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని, వచ్చే ఏడాది నాటికి మొత్తం 122 అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. తద్వారా యువతకు పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన ఆధునిక సాంకేతిక శిక్షణ అందించి ఉపాధి అవకాశాలను మెరుగుపరచవచ్చని పేర్కొన్నారు.

అంతర్జాతీయ ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా నైపుణ్యం కలిగిన మానవ వనరులకు పెరుగుతున్న డిమాండ్‌ను ప్రస్తావిస్తూ, ఇటీవల జపాన్, జర్మనీ దేశాల్లో పర్యటించిన సందర్భంగా అక్కడ ప్రతి సంవత్సరం లక్షలాది ఉద్యోగాలు ఖాళీగా ఉన్నప్పటికీ, తగినంత మానవ వనరులు అందుబాటులో లేకపోవడం, వృద్ధాప్య జనాభా పెరుగుదల కారణంగా ఆ ఉద్యోగాలను భర్తీ చేయలేకపోతున్న పరిస్థితిని గమనించినట్లు మంత్రి తెలిపారు. ఈ పరిస్థితి భారతీయ యువతకు అంతర్జాతీయ స్థాయిలో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు గొప్ప అవకాశమని పేర్కొన్నారు. ఆయా దేశాల అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం, అర్హతలను యువత సంపాదించుకోవాలని సూచించారు. భారతీయులు ఏ దేశానికి వెళ్లినా అక్కడి సమాజంతో సులభంగా కలిసిపోగలగడం, పరిస్థితులకు అనుగుణంగా మారగలగడం, కష్టపడి పనిచేసే స్వభావం కలిగి ఉండటం వారి ప్రత్యేకతలని పేర్కొన్నారు. ఈ లక్షణాలను సరైన నైపుణ్యాలతో జోడిస్తే అంతర్జాతీయ ఉద్యోగ విపణిలో మరింత మెరుగైన అవకాశాలను సాధించవచ్చని అన్నారు. పెట్టుబడులను ఉపాధి కల్పనగా మలచాలని తెలుపుతూ

తెలంగాణలో పెట్టుబడులు, పారిశ్రామిక అభివృద్ధి అవకాశాలను ప్రస్తావిస్తూ, గత సంవత్సరం నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ ద్వారా రాష్ట్రానికి రూ. 5.74 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు లభించినట్లు మంత్రి తెలిపారు. ఈ పెట్టుబడి అవకాశాలను పారిశ్రామిక విస్తరణ, ఆర్థిక కార్యకలాపాల పెంపు, యువతకు ఉపాధి కల్పనగా మలచడంలో నైపుణ్యం కలిగిన మానవ వనరులు కీలకమని పేర్కొన్నారు.

సుస్థిర ఆర్థిక వృద్ధి సాధనకు పెట్టుబడులతో పాటు మానవ వనరుల అభివృద్ధి, పరిశ్రమలు–విద్యాసంస్థల మధ్య సమన్వయం, మారుతున్న పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందించడం అత్యంత అవసరమని మంత్రి ఉద్ఘాటించారు. ఈ ముగింపు కార్యక్రమంలో డాక్టర్ ఎం.సి.ఆర్. హెచ్.ఆర్.డి.ఐ. డైరెక్టర్ జనరల్ శాంతికుమారి, అదనపు డైరెక్టర్ జనరల్ అనితా రామచంద్రన్, ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి. మూర్తి, ఇతర ప్రముఖ విద్యావేత్తలు, పరిశోధకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

డాక్టర్ ఎం.సి.ఆర్. హెచ్.ఆర్.డి.ఐ. స్వర్ణోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ రెండు రోజుల జాతీయ సదస్సులో దాదాపు 12 రాష్ట్రాలకు చెందిన సుమారు 200 మంది పరిశోధనా పత్రాల సమర్పకులు, విద్యావేత్తలు, విధాన నిపుణులు పాల్గొన్నారు. ఆర్థిక వృద్ధి, పర్యావరణ సుస్థిరత, ప్రజా విధానాలు, సమర్థవంతమైన పరిపాలన వంటి కీలక అంశాలపై జాతీయ స్థాయిలో చర్చలు, పరిశోధనా పత్రాల సమర్పణలు, అనుభవాల మార్పిడికి ఈ సదస్సు వేదికగా నిలిచింది.

# ఎలెక్ట్రానిక్ రంగాన్ని దేశ అభివృద్ధికి భాగం చేసిన ఎ ఎస్ రావు

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబరు 31:



హైదరాబాద్ నగరం లో ఎలెక్ట్రానిక్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ను ప్రారంభించి దేశ అభివృద్ధిలో ఎలెక్ట్రానిక్ రంగాన్ని భాగం చేసిన ఎ ఎస్ రావు గా ఖ్యాతి గాంచిన అయ్యగారి సాంబశివ రావు సేవలు సదా స్మరణీయం అని ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె వి రమణ అన్నారు రవీంద్ర భారతి లోని పైడి జయరాజ్ థియేటర్ లో కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ డాక్టర్ ఏ ఎస్ రావు విజ్ఞాన వేదిక సంయుక్త నిర్వహణలో ప్రఖ్యాత ఎలెక్ట్రానిక్ ఇంజనీర్ పద్మ భూషణ్ లేదా గ్రహీత ఎ ఎస్ రావు వర్ధంతి సభ జరిగింది ముఖ్య అతిథిగా డాక్టర్ రమణ మాట్లాడుతూ నిరాడంబర జీవితం గడిపిన ఏ ఎస్ రావు దేశం గర్వించే శాస్త్ర వేత్త అన్నారు ఆయన జీవిత కథ డాక్యుమెంటరీ నీ ప్రతి విద్యా సంస్థ లో ప్రదర్శన చేస్తే విద్యార్థులు స్ఫూర్తి పొందుతారనీ అన్నారు వినయ కుమార్ మంచి కార్యక్రమానికి సహకరించినందుకు ధన్య వాదాలు తెలిపారు వేదిక పై సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి వినయ కుమార్ మిథనీ సి యం డి డాక్టర్ యెస్ వి నారాయణ మూర్తి విజ్ఞాన వేదిక అధ్యక్షుడు యాదగిరి కార్యదర్శి పి బి చారి సినీ నటుడు సుబ్బరాయ శర్మ తదితరులు పాల్గొనగా కిన్నెర రఘురాం స్వాగతం పలికారు తొలుత ఏ ఎస్ రావు జీవిత చరిత్ర ఆధారంగా తీసిన డాక్యుమెంటరీ ప్రదర్శించారు

# తిమ్మాపూర్‌లో ఘనంగా పోచమ్మ తల్లి విగ్రహప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య





యాదాద్రి భువనగిరి, అక్టోబరు31/ట్రైనెట్ న్యూస్:

యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం తిమ్మాపూర్ గ్రామంలో నిర్వహించిన పోచమ్మ తల్లి విగ్రహాప్రతిష్ట కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం గ్రామస్తులు, భక్తులతో కలిసి ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో భక్తి భావం వెల్లివిరిసింది.

# అద్భుత పనితీరుతో దూసుకువెళ్తున్న 'మీ సేవా'

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 31:




తెలంగాణ ప్రజలకు డిజిటల్ ప్రభుత్వ సేవలను మరింత దగ్గర చేస్తూ మీ సేవా కేంద్రాల్లో సెప్టెంబర్–2026 నెలలో అద్భుతమైన పనితీరు నమోదైంది. వీటి ద్వారా మొత్తం 24,61,661 లావాదేవీలు విజయవంతంగా ప్రాసెస్ చేయబడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా గత ఒక్క నెలలో రూ. 585.05 కోట్ల మొత్తంతో లావాదేవీలు జరిగాయి. రాష్ట్రం మొత్తం మీద 5,276 యాక్టివ్ మీసేవ కేంద్రాల ద్వారా ప్రజలకు 393 విభిన్న రకాల సేవలు అందుబాటులో ఉండగా, కొత్తగా మరో 2 సేవలు జతచేయబడ్డాయి. ఇది పౌరులకు ప్రభుత్వ సేవలను మరింత సులభతరం చేసింది.

# కోర్ అర్బన్ లో నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలి

**-ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**



హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్,

అక్టోబర్ 31 : కోర్ అర్బన్ ప్రాంతానికి సంబంధించి తాగునీటి సరఫరా పరిస్థితిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు శనివారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. కోర్ అర్బన్ ప్రాంతంలో గ్రీన్ ట్యాంకర్ల కార్యక్రమాన్ని నవంబర్ 1 నుంచి ప్రారంభించనున్నట్లు ఆయన వెల్లడించారు.

అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు, వాటి సుస్థిర నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. నిర్మాణ పనులు, ల్యాండ్‌స్కేపింగ్, శుభ్రత పనులు, ఇతర తాగునీటితో సంబంధం లేని అవసరాల కోసం అన్ని ప్రభుత్వ శాఖలు శుద్ధి చేసిన నీటిని వినియోగించాలని ఆయన ఆదేశించారు. మురుగునీటి శుద్ధి కేంద్రాల (ఎస్టీపీ) ద్వారా సరఫరా చేస్తున్న శుద్ధి చేసిన నీటి నాణ్యతను నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా ఉందో లేదో అధికారులు క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని సూచించారు.

శుద్ధి చేసిన నీటిని ఎంత పరిమాణంలో రవాణా చేసి సరఫరా చేస్తున్నారో రోజువారీ వివరాలను సమర్పించాలని నవీఐఎంటీ మేనేజింగ్ డైరెక్టర్‌ను ఆదేశించారు.

నవీఐఎంటీ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి తాగునీటి అవసరాల కోసం రూపొందించిన ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికను వివరించారు. మిషన్ భగీరథ కింద అదనంగా 40 వీ+ణ నీటిని సరఫరా చేసే పథకాన్ని నవంబర్ 15వ తేదీ నాటికి పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

అలాగే, జిహెచ్ఎంసి, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్లలో విలీనమైన అన్ని పట్టణ స్థానిక సంస్థలకు వచ్చే ఏడాది ఆగస్టు వరకు మిషన్ భగీరథ ద్వారా బల్క్ వాటర్ సరఫరా కొనసాగుతుందని ఆయన వెల్లడించారు.

ప్రస్తుతం అమలులో ఉన్న తాగునీటి ట్యాంకర్ల సేవల తరహాలోనే, డిమాండ్ మేరకు గ్రీన్ ట్యాంకర్ల ద్వారా శుద్ధి చేసిన నీటిని కూడా వాటర్ బోర్డు సరఫరా చేయనుందని, వినియోగదారులు సులభంగా ఈ సేవలను పొందేందుకు ప్రత్యేక అప్లికేషన్ ద్వారా కూడా ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారని తెలిపారు.

నీటి పొదుపు చర్యల్లో భాగంగా, అవగాహన కార్యక్రమాలు మరియు నీటి సంరక్షణ చర్యల ద్వారా వ్యక్తులు, సంస్థలు, పరిశ్రమల స్థాయిలో నీటి వినియోగాన్ని 20 శాతం తగ్గించేందుకు చర్యలు చేపడుతున్నామని ఆయన వివరించారు.

ఈ సమావేశంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్, హెచ్ఎండిఏ కార్యదర్శి సర్ఫరాజ్ అహ్మద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం

**ఆత్మకూరు(ఎం)క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి బి రాజశేఖర్**

యాదాద్రి భువనగిరి, అక్టోబరు31/ట్రైనెట్ న్యూస్:






రైతులకు నేల సంరక్షణ, నీటి సంరక్షణ, వాతావరణ మార్పులను తట్టుకునే వ్యవసాయ పద్ధతులు, సుస్థిర వ్యవసాయంపై అవగాహన కల్పించేందుకు "ఖేత్ బచావో అభియాన్" కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యంగా ప్రస్తుతం నెలకొన్న ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రస్తుత మరియు భవిష్యత్ తరాల కోసం వ్యవసాయ భూములను సంరక్షించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. పంట అవశేషాలను కాల్చకుండా, దున్నడం ద్వారా నేలలో కలపాలని సూచించారు. దీనివల్ల నేలలో సేంద్రియ కర్బనం పెరిగి, భూసారం మెరుగుపడుతుందని వివరించారు. పచ్చిరొట్ట ఎరువుల వినియోగం, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని సూచించారు.ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి భూసార పరీక్షలు చేయించుకుని సమతుల్య ఎరువుల యాజమాన్యాన్ని పాటించాలని సూచించారు.

2 రైతులకు ఉద్యాన పంటల సాగు, పంటల యాజమాన్య పద్ధతులు మరియు ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కల్పించడం.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్, ఎంపిడిఓ జె రాములు నాయక్,ఎంపీఓ నారగోని శ్యామ్ కుమార్ గౌడ్,ఆర్ డబ్ల్యూ ఎస్ ఏఈ,వివి జీ రామ్ జీ ఏపీఓ రమేష్ గౌడ్,ఏఈఓ వేణు,పంచాయతీ సెక్రటరీ శేఖర్, రైతులు పాల్గొన్నారు.

# గవర్నర్ శివప్రతాప్ శుక్లా యాదగిరిగుట్ట పర్యటన సందర్భంగా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసిన జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్

యాదాద్రి భువనగిరి, అక్టోబరు31/ట్రైనెట్ న్యూస్:





యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానాన్ని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న గవర్నర్ కి ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు.ముందుగా గవర్నర్ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని వేద పాఠశాలను సందర్శించి, అక్కడ నిర్వహించిన 26వ వేద విద్వన్మహాసభల్లో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం భోజనం స్వీకరించి తిరుగు ప్రయాణమయ్యారు.గవర్నర్ పర్యటన నేపథ్యంలో జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ ప్రోటోకాల్ నిబంధనలకు అనుగుణంగా పర్యటన ప్రారంభం నుంచి ముగిసే వరకు పటిష్టమైన పోలీసు బందోబస్తు, భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు అధికారులు, సిబ్బందికి తగిన సూచనలు చేస్తూ బందోబస్తు నిర్వహించారు.ఈ పర్యటనలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్ మరియు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, దేవాదాయ శాఖ కమిషనర్ ఎం. హనుమంతరావు, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఐఏఎస్,ఆలయ ఈఓ భవానీ శంకర్,అదనపు ఎస్పీ లక్ష్మీనారాయణ,వినోద్ కుమార్ డీఎస్పీలు శ్రీనివాస్ నాయుడు, సురేష్, ప్రసాద్,సీఐలు, ఆర్ఐలు,ఎస్ఐలు ఇతరపోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.గవర్నర్ పర్యటన ప్రశాంతంగా, సజావుగా ముగిసేలా యాదాద్రి భువనగిరి జిల్లా పోలీస్ శాఖ సమన్వయంతో బందోబస్తు విధులు నిర్వహించింది.

# సుంకరి శేట్టయ్య కుటుంబాన్ని మరోసారి పరామర్శించిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



యాదాద్రి భువనగిరి, అక్టోబరు31/ట్రైనెట్ న్యూస్:

యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం సీనియర్ నాయకుడు మాదాపూర్ గ్రామానికి చెందిన స్వర్గీయ సుంకరి శేట్టయ్య కుటుంబాన్ని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మరోసారి పరామర్శించారు. వీరి వెంట తుర్కపల్లి మండల కాంగ్రెస్ పార్టీ, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## రోడ్డుపై గుంత.. దుర్గంధంపై ఎమ్మెల్యే ఆగ్రహం

చిన్నశివునూర్ లో రహదారి దుస్థితిని పరిశీలించిన కొత్త ప్రభాకర్ రెడ్డి





చేగుంట మండలం చిన్నశివునూర్ గ్రామ శివారులో చేగుంట-గజ్వేల్ ప్రధాన రహదారిపై స్థానిక ఎల్లమ్మ దేవాలయం సమీపంలో ఏర్పడిన పెద్ద గుంతను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పరిశీలించారు.రహదారిపై ఏర్పడిన గుంతలో పరిసర ఇళ్ల నుంచి వెలువడుతున్న మురుగునీరు చేరడంతో ఆ ప్రాంతమంతా దుర్గంధభరితంగా మారింది. ప్రధాన రహదారిపై గుంత ఉండటంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ పరిస్థితిపై ఎమ్మెల్యే అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యం వాహనాలు రాకపోకలు సాగించే ప్రధాన రహదారిపై ఇంత పెద్ద గుంత ఏర్పడినా సంబంధిత అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. మురుగునీరు రోడ్డుపైకి చేరడం వల్ల స్థానికులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న ఈ సమస్యపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, రహదారిపై గుంతను మరమ్మత్తు చేయడంతో పాటు మురుగునీరు రోడ్డుపైకి చేరకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే సూచించారు.

## కొనుగోలు కేంద్రన్ని ప్రారంభించిన సర్పంచ్ శ్రీధర్



రైతులకు మద్దతు ధర కల్పించి, వారి పంటలను సజావుగా కొనుగోలు చేసేందుకు చేగుంట మండల పరిదిలోని అన్నంత సాగర్ గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను సర్పంచ్ శ్రీధర్ ఉపసర్పంచ్ స్వామి , పంచాయతీ సెక్రటరీ సునంద ,తో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు తమ వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వ నిబంధనల ప్రకారం విక్రయించుకోవాలని సూచించారు, ఈ కార్యక్రమం లో సీసీ శ్వేతా ఉపసర్పంచ్ స్వామి సెక్రటరి సునంద జీపీఓ మహేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు బాల్ రెడ్డి, కాషాబోయినా శ్రీనివాస్,వార్డ్ సభ్యులు వెంకటేశంగారి సిద్ధిరములు వెంకటేశంగారి సిద్ధిరములు సదక్ పాషా మాసైపేట్ శ్రీనివాస్, సి ఏ ఆంజనేయులు, స్వప్న, పురుషోత్తం కృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

## సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్ల పంపిణీ





ఈరోజు సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని మెట్టుగూడ డివిజన్‌లోని ఎంసీఆర్ ప్రజాసేవ బీజేపీ కార్యాలయం వద్ద బీజేపీ సీనియర్ నాయకులు ఎంసీఆర్ మేకల చంద్రశేఖర రావు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ సిటీ అధ్యక్షుడు భరత్ గౌడ్ గారు సికింద్రాబాద్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే మేకల సారంగపాణి గారు హాజరయ్యారు.

అలాగే నాగేశ్వర్ రెడ్డి గారు' ప్రభు గుప్తా గారు, మంజుల గారు, భానుమతి గారు, రాజేష్ గారు, తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ఇతర ప్రముఖులకు నిర్వాహకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కార్యక్రమ వేదిక: ఎంసీఆర్ ప్రజాసేవ బీజేపీ కార్యాలయం, మెట్టుగూడ డివిజన్, సికింద్రాబాద్ నియోజకవర్గం.

## పరిగిలో ఘనంగా 'సేవా సంకల్ప అభియాన్' బహుమతుల ప్రధానోత్సవం





ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 25 సంవత్సరాల సుపరిపాలన, సేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప అభియాన్' కార్యక్రమంలో భాగంగా '25 క్రోర్స్ చిల్డ్రన్స్ డ్రీమ్స్ కార్యక్రమాన్ని పరిగి అసెంబ్లీ పరిధిలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడం వారి సృజనాత్మకతకు ప్రోత్సాహం అందించడం లక్ష్యంగా వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు.విద్యార్థుల కలలకు రెక్కలు తొడిగి, వారి భవిష్యత్తుపై ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు శనివారం పరిగిలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు.ఈ బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సేవా సంకల్ప అభియాన్ రాష్ట్ర కన్వీనర్ పెద్దింటి నవీన్ కుమార్, వికారాబాద్ జిల్లా కో-కన్వీనర్ బి. రామచంద్రయ్య, వికారాబాద్ జిల్లా సీనియర్ నాయకులు రాము యాదవ్,పెంటయ్య గుప్తా, సేవా సంకల్ప అభియాన్ కో-కన్వీనర్ అనూష బాబ్జి, అసెంబ్లీ కన్వీనర్ నరసింహ,పరిగి పట్టణ అధ్యక్షులు గుండేపల్లి బాలకృష్ణారెడ్డి, పరిగి మండల అధ్యక్షురాలు నీరటి అనసూయ శ్యాంసుందర్, పరిగి పట్టణ కన్వీనర్లు కోళ్ల నరసింహ,రామ్ చందర్ నాయక్,కావలి లక్ష్మి హాజరై విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థిలో ఒక గొప్ప శక్తి ఒక అద్భుతమైన ప్రతిభ దాగి ఉంటుంది. మీ కలలు ఎంత పెద్దవిగా ఉంటే, వాటిని సాధించాలనే మీ సంకల్పం కూడా అంతే బలంగా ఉండాలి అని అన్నారు.ఈ రోజు మీరు గీసిన ఒక చిత్రం, రాసిన ఒక వ్యాసం కేవలం పోటీ కోసం మాత్రమే కాదు మీలోని ఆలోచనలకు, మీ కలలకు, మీ భవిష్యత్తుకు ప్రతిబింబం. ఓటమిని చూసి వెనక్కి తగ్గకుండా, ప్రతి ప్రయత్నాన్ని ఒక కొత్త పాఠంగా తీసుకుని ముందుకు సాగాలి అని విద్యార్థులకు సూచించారు.

ఈరోజు తరగతి గదిలో కూర్చున్న విద్యార్థులే రేపటి శాస్త్రవేత్తలు, వైద్యులు, ఉపాధ్యాయులు, ఇంజనీర్లు, సైనికులు, క్రీడాకారులు, ప్రజాప్రతినిధులు, దేశ నాయకులు అవుతారు అని అన్నారు.విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమశిక్షణ, కష్టపడే తత్వం, దేశభక్తి, సేవాభావం మరియు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## భారత మాజీ ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరా గాంధీ గారి 42వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు



ఈరోజు 19వ డివిజన్ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో భారత మాజీ ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరా గాంధీ గారి వర్ధంతి సందర్భంగా 19వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోలేపాక అంజయ్య గారు వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో , శక్తి సాయినగర్ డివిజన్ అధ్యక్షులు కిట్టు గారు, హెచ్ఎంటీ నగర్ డివిజన్ అధ్యక్షులు మహేష్ గారు పాల్గొన్నారు.

అలాగే ముఖ్య నాయకులు అశ్వద్ధామ రెడ్డి గారు, సీతారామ రెడ్డి గారు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఇంజ మల్లేష్ గారు, జెమినీ గారు, సమ్మయ్య గారు, నరేందర్ గారు, శ్రీనివాస్ రెడ్డిగారు , యాదన్న గౌడ్ గారు, అనిల్ గారు సురేష్ గౌడ్ గారు జానీ గారు, బాబు గారు, పంగ యాకూబ్ గారు, కాంతారావు గారు, లాజర్ గారు గడ్డం యాదగిరి గారు, బి. అంజయ్య గారు మరియు మహిళా నాయకురాలు రజిత రాణి గారు పాల్గొన్నారు

## ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా కొవ్వొత్తులు వెలిగించి నివాళులు

### ఘనంగా నివాళులర్పించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



భారత మాజీ ప్రధానమంత్రి, ఉక్కు మహిళగా పేరుగాంచిన స్వర్గీయ ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా పరిగి పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆమె విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దేశ సమగ్రత, సమైక్యత, అభివృద్ధి కోసం ఇందిరా గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు.దేశం కోసం ఆమె చేసిన త్యాగాలు, ధైర్యసాహసాలు, ప్రజా సంక్షేమం కోసం తీసుకున్న నిర్ణయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.పేదలు, రైతులు, మహిళలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆమె చేపట్టిన కార్యక్రమాలు దేశ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాయని తెలిపారు.దేశ ఐక్యత, ప్రజాస్వామ్య విలువలు, లౌకికవాద పరిరక్షణ కోసం ఆమె చేసిన కృషిని స్మరించుకున్నారు.ఇందిరా గాంధీ ఆశయాలు, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్తూ ప్రజాసేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కే.రజిత వెంకటేష్, వైస్ చైర్మన్ హనుమంతు కమల్, డాక్టర్ నరేందర్,హరిచందర్ నాయక్, రవి కాంత్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రామచంద్రారెడ్డి, చిన్న

## ప్రాణాలకు తెగించి విద్యుత్ పునరుద్ధరణ పనులు.. సిబ్బందికి మంత్రి గొట్టిపాటి అభినందనలు



**అమరావతి, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 31:**

అర్నబ్ తుపాను సృష్టించిన విధ్వంసంతో ఏర్పడిన విద్యుత్ అంతరాయాలను తొలగించేందుకు ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న విద్యుత్ సిబ్బందిపై ఏపీ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రశంసలు కురిపించారు. వారి అంకితభావం, కార్యదీక్ష తనను ఎంతగానో కదిలించాయని ఎమోషనల్ ట్వీట్ చేశారు. పాలకొల్లు సెక్షన్ పరిధిలోని ఆగర్తిపాలెం విద్యుత్ సిబ్బంది 11 కేవీ విద్యుత్ లైన్ పునరుద్ధరణ కోసం చేస్తున్న కృషిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. చుట్టూ జడివాన, మెడలోతు చేపల చెరువుల్లో సైతం ప్రాణాలను లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సేవలను కొనియాడారు. ఇది కేవలం విధి నిర్వహణ మాత్రమే కాదని, ప్రజల ఇళ్లలో వెలుగులు నింపేందుకు ప్రాణాలను సైతం పణంగా పెట్టే నిజమైన ప్రజాసేవ అని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో నిరంతరం శ్రమిస్తున్న ప్రతి విద్యుత్ కార్మికుడికి, అధికారుల బృందానికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని తెలిపారు. విద్యుత్ పునరుద్ధరణ పనులు పూర్తయ్యే వరకు ప్రజలు సంయమనం పాటించాలని, కష్టపడి పనిచేస్తున్న సిబ్బందికి సహకరించి అండగా నిలవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

## ఓటుహక్కు పరిరక్షణ కోసం చలో ఢిల్లీని విజయవంతం చేయాలి: మంత్రి పొంగులేటి



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 31:**

ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటుహక్కు కాపాడేందుకు నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న చలో ఢిల్లీ నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. ఓటుహక్కు పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ గళమెత్తి ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటాలని కోరారు.

ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో అర్హులైన కోట్లాది మంది ఓటర్ల పేర్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని, ఇది ప్రజల ఓటుహక్కుకు భంగం కలిగిస్తోందని మంత్రి ఆరోపించారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో దేశవ్యాప్త ఉద్యమం కొనసాగుతోందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఢిల్లీలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకునేందుకు ప్రజాస్వామ్యవాదులంతా ఐక్యంగా ఈ నిరసనలో పాల్గొని సంఘీభావం తెలపాలని విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్ శ్రేణులతో పాటు ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కోరారు.

## సామాజిక భద్రతా పింఛన్లలో ఇన్‌స్టంట్ పెన్షన్.. తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 31:**

సామాజిక భద్రతకు పెద్దపీట వేస్తూ తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. పింఛన్‌దారులైన భర్తలు మరణిస్తే వారి భార్యలకు తక్షణమే పింఛన్ మంజూరు చేసే ఇన్‌స్టంట్ పెన్షన్ సదుపాయాన్ని మరిన్ని కేటగిరీలకు విస్తరించింది. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, డయాలసిస్, హెచ్ఐవీ, ఫైలేరియా బాధితుల కుటుంబాలకు ఈ సదుపాయం కల్పించనున్నారు.




ఇప్పటివరకు వృద్ధాప్య పింఛన్ పొందుతున్న భర్త మరణిస్తే భార్యకు మాత్రమే ఈ సదుపాయం ఉండగా, తాజాగా ఇతర సామాజిక భద్రతా పింఛన్లకు కూడా వర్తింపజేస్తూ ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది.

నిబంధనల ప్రకారం మరణించిన పింఛన్‌దారుడి భార్య వయస్సు 57 ఏళ్లలోపు ఉంటే వితంతు పింఛన్, 57 ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువ ఉంటే వృద్ధాప్య పింఛన్ మంజూరు చేస్తారు.

అర్హులైన మహిళలు గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శికి, పట్టణ ప్రాంతాల్లో బిల్ కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకోవాలి. ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, మరణించిన భర్త ఆధార్ కార్డు, మరణ ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. అధికారులు పత్రాలను పరిశీలించి, చెయ్యూత పోర్టల్‌లో వివరాలు నమోదు చేసిన అనంతరం పింఛన్ మంజూరు చేస్తారు.

భర్తను కోల్పోయిన మహిళలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా తక్షణ ఆర్థిక భరోసా కల్పించడమే ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వం పేర్కొంది.

# ఎల్కతుర్తి మండలంలో బీజేపీ సంస్థాగత నిర్మాణానికి శ్రీకారం

**●నాలుగు గ్రామాల్లో బూత్ కమిటీల ఏకగ్రీవ ఎన్నిక:మంతుర్తి శ్రీకాంత్ యాదవ్**

భారతీయ జనతా పార్టీ సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలో పార్టీ బూత్ కమిటీల ఏర్పాటు కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కేశవపూర్, ఇంద్రనగర్, దండేపల్లి, ఎల్కతుర్తి గ్రామాల్లో నూతన బూత్ కమిటీలను ఏర్పాటు చేసి, పలు బూత్‌లకు అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎల్కతుర్తి గ్రామంలో పలువురు నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరడం ఈ కార్యక్రమంలో ప్రత్యేకతను సంతరించుకుంది.మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నూతన కమిటీల ఎన్నిక ప్రక్రియను చేపట్టారు.

### ఎల్కతుర్తిలో మూడు బూత్‌లకు అధ్యక్షుల ఎన్నిక

ఎల్కతుర్తి గ్రామంలో నూతనంగా మూడు బూత్ కమిటీలను ఏర్పాటు చేసి, 314వ బూత్ అధ్యక్షుడిగా గోడిశాల రాజు, 315వ బూత్ అధ్యక్షుడిగా అల్లి కిరణ్, 316వ బూత్ అధ్యక్షుడిగా గూడెల్లి దశరథంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన అల్లి సురేష్, అల్లి కిరణ్, దశరథం, దూడ రమేష్, కందుకూరి శ్రీనివాస్, కడారి లింగయ్య తదితరులు భారతీయ జనతా పార్టీలో చేరారు.వీరికి మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు అల్లి కుమార్, చిదురల వెంకటేష్, సీనియర్ నాయకులు జనగాని కిష్టయ్య, నాంపల్లి



అశోక్, పెరుగు మధు, కొమ్మిడి విజయేందర్ రెడ్డి, నమిండ్ల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

### దండేపల్లిలో నాలుగు బూత్‌లకు నూతన అధ్యక్షులు

దండేపల్లి గ్రామంలో నాలుగు బూత్ కమిటీలను ఏర్పాటు చేసి, 289వ బూత్ అధ్యక్షుడిగా మాచర్ల వెంకటేష్, 290వ బూత్ అధ్యక్షుడిగా పనుగంటి లక్ష్మారెడ్డి, 291వ బూత్ అధ్యక్షుడిగా కడారి సంపత్ రావు, 292వ బూత్ అధ్యక్షుడిగా కాటుకూరి కార్తీక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ మాచర్ల తిరుపతి, మండల కార్యదర్శి చీర్ర శ్రీనివాస్, నరేడ్ల శంకర్, మాచర్ల శంకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### ఇంద్రనగర్‌లో తొలిసారిగా బీజేపీ బూత్ కమిటీ ఏర్పాటు

ఇంద్రనగర్ గ్రామంలో భారతీయ జనతా పార్టీ చరిత్రలో తొలిసారిగా బూత్ కమిటీని ఏర్పాటు చేశారు. 319వ బూత్ అధ్యక్షుడిగా నమిండ్ల ప్రవీణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు కడారి ప్రసాద్, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

### కేశవపూర్‌లో మూడు బూత్‌లకు అధ్యక్షుల ఎన్నిక

కేశవపూర్ గ్రామంలో మూడు బూత్‌లకు నూతన అధ్యక్షులను ఎన్నుకున్నారు. 320వ బూత్ అధ్యక్షుడిగా ఈర కుమారస్వామి, 321వ బూత్ అధ్యక్షుడిగా పుట్ట కనకయ్య, 322వ బూత్



అధ్యక్షుడిగా గన్నోజు రాకేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు వేల్పుల శ్రీనివాస్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు పోలు నరేష్, మాజీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఎర్రగొల్ల శ్రీనివాస్, సోషల్ మీడియా కన్వీనర్ పోలు శివసేన, జెల్ల రాజు, పోలు రాజు, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రతి బూత్‌ను పటిష్టమైన శక్తి కేంద్రంగా తీర్చిదిద్దుతాం

ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ, పార్టీ సంస్థాగత నిర్మాణంలో బూత్ కమిటీలు అత్యంత కీలకమని పేర్కొన్నారు.గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి ప్రతి బూత్‌లో సమర్థవంతమైన కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.నూతనంగా ఎన్నికైన బూత్ అధ్యక్షులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ స్వాగతం పలుకుతూ, కార్యకర్తలందరూ క్రమశిక్షణ, అంకితభావం, సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.గ్రామస్థాయి నుంచి పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తూ, ప్రతి బూత్‌ను పార్టీకి బలమైన పునాదిగా, పటిష్టమైన శక్తి కేంద్రంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. కార్యకర్తల భాగస్వామ్యంతో భవిష్యత్తులో మరిన్ని సంస్థాగత కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

# ఏకత్వానికి ప్రతిరూపమే జాతీయ ఐక్యతా దినోత్సవం,





**●మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,**

దేశంలోని ప్రజలందరి ఏకత్వానికి ప్రతిరూపమే జాతీయ ఐక్యత దినోత్సవం అని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, (రెవెన్యూ) వి.రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్ లతో హాజరై వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తో జాతీయ ఐక్యతా ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ దేశ సమగ్రత, ఐక్యత, సమైక్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, జాతీయ ఐక్యతా స్ఫూర్తిని పెంపొందిస్తూ దేశ సమగ్రతను పరిరక్షించేందుకు నిరంతరం కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి,

**●మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,**

ప్రజల సంక్షేమం, అభివృద్ధి దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో కొనసాగుతున్న క్రిటికల్ కేర్ ఆసుపత్రి నిర్మాణ పనులను ఆకస్మికంగా సందర్శించి పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులో ఉంచేందుకు 129.25 కోట్ల రూపాయలతో ప్రభుత్వ ఆసుపత్రి, 23.75 కోట్ల రూపాయలతో క్రిటికల్ కేర్ విభాగం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. వైద్య రంగాన్ని బలోపేతం



చేస్తూ ప్రజలకు వేగవంతమైన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చింతలపల్లిలో ఎంఎస్ఎఫ్ నూతన గ్రామ కమిటీ ఏర్పాటు

**●గ్రామ అధ్యక్షుడిగా బొంకూరి దేవ మాదిగ ఎన్నిక**

విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని, విద్యార్థుల్లో సామాజిక చైతన్యం పెంపొందించడంతో పాటు వారి హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాలు, హనుమకొండ జిల్లా నాయకత్వం సూచనల మేరకు ఎల్కతుర్తి మండలం చింతలపల్లి గ్రామంలో శనివారం సాయంత్రం మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) నూతన గ్రామ కమిటీని ఏర్పాటు చేశారు.ఎల్కతుర్తి ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు అడ్డూరి అనిల్ మాదిగ, మండల కార్యదర్శి చిలుముల వినోద్ మాదిగ, ఎంఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు గొల్లమందల చరణ్ మాదిగ ఆధ్వర్యంలో కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సమాజంలో జరుగుతున్న పరిణామాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థుల



సమస్యల పరిష్కారం, విద్యా అవకాశాల సాధన, సామాజిక సమానత్వం, అణగారిన వర్గాల విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం ఎంఎస్ఎఫ్ వేదికగా ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.గ్రామస్థాయిలో విద్యార్థులను సంఘటితం చేసి విద్యా చైతన్యాన్ని విస్తరించడమే నూతన కమిటీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.నూతన కమిటీ గ్రామ అధ్యక్షుడిగా బొంకూరి దేవ మాదిగ, ఉపాధ్యక్షుడిగా అడ్డూరి సుశాంత్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా చుంచు శ్రీశాంత్ మాదిగ, కార్యదర్శిగా బొంకూరి హర్షవర్ధన్ మాదిగ, కోశాధికారిగా బొంకూరి సాయి రితిక్ మాదిగలను ఎన్నుకున్నారు.కమిటీ సభ్యులుగా బొంకూరి బాలు మాదిగ, చుంచు ప్రభుతేజ మాదిగ, బొంకూరి అంజి మాదిగ, చుంచు సాహిత్ మాదిగ, చిలుముల సంజయ్ మాదిగ, బొంకూరి వివేక్ మాదిగ, బొంకూరి వికాస్ మాదిగ తదితరులను ఎంపిక చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు అడ్డూరి నవీన్ మాదిగ, చిలుముల ప్రమోద్ మాదిగ, బొంకూరి అనిల్ మాదిగ, అడ్డూరి సుధాకర్ మాదిగ, అల్లకొండ మహేష్ మాదిగ, బొంకూరి చందు మాదిగ, బొంకూరి తేజ మాదిగ, బొంకూరి ఉదయ్ మాదిగతో పాటు పలువురు మాదిగ విద్యార్థులు పాల్గొన్నారు.నూతన కమిటీ విద్యార్థుల ఐక్యతకు వేదికగా నిలిచి, గ్రామంలో విద్యా చైతన్యాన్ని పెంపొందిస్తూ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు.

# జిల్లాలోని రైస్ మిల్లర్లతో మరియు డిఫాల్ట్ మిల్లర్లతో శ్రీ కె మనోహర్ కుమార్ రాథోడ్ జాయింట్ కమిషనర్





పౌరసరఫరాల కార్యాలయం హైదరాబాద్ గారు మన జిల్లాకు ప్రత్యేక అధికారిగా నియమించిన బడినారు సదరు అధికారి అయిన శ్రీ జాటోతు మనోహర్ కుమార్, ఈరోజు జిల్లాలోని రైస్ మిల్లర్స్ అందరితో కలెక్టరేట్ ఎన్ఐసి హాలులో సమీక్షా సమావేశం నిర్వహించినారు ఇట్టి సమావేశములో రైస్ మిల్లురకు ( సిఎంఆర్ ) బియ్యం రాబట్టుకోవడానికి మిల్లుల వారిగా రోజువారి లక్ష్యాలను నిర్దేశించడం జరిగింది. డిఫాల్ట్ మిల్లర్లనుండి 45 రోజులలో ( సిఎంఆర్ ) బకాయిలు చెల్లించాలి అని ఆదేశించడం జరిగింది. ఇట్టి సమావేశములో అదనపు కలెక్టర్ కె అనిల్ కుమార్ , జిల్లా పౌరసరఫరా అధికారి జీ. రమేష్ , జిల్లా పౌర సరఫరా మేనేజర్ జి .మనోజ్ కుమార్, డిప్యూటీ తహశీల్దార్ (పౌరసరఫరాలు) పాల్గొనడం జరిగింది.జిల్లా పౌర సరఫరా అధికారి, మహబూబాబాద్.

# ఒకే దేశం-ఒకే ఎన్నిక అంశంపై వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్,

ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంచిర్యాలలో ఒకే దేశం–ఒకే ఎన్నిక , అనే అంశంపై శనివారం రోజున వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ మంచిర్యాల జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంచిర్యాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జై కిషన్ ఓజా, అధ్యక్షత వహించారు, ఒకే దేశం–ఒకే ఎన్నిక, అనే అంశంపై డిగ్రీ కళాశాలల విద్యార్థిని విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు, ఒకే దేశం–ఒకే ఎన్నిక, అంశంపై ప్రసంగించడానికి ప్రతి విద్యార్థిని, విద్యార్థులకు, మూడు నిమిషాల చొప్పున కాలవ్యవధిని న్యాయ నిర్ణేతలు నిర్ణయించారు, డిగ్రీ విద్యార్థులు ఎంతో ఆసక్తితో స్వేచ్ఛాయుతమైన వాతావరణంలో వారి యొక్క ప్రసంగాల్ని చాలా ఉత్సాహంగా వ్యక్తిపరిచారు, ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంచిర్యాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ జై కిషన్ ఓజా, మాట్లాడుతూ ఒకే దేశం–ఒకే ఎన్నికపై, అంశం పై నిర్వహించిన



సెమినార్ లో (1)ఏ. కార్తీక్, (ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంచిర్యాల) 2, శివ నందిని (వాగ్దేవి డిగ్రీ కళాశాల),3 సాయి విగ్నేష్, (మి మ్స్), డిగ్రీ కళాశాల విద్యార్థులు మొదటి మూడు స్థానాలు సాధించినట్లు, విద్యార్థిని, విద్యార్థులు, చక్కగా పలు అంశాలను వివరించారని, విద్యార్థులను అభినందిస్తున్నట్టు యువత ఎన్నికల్లో పాల్గొంటూ ఎన్నికలపై అవగాహన లేని వారికి చైతన్యం కలిగించాలని, నాయకుల్ని ఎన్నుకునే విధానంలో



ఓటర్ ప్రాధాన్యతే ఎక్కువగా ఉంటుందని, దేశ అభివృద్ధికి ఎన్నికలు ఎంతో కీలకమని, ఓటు వేసే సమయంలో ఇలాంటి ప్రలోభాలకు లొంగకుండా, దేశ భవిష్యత్తు అంతా నేటి యువత చేతుల్లో ఉందని, విద్యార్థిని విద్యార్థులకు హితవు పలికారు, ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఎం. కుమారస్వామి, అధ్యాపకులు, పాల్గొన్నారు

# అర్హులైన పట్టభద్రులు గడువులోగా ఓటరుగా నమోదు చేసుకోవాలి .

**మాజీ జడ్పిటిసి కండె హరిప్రసాద్.**

మహబూబ్‌నగర్ -- రంగారెడ్డి -- హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హులైన పట్టభద్రులు నవంబర్ 6వ తేదీలోగా తమ ఓటును నమోదు చేసుకోవాలని బీజేపీ నాయకులు, మాజీ జడ్పిటిసి కండె హరిప్రసాద్. ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరు నమోదును పూర్తి చేసుకోవాలని సూచించారు. నిర్ణీత గడువులోగా ఓటరు నమోదు చేసుకొని, రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని



పిలుపునిచ్చారు.

# వీబీజీ రామ్ జి పథకంలో నీటి సంరక్షణ,

# 36 ఏళ్ల ఆర్టీసీ ప్రస్థానానికి వీడ్కోలు.. డ్రైవర్ రాములు పదవీ విరమణ

**●ఆర్టీసీ సంస్థకు రాములు సేవలు అభినందనీయం --హింగే భాస్కర్**

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి గ్రామానికి చెందిన గుడేల్లి రాములు ఆర్టీసీ సంస్థలో 36 సంవత్సరాల పాటు అంకితభావంతో సేవలందించి శనివారం పదవీ విరమణ పొందారు.హనుమకొండ లోకల్ డిపోలో డ్రైవర్‌గా విధులు నిర్వహించిన ఆయన, సుదీర్ఘకాలం పాటు ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణ సేవలు అందిస్తూ ఆర్టీసీ సంస్థ అభివృద్ధిలో తనవంతు పాత్ర పోషించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను గుర్తు చేసుకుంటూ హింగే భాస్కర్ గుడేల్లి రాములును శాలువాతో ఘనంగా సత్కరించి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హింగే భాస్కర్ మాట్లాడుతూ.. 36 సంవత్సరాల పాటు ఆర్టీసీ సంస్థలో క్రమశిక్షణ, నిబద్ధత, అంకితభావంతో విధులు నిర్వహించడం అభినందనీయమని



అన్నారు. డ్రైవర్‌గా బాధ్యతాయుతమైన వృత్తిని చేపట్టి వేలాది మంది ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చడంలో రాములు చేసిన సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. ఉద్యోగ జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు, సవాళ్లను ఎదుర్కొంటూ విధులకు ప్రాధాన్యతనిస్తూ సేవలందించిన రాములు, పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. ఆయనకు భగవంతుడు సంపూర్ణ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు ప్రసాదించాలని, కుటుంబ సభ్యులతో కలిసి నిండు నూరేళ్లు ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భాషబోయిన కుమార్ యాదవ్, టీచర్ కుమార్, కందుకూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొని గుడేల్లి రాములును ఘనంగా అభినందించి పదవీ విరమణ శు భాకాంక్షలు తెలిపారు.

# భూగర్భ జలాల పెంపుదలకు చర్యలు,

**●జైపూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి బి. ఉదయ్ కుమార్,**

జైపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో వీబీజీ రామ్ జి పథకంలో భాగంగా నీటి సంరక్షణ మరియు భూగర్భ జలాల పెంపుదల లక్ష్యంగా బోర్‌వెల్ రీఛార్జ్ నిర్మాణాలు, తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో కమ్యూనిటీ సోక్ పిట్‌ల నిర్మాణాలకు సంబంధించి మార్కౌట్ ఇవ్వడం జరిగిందని జైపూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి బి. ఉదయ్ కుమార్ తెలిపారు, ఈ సందర్భంగా జైపూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి బి. ఉదయ్ కుమార్, మాట్లాడుతూ నిర్మాణాల ద్వారా వర్షపు నీటిని సమర్థవంతంగా ఒడిసి



పట్టి, భూగర్భ జలాల నిల్వలను పెంపొందించడంతోపాటు నీటి వనరుల సంరక్షణకు దోహదపడుతుందని అన్నారు, ఈ కార్యక్రమంలో జైపూర్ తహసిల్దార్ వనజా రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ రాజ మల్లయ్య, జైపూర్ సర్పంచ్ కూన భాస్కర్, ఈసీ రాజ మొగిలి, పాల్గొన్నారు

# మానవత్వానికి మరో చిరునామా "మహర్షి" సేవా సంస్థ.

- **మేడారం చిన్నారి యువిన్‌కు కృత్రిమ కాలు అమరిక.**

ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తూ, ఆపన్నులకు చేయూతనిస్తూ కొనసాగుతున్న 'మహర్షి' స్వచ్ఛంద సేవా సంస్థ సేవా ప్రస్థానంలో మరో మానవీయ ఘట్టం చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తు కాలును కోల్పోయి ఏడు నెలలుగా మంచానికే పరిమితమైన ఓ చిన్నారికి కృత్రిమ కాలు అమర్చించి, అతడి జీవితంలో కొత్త ఆశలు చిగురింపజేశారు. ములుగు జిల్లా, తాడ్వాయి మండలం,మేడారం గ్రామానికి చెందిన సిద్ధబోయిన రమేష్, స్వప్న దంపతుల పెద్ద కుమారుడు యువిన్ ఏడు నెలల క్రితం ప్రమాదవశాత్తు కాలును కోల్పోయాడు. అప్పటి నుంచి బాలుడు నడవలేని పరిస్థితిలో ఉండటంతో తల్లిదండ్రులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. తమ కుమారుడు మళ్లీ ఎప్పుడు నడుస్తాడోనని ఎదురుచూస్తున్న ఆ తల్లిదండ్రులకు మహర్షి స్వచ్ఛంద సేవా సంస్థ రూపంలో ఆశాకిరణం కనిపించింది.ఈ క్రమంలో అక్టోబర్ 16న సమ్మక్క సారలమ్మ దర్శనానికి మేడారం వెళ్లిన భద్రాద్రి



కొత్తగూడెం జిల్లా, పినపాక మండలానికి చెందిన మహర్షి స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు తోలెం శ్రీనివాసరావు బాలుడి పరిస్థితిని తెలుసుకున్నారు. చిన్నారి దీనస్థితిని చూసి బాలుడికి కృత్రిమ కాలు ఏర్పాటు చేయిస్తానని తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు.ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ విజయవాడలోని మూల్యాంకన కేంద్రం ద్వారా జపాన్ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన కృత్రిమ కాలును ఉచితంగా సమకూర్చేందుకు కృషి చేశారు. దాత కస్తూరి శ్రీనివాసరావు దంపతుల ఆర్థిక సహకారంతో పాటు మేనేజర్ జిన్ను నాగరాజు సహకారం, సమన్వయంతో అక్టోబర్ 30న బాలుడు యువిన్‌కు కృత్రిమ కాలును అమర్చారు.ఏడు నెలలుగా మంచానికే పరిమితమైన తమ కుమారుడు కృత్రిమ కాలు సహాయంతో తిరిగి నడవడం చూసి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమ బిడ్డలో మళ్లీ ఆత్మవిశ్వాసం కనిపిస్తుండటంతో వారి సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. ఈ సందర్భంగా తమ కుమారుడికి ఉచితంగా కృత్రిమ కాలు ఏర్పాటు చేయించిన తోలెం శ్రీనివాసరావుకు, సహకరించిన దాతలకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

- **సేవే లక్ష్యంగా.. మానవత్వమే మార్గంగా....!**

ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడమే నిజమైన సేవకు నిదర్శనమని ఈ కార్యక్రమం మరోసారి చాటిచెప్పింది. కేవలం హామీ ఇవ్వడమే కాకుండా, ఇచ్చిన మాటను కార్యరూపంలో పెట్టి ఓ చిన్నారి జీవితంలో సంతోషాన్ని నింపిన మహర్షి స్వచ్ఛంద సేవా సంస్థ సేవలను పలువురు అభినందిస్తున్నారు. భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగించాలని స్థానికులు, ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

# ప్రత్యేక విద్యా సహకారానికి " ప్రశాస్త్ "తోడ్పాటు : ఎంఈఓ కొమరం నాగయ్య.



ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులను గుర్తించి, వారికి తగిన విద్యా సహకారం అందించేందుకు రూపొందించిన ప్రశాస్త్ అనువర్తనంపై పినపాక మండల స్థాయి అవగాహన కార్యక్రమాన్ని మండల విద్యాశాఖ అధికారి కొమరం నాగయ్య ఆధ్వర్యంలో పినపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుల ప్రవేశం ద్వారా తరగతి ఉపాధ్యాయులకు విద్యార్థుల పరిశీలన బాధ్యతలు కేటాయించే విధానం, ఉపాధ్యాయుల ప్రవేశం ద్వారా తరగతిలోని ప్రతి విద్యార్థిని పరిశీలించి వివరాలు నమోదు చేసే ప్రక్రియపై అవగాహన కల్పించారు. విద్యార్థులను పరిశీలనకు అర్హులుగా గుర్తించడం, అవసరం లేనివారిగా నమోదు చేయడం వంటి అంశాలను వివరించారు.

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను ప్రాథమిక దశలోనే గుర్తించడం ద్వారా వారికి అవసరమైన విద్యా సదుపాయాలు, తగిన సహకారం అందించవచ్చని, ఈ విధానాన్ని ఉపాధ్యాయులందరూ అమలు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పినపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామిరెడ్డి, ప్రత్యేక ఉపాధ్యాయురాలు దీవెన, వనరుల వ్యక్తి సంతోష్, సమ్మిళిత విద్య వనరుల ఉపాధ్యాయురాలు అంబికతో పాటు మండలంలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,సంక్లిష్ట వనరుల కేంద్రాల సమన్వయకర్తలు పాల్గొన్నారు.

# మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని వర్ధంతి వేడుకలు.




దేశ ఐక్యత, సమగ్రతతో పాటు ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. పినపాక మండలం, ఏడూళ్ల బయ్యారం క్రాస్‌రోడ్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఇందిరాగాంధీ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పేరం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె దేశానికి అందించిన సేవలను, తీసుకున్న కీలక నిర్ణయాలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పేరు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశ ప్రధానిగా ఇందిరాగాంధీ ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ దేశ అభివృద్ధికి విశేష కృషి చేశారని, పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ఆమె చేపట్టిన కార్యక్రమాలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. దేశ సమగ్రత, ఐక్యత కోసం ఆమె చూపిన తెగువ, నాయకత్వ లక్షణాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు.రాజకీయాలకు అతీతంగా దేశం కోసం అంకితభావంతో పనిచేసిన మహానేతల ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ఇందిరాగాంధీ ప్రజాసేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో డీసీసీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ బోడ రమేష్, బూర్గంపాడు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ తొలేం కళ్యాణి, దిశా కమిటీ అధ్యక్షుడు సమ్మయ్య, సర్పంచులు వెంకటేష్, బాబురావు, చందర్రావు, ఉప సర్పంచులు రామ్మోహన్, అచ్చ నవీన్, నిట్టా శిరీష, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కంది సుబ్బారెడ్డి, లక్ష్మారెడ్డి, గుట్టయ్య, సతీష్ , వార్డు సభ్యులు వజ్జ రమేష్, తొలేం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణలో,చట్టాల అమలులో రాజీపడొద్దు: మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్,(ఐపీఎస్)





శాంతిభద్రతల పరిరక్షణతో పాటు చట్టాల అమలులో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడవద్దని మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్ పోలీసు అధికారులను ఆదేశించారు.

వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం రోజున జైపూర్ ఏసీపీ కార్యాలయాన్ని మంచిర్యాల డీ.సీ.పీ, ఏ. భాస్కర్, తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కార్యాలయంలోని వివిధ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. జైపూర్ సబ్ డివిజన్ పరిధిలో దర్యాప్తులో ఉన్న కేసులు,వాటి పురోగతి,నిందితుల అరెస్టులు,ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద నమోదైన కేసుల స్థితిగతులు, పెండింగ్ కేసులపై సమీక్ష నిర్వహించారు. కేసుల దర్యాప్తులో జాప్యానికి గల కారణాలను జైపూర్ ఏసీపీ ఆర్. వెంకటేశ్వర్లును అడిగి తెలుసుకున్నారు.

రౌడీషీటర్లు,హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచి, వారి కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండాలని, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రజలకు మెరుగైన పోలీసింగ్ అందించడంతో పాటు,ప్రతి కేసును నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి, బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జైపూర్ సిఐ కె. నవీన్ కుమార్, చెన్నూర్ సీఐ బన్సీలాల్, కోటపల్లి సీఐ ఎల్. కృష్ణ, జైపూర్ ఎస్సై ఎల్. భూమేష్, పాల్గొన్నారు

# మహబూబాబాద్ జిల్లాలో చికెన్ షాపులకు ఫామ్ నుండి కోళ్లు వస్తాయి మరి మటన్ షాపుల నిర్వాహకులకు అనుమతులు ఉన్నాయా?

- **మటన్ షాపుల నిర్వహణకు నిబంధనలు ఏమిటి? అనుమతులపై ప్రజల్లో చర్చ!**
- **జిల్లాలో మటన్ షాపుల అనుమతులపై సంబంధిత శాఖల అధికారులు స్పందించాలి!**



మహబూబాబాద్ లో మాంసం అమ్మకాలపై పర్యవేక్షణ ఏది? గొర్రెలు మేకల మాంసం నాణ్యతను తనిఖీ చేసే మున్సిపాలిటీ ఫుడ్ ఇన్స్పెక్టర్ తనిఖీలు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కిలో కు వెయ్యి నుండి వెయ్యి వంద రూపాయలు ధర పెట్టి అమ్ముతున్న, మాంసం నాణ్యత పై సరైన పర్యవేక్షణ ఉందా అనే సందేహం ఉంది మరియు మహబూబాబాద్ ప్రజలు మటన్ షాపు యొక్క మొద్దులు మీద వీధి కుక్కలు నీసు వాసనకు రాత్రిపూట కుక్కలు లేదా వేరే జంతువుల వల్ల క్రిమికీటకాలు చేరే అవకాశం ఉంది అవి ప్రజల ఆరోగ్యం పట్ల షాపు యజమానులు తగు జాగ్రత్తలు తీసుకోవడం లేదు. సరైన కబేలా లేక బ్రతికినవి కోస్తున్నారా లేక మరణించినవి తెచ్చి ప్రజలను ఏమార్చుతున్నారా అర్థం కాని పరిస్థితి ఫుడ్ సేఫ్టీ అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు చేస్తారా, షాపులకు సరైన గైడ్ లైన్స్ ఇస్తారా, వ్యర్థాలతో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా పారిశుధ్యతపై అనుమతులు ఉన్నాయా మాంసం పై అధికారుల ముద్ర ఉంటుందా అన్నది పరిశీలించాలి. ప్రజల ఆరోగ్యం దృష్ట సంబంధిత అధికారులు స్పందించి,మహబూబాబాద్ జిల్లాలో ప్రతీ ఆదివారం లేక సాధారణ రోజుల్లో కూడా చికెన్ మటన్ విక్రయాలు భాగా నే సాగుతున్నాయి కానీ ప్రజల ఆరోగ్యం పరిశుభ్రత పాటించని మాంసం వ్యాపారుల ఉంటే నిబంధన ప్రకారము చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# యు.డి.ఐ.డి., సదరం పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి,

**సెర్ప్ సిఈఓ దివ్య దేవరాజన్,**



యు.డి.ఐ.డి., సదరం కార్యక్రమాల లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సెర్ప్ సిఈఓ దివ్య దేవరాజన్ అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు, గ్రామీణ అభివృద్ధి, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సెర్ప్ సిఈఓ దివ్య దేవరాజన్, మాట్లాడుతూ జిల్లాలో యు.డి.ఐ.డి., సదరం శిబిరాల నిర్వహణను వేగవంతం చేయాలని, పెండింగ్‌లో ఉన్న యు.డి.ఐ.డి. సర్టిఫికెట్ల జారీ ప్రక్రియను నిబంధనల ప్రకారం పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అర్హులైన దివ్యాంగులను గుర్తించి, వారికి అవసరమైన వైద్య పరీక్షలు, ధ్రువీకరణ ప్రక్రియను సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థిని, విద్యార్థుల ఏకరూప దుస్తుల తయారీ పనుల పురోగతిపై సమీక్షించి, సంబంధిత అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు.

జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య మాట్లాడుతూ జిల్లాలో యు.డి.ఐ.డి., సదరం కార్యక్రమాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి, అర్హులైన దివ్యాంగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేలా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థిని విద్యార్థుల ఏకరూప దుస్తుల తయారీ త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి ఆర్ఎంఓ డా. శ్రీధర్, అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి అంజయ్య, డి పి ఎం అన్నాజీ, మెప్మా పి.డి. సుభాష్, విద్యాశాఖ సిబ్బంది, సదరం డిఈఓలు తదితరులు పాల్గొన్నారు.

# భారతదేశ ఉక్కు మహిళ ... ఇందిరాగాంధీ : సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్.

- **మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా నియమితులైన గొగ్గల రవి, పూనెం శ్యామ్ కుమారి లకు సన్మానం.**
- **కార్యకర్తలను ప్రోత్సహిస్తూ నాయకత్వానికి అండగా నిలుస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.**






భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కరకగూడెం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భారతదేశ తొలి మహిళా ప్రధానమంత్రి, భారతరత్న, ఉక్కు మహిళ ఇందిరా గాంధీ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం ఇందిరా గాంధీ దేశసేవ, త్యాగాలను స్మరించుకుంటూ దేశ అభివృద్ధికి, పేద ప్రజల సంక్షేమానికి ఆమె చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. దేశ ఐక్యత, సమగ్రత కోసం తన ప్రాణాలను సైతం అర్పించిన గొప్ప నాయకురాలని కొనియాడారు. అదేవిధంగా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆశీస్సులతో కరకగూడెం మండలం నుంచి బూర్గంపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా నియమితులైన గొగ్గలి రవి, పునెం శ్యామ్ కుమారి లను మండల కాంగ్రెస్ పార్టీ తరఫున శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు, గౌరవం కల్పిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం నిరంతరం శ్రమించే నాయకులు, కార్యకర్తలకు సముచిత అవకాశాలు కల్పించడం అభినందనీయమని, ఎమ్మెల్యే నాయకత్వంలో కరకగూడెం మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావడానికి ప్రతి ఒక్కరూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో

జిల్లా కాంగ్రెస్ కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ నాగ బండి వెంకటేశ్వర్లు, మండల సర్పంచ్ ల సంఘం మండల అధ్యక్షులు చౌలం కేశవరావు, సర్పంచ్ లు పోలేబోయిన సుజాత,ఎర్రం పొట్టయ్య,తోలెం రమేష్ , బాడిష పార్వతి , ఉప సర్పంచ్లు పూజారి వెంకన్న, గాంధర్ల రామనాథం, మాజీ ఉప సర్పంచ్ బాడిష లక్ష్మీనారాయణ,మండల నాయకులు షేక్ రఫీ, గొగ్గలి కృష్ణ, చందా శ్యాం, జిమ్మిడి నవీన్, గోగు సాయి, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# నాగవరప్పాడు శివార్లలో ముమ్మర వాహన తనిఖీలు

- **అక్రమ మద్యం రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక నిఘా**



గుడివాడ: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎక్సైజ్ పోలీసులు అప్రమత్తమయ్యారు. కృష్ణా జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో గుడివాడ పట్టణంలోని నాగవరప్పాడు శివార్లలో వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. గుడివాడలో ఎన్నికలు లేకపోవడంతో పక్క నియోజకవర్గాల నుంచి అక్రమంగా మద్యం తరలించే అవకాశాలు ఉన్నాయన్న అంచనాతో ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఎక్సైజ్ సీఐ వెంకటరమణ ఆధ్వర్యంలో సిబ్బంది నాగవరప్పాడు శివార్లలో ప్రధాన రహదారిపై రాకపోకలు సాగిస్తున్న వాహనాలను ఆపి క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద వాహనాలు, వాటిలో తరలిస్తున్న వస్తువుల వివరాలను పరిశీలించారు. ఎన్నికల సమయంలో మద్యం అక్రమ రవాణా, అనధికార విక్రయాలకు అవకాశం లేకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నారు.ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలించినా, అక్రమంగా నిల్వ చేసినా చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా నిరంతర నిఘా కొనసాగిస్తామని తెలిపారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ శాఖ సిబ్బంది

# గిరిజన గ్రామాల అభివృద్ధికి పోలీసుల చేయూత.



గిరిజనుల సంక్షేమం, గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పోలీసులు కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు పినపాక మండలం,ఏడూళ్ల బయ్యారం పోలీస్ స్టేషన్ పరిధిలోని సుందరయ్యనగర్ గుత్తికోయ గుంపులో గిరిజన కుటుంబాలకు దుస్తులు పంపిణీ చేశారు.అనంతరం గ్రామస్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపించాలని, విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తల్లిదండ్రులకు సూచించారు. మద్యపానం, ఇతర చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలని కోరారు. గిరిజనుల సంక్షేమానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఏడూళ్ల బయ్యారం సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై రఘు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అదుర్స్ బామ్మ ఇక లేరు



'అదుర్స్' చిత్రంలో ఎన్టీఆర్ బామ్మ పాత్రలో నటించి మెప్పించిన వత్సల రాజగోపాల్ (93) ఇకలేరు. వయోధిక ఆరోగ్య సమస్యలతో ఆమె చెన్నైలో శుక్రవారం తుదిశ్వాస విడిచారు. కేరళలోని తిరువనంతపురంలో పుట్టిన వత్సల రాజగోపాల్‌కు చిన్నతనం నుంచే నటనపై ఆసక్తి ఉండేది. పెళ్లయిన తర్వాత చెన్నైకు వచ్చి స్థిరపడ్డారు. కార్టూనిస్ట్ శ్రీధరన్ నిర్వహించిన 'రసిగ రంగ' థియేటరు గ్రూపులో 1979లో చేరి రంగస్థల కళాకారిణిగా కెరీర్‌ను ప్రారంభించారు. 1990ల్లో అనేక తమిళ బుల్లితెర ధారావాహికల్లో నటించారు. ఆమె నటన ఆకట్టుకోవడంతో 'రోజా' (1992) చిత్రంలో మణిరత్నం అవకాశం కల్పించారు. అప్పటికే ఆమెకు 60ఏళ్లు కావడం గమనార్హం. సుమారు 450 నాటకాలు, 20పైగా చిత్రాల్లో నటించారు. వాటిలో 'సతీ లీలావతి', 'రిథమ్', 'అపరిచితుడు' లాంటి హిట్ చిత్రాలు ఉన్నాయి.

# నాన్నా.. నువ్వు చెడ్డవాడిగా చేస్తున్నావా?: కొడుకు ప్రశ్న గురించి చెప్పిన యశ్



రామాయణం ఆధారంగా భారీ స్థాయిలో తెరకెక్కుతున్న చిత్రం 'రామాయణ' . ఇందులో రాముడిగా రణ్‌బీర్ కపూర్ , సీతగా సాయిపల్లవి నటిస్తుండగా, రాక్షసరాజు రావణాసురుడి పాత్రలో ప్రముఖ కన్నడ నటుడు యశ్ కనిపించనున్నారు. అయితే, తాను రాముడి పాత్ర చేయకుండా, రావణుడిగా నటిస్తున్న విషయం తెలిసి తన కుమారుడు షాకైనట్లు యశ్ చెప్పారు.

"నేను మా అబ్బాయికి రామాయణం కథ చెప్పి, అందులో రావణుడి పాత్ర చేస్తున్నట్లు చెప్పాను. అది విని అతడు ఆశ్చర్యపోయాడు. 'నో.. నువ్వు చెడ్డవాడి పాత్ర చేస్తున్నావా? అలా ఎందుకు చేస్తున్నావు' అని అడిగాడు. అప్పుడు నేను ప్రజలకు రామాయణం గురించి పూర్తిగా చెప్పాలంటే, రావణుడి పాత్ర గురించి కూడా చెప్పాలి. చెడ్డ పాత్ర చేస్తున్నంత మాత్రాన అతడి చెడ్డ పనులను మనం సమర్థిస్తున్నట్లు కాదు అన్నాను. దీంతో పాటు రాముడిలోని విలువలు, సద్గుణాలను వివరించి, ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని నా పిల్లలకు చెప్పాను. మీరు తెరపై మీ తండ్రి నటనను చూసి ఆనందించొచ్చు, కానీ ఆ పాత్రను స్ఫూర్తిగా తీసుకోకూడదని వివరించాను" అని యశ్ చెప్పారు. "అయితే, ఈ సినిమా చివర్లో నువ్వు యుద్ధంలో ఓడిపోయి చనిపోతావా అని మా అబ్బాయి అడిగాడు. ఈ ప్రశ్న నేను ఊహించలేదు. నటుడికి, అతడు చేసే పాత్రకి మధ్య వ్యత్యాసాన్ని నా కుమారుడికి అర్థమయ్యేలా చెప్పేందుకు కాస్త కష్టపడాల్సి వచ్చింది" అని యశ్ అన్నారు.

అడ్వాన్స్ బుకింగ్స్‌తో రూ.40కోట్లు

'రామాయణ' నవంబరు 5న విడుదలవుతోంది. ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్స్‌లో సత్తా చాటుతోంది. భారత్‌లో ముందస్తు బుకింగ్ ద్వారా శనివారం ఉదయానికి 4 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడుపోయినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. వీటిద్వారా సుమారు రూ.20 కోట్ల ఆదాయం వచ్చిందని, ప్రపంచవ్యాప్తంగా రూ.40 కోట్ల మార్కును అందుకున్నట్లు తెలిపాయి.

# 'కాంటే 2'... సంజయ్ గుప్తా కలను నెరవేరుస్తా: సంజయ్ దత్



బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు, నిర్మాత సంజయ్ గుప్తా కన్నుమూసిన విషయం తెలిసిందే. ఆయన మరణం సినీ పరిశ్రమను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ నటుడు, నిర్మాత సంజయ్ దత్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. గుప్తా కలను నెరవేరుస్తానని, ఆయన దర్శకత్వంలో తెరకెక్కాల్సిన 'కాంటే 2' చిత్రాన్ని తప్పకుండా రూపొందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తన ఇన్‌స్టాగ్రామ్‌లో గుప్తాతో కలిసి దిగిన పాత ఫొటోలను పంచుకుంటూ.. ఎమోషనల్ నోట్ పెట్టారు.

"గుప్తా.. నువ్వు లేవన్న విషయాన్ని ఇప్పటికీ నమ్మలేకపోతున్నాను. ఎన్నో ఏళ్ల స్నేహం మనది. చాలా జ్ఞాపకాలు ఉన్నాయి. నువ్వు ఎప్పటికీ నా కుటుంబ సభ్యుల్లో ఒకడివి. ఇటీవలే 'కాంటే 2' గురించి మాట్లాడుకున్నాం. నీ కలను నెరవేరుస్తా. ఈ సినిమా కోసం చేయాల్సిన కృషంతా చేస్తా. నువ్వు లేని జీవితం మునుపటిలా ఉండదు. నిన్ను ఎప్పటికీ ప్రేమిస్తూనే ఉంటా బ్రదర్.." అంటూ అందులో రాసుకొచ్చారు.

ఇక, సంజయ్ దత్ ప్రధాన పాత్రలో, సంజయ్ గుప్తా తెరకెక్కించిన చిత్రం 'కాంటే' . 2002లో ఈ మూవీ విడుదలైంది. ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, సునీల్ శెట్టి, కుమార్ గౌరవ్, లక్కీ అలీ, మహేష్ మంజ్రేకర్ ముఖ్య పాత్రల్లో నటించారు.

# తాతయ్య పుట్టిన నేలతో ఎంతో ప్రత్యేక అనుబంధం: ఉపాసన

అపోలో హాస్పిటల్స్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్, అగ్ర నటుడు రామ్‌చరణ్ సతీమణి ఉపాసన చిత్తూరు ప్రాంతంతో తనకున్న ప్రత్యేక అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. చిత్తూరులో అపోలో విద్యాసంస్థల ద్వారా 5,900 మంది విద్యనభ్యసిస్తుండటం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు. త్వరలోనే అర్ధగిరి ఆలయంలో 'రామ రక్ష' విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు వెల్లడించారు. ప్రముఖ శిల్పి అరుణ్ యోగిరాజ్ ఈ విగ్రహాన్ని రూపొందిస్తున్నట్లు తెలిపారు. తన తాతయ్య, అపోలో హాస్పిటల్స్ ఛైర్మన్ ప్రతాప్ సి.రెడ్డి పుట్టిన నేలతో తనకున్న అనుబంధం ఎంతో ప్రత్యేకమైనదని ఉపాసన గుర్తు చేసుకున్నారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఆమె ఓ వీడియోను షేర్ చేశారు.



# దిల్జీత్‌కు క్షమాపణలు చెప్పిన అభిజిత్ దీప్కే..



నటుడు, గాయకుడు దిల్జీత్ దోసాంజ్‌తో వివాదంపై కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే వెనక్కి తగ్గారు. దిల్జీత్‌ను ఉద్దేశించి సోషల్ మీడియాలో ఓ సుదీర్ఘ పోస్టు పెట్టిన ఆయన.. తన వ్యాఖ్యల వల్ల బాధ కలిగితే క్షమించాలని కోరారు. తనకు దిల్జీత్‌పై ఎలాంటి వ్యక్తిగత ద్వేషం లేదని, ఆయనంటే ఇప్పటికీ ఎంతో గౌరవం, అభిమానం అని పేర్కొన్నారు.

ఈ ఏడాది జూన్‌లో కాక్రోజ్ జనతా పార్టీ దిల్లీలో ఆందోళనలు నిర్వహించిన విషయం తెలిసిందే. నాడు ఆ నిరసనలకు సపోర్ట్ చేస్తారా అని ఓ అభిమాని అడిగిన ప్రశ్నకు దిల్జీత్ స్పందిస్తూ.. "నన్ను వీటికి దూరంగా ఉంచండి. నేను ఒక ఆర్టిస్టును. రాజకీయ నాయకుడిని కాదు" అని వ్యాఖ్యానించారు. దీంతో అప్పట్లో గాయకుడిపై విమర్శలు వచ్చాయి. నాడు అభిజీత్ దీప్కే కూడా ఆయన వ్యాఖ్యలను తప్పుబట్టారు. విద్యార్థుల నిరసనలకు మద్దతు ఇవ్వకుండా తప్పించుకుంటున్నారని విమర్శించారు. సామాజిక అంశాలపై తెరకెక్కిన 'సత్లుజ్' సినిమాలో నటిస్తూ.. విద్యార్థుల ఉద్యమంపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.

ఈ నేపథ్యంలో శుక్రవారం దిల్లీలో జరిగిన తన కచేరీలో దిల్జీత్ ఈ వివాదంపై స్పందించారు. "నేను ఆర్టిస్టును కాబట్టి మీ అందరినీ ప్రేమిస్తున్నాను. నేను మౌనంగా ఉంటున్నాను.. నన్ను అలాగే ఉండనివ్వండి. మీ అందరికీ నా మద్దతు ఉంది. కానీ, ఎలా పోరాడాలో పంజాబీలకు నేర్పించకండి" అని ఘాటుగా వ్యాఖ్యానించారు.

దిల్జీత్ వ్యాఖ్యల అనంతరం అభిజీత్ దీప్కే ఇన్‌స్టాలో వివరణ ఇచ్చారు. "నిరసనల వేళ మీ వ్యాఖ్యలు నన్ను బాధపెట్టాయి. వ్యక్తిగతంగా మీపై నాకు ఎలాంటి వ్యతిరేకత, ద్వేషం లేదు. మిమ్మల్ని ఎప్పుడూ సామాజిక సమస్యలపై గొంతెత్తే వ్యక్తిగా భావించాను" అని పేర్కొన్నారు. భారతీయ సంగీతాన్ని దిల్జీత్ ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన తీరును అభిజీత్ ఈ సందర్భంగా ప్రశంసించారు. చివరగా.. "నన్ను మీ తమ్ముడిగా భావించి ఈ విషయాన్ని ఇక్కడితో వదిలేయండి" అని దీప్కే విజ్ఞప్తి చేశారు.

# వయ్యారాల దండయాత్ర



కథానాయికల సినీ ప్రయాణంలో విరామాలు తక్కువ. టీ20 శైలిలో కెరీర్‌ని దూకుడుగా పరుగులు పెట్టిస్తుంటారు. హిట్టు కొట్టి నిలబడ్డారంటే చాలు.. ఇక వచ్చిన ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకుంటూ జెట్ స్పీడ్‌తో అన్ని చిత్రసీమల్నీ చుట్టొచ్చేస్తుంటారు. అందుకే వాళ్లు ప్రతి సీజన్ తమదే అన్నట్లు ఏడాదంతా వరుస సినిమాలతో వెండితెరపై మెరుపులు మెరిపిస్తుంటారు. ఇప్పుడిలా నెలల వ్యవధిలోనే ఒకటికి రెండు చిత్రాలతో బాక్సాఫీస్ బరిలో సందడి చేసేందుకు పలువురు భామలు సిద్ధమవుతున్నారు. వైవిధ్యభరితమైన కథలు.. విభిన్నమైన పాత్రలతో పసందైన వినోదాల విందు వడ్డించనున్నారు.

ఓవైపు కథానాయికగా కమర్షియల్ సినిమాల్లో సందడి చేస్తూనే.. మరోవైపు నాయికా ప్రాధాన్య చిత్రాలతోనూ బాక్సాఫీస్ బరిలో సత్తా చాటే ప్రయత్నాలు చేస్తున్నారు రష్మిక, అనుపమ పరమేశ్వరన్. ఈ ఇద్దరూ గతేడాది ఐదారు చిత్రాలతో వెండితెరపై కనువిందు చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడదే జోరును ఈ ఏడాదిలోనూ ప్రదర్శిస్తున్నారు. ఈ దసరాకి రష్మిక 'రణబాలి'తో తెరపై సందడి చేయగా.. అనుపమ 'క్రేజీ కళ్యాణం'తో అలరించే ప్రయత్నం చేశారు. అయితే ఇప్పుడీ నాయికలిద్దరూ నవంబరులో మరోసారి బాక్సాఫీస్ బరిలో మెరుపులు మెరిపించేందుకు సిద్ధమవుతున్నారు.

అనుపమ ప్రస్తుతం శర్వానంద్‌తో కలిసి 'భోగి'లో నటించిన సంగతి తెలిసిందే. అనుపమ ఇందులో కందుల సులోచనగా డీగ్లామర్ లుక్‌తో ఓ గ్రామీణ యువతిగా కనిపించనున్నారు. ఇది తన కెరీర్‌లో మరో గుర్తుండిపోయే పాత్రవుతుందని.. ఈ సినిమా అందర్నీ మెప్పిస్తుందని అనుపమ ఇటీవల వెల్లడించారు. మరి ఈ సినిమా అందరి అంచనాల్ని అందుకుంటుందా? లేదా? తెలియాలంటే నవంబరు 12 వరకు వేచి చూడక తప్పదు. 'రణబాలి'లో జయమ్మగా అందర్నీ అలరించారు రష్మిక. ఇప్పుడామె 'మైసా'తో తొలిసారి పూర్తి స్థాయి యాక్షన్ పాత్రలో అదరగొట్టేందుకు సిద్ధమవుతున్నారు. రష్మిక ఇందులో శక్తిమంతమైన గోండు గిరిజన యువతిగా అలరించనున్నారు. మరి ఈ సినిమాతో ఆమె యాక్షన్ నాయికగా పేరు తెచ్చుకుంటారో.. లేదో నవంబరు 27న తేలనుంది.

# ట్రైన్ ప్రయాణంలో..



విలక్షణ నటుడు విజయ్ సేతుపతి ప్రధాన పాత్రలో రూపొందుతున్న చిత్రం 'ట్రైన్'. మిస్కిన్ దర్శకత్వంలో కలైపులి ఎస్.థాను నిర్మిస్తున్నారు. శ్రుతి హాసన్, నాజర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రం డిసెంబరు 4న థియేటర్లలోకి రాబోతుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఈ సినిమా రిలీజ్ టీజర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. "ఈ పిచ్చి ప్రయాణంలో అందరూ సిద్ధం..! ఈ ఏడాది అత్యుత్తమ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం 'ట్రైన్' రిలీజ్ టీజర్ వచ్చేసింది.." అనే వ్యాఖ్యను పంచుకుంది.

# తెలంగాణ ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

## -డిండిలో ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకలు




నల్లగొండ జిల్లా గుండ్లపల్లి డిండి మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో ఏఐటియుసి 107వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు జెండాను ఆవిష్కరించి,ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో స్వాతంత్రానికి పూర్వమే ఏఐటీయూసీ ఏర్పడి నేటికి 107 సంవత్సరాలు పూర్తిచేసుకొని ఎన్నో సుదీర్ఘ పోరాటాలు నిర్వహించి,కార్మికులకు అండగా నిలిచిన మొట్టమొదటి సంఘం ఏఐటీయూసీ అని తెలిపారు.కార్మికుల హక్కులను పరిరక్షించడం కోసం అనేకమైన పోరాటాలు చేసి సాధించుకున్న హక్కులను కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ 44 కార్మిక చట్టాలను 4 కోడ్లుగా కుదించి, కార్మికుల హక్కులను తుంగలో తొక్కుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేసి కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని,పీఎఫ్,ఈఎస్ఐ సౌకర్యాన్ని,ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.కార్మికులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం కూడా మనుగడలో ఉండదని హెచ్చరించారు.మధ్యాహ్న భోజనం పథకం కార్మికులు, గ్రామపంచాయతీ వర్కర్లు,ఆశ, అంగన్వాడి,ఆటో,భవన నిర్మాణరంగం,స్కూల్ స్వావెంజర్ వంటి వారికి చాలీచాలని వేతనాలతో వాళ్ళ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని ఆయన గుర్తు చేశారు.రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని,మధ్యాహ్న భోజన కార్మికులకు పదివేల రూపాయలు జీతం ఇస్తామని చెప్పిన మాటలు, గ్రామపంచాయతీ కార్మికులకు 16000 జీతం,అంగన్వాడి టీచర్లను పేర్మినెంట్ చేస్తామని, ఆశా వర్కర్లను పర్మనెంట్ చేస్తామని మాయ మాటలతో ఆనాడు రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి కున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఈనాడు కార్మికుల వైపు ఆలోచించకుండా,తమ కమిషన్ల కోసం అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులపై సవితి తల్లి ప్రేమ చూపుతుందని ఆయన మండిపడ్డారు.భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డులో కోట్ల రూపాయలు మూలకుపడి మూలుగుతున్నా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఖర్చు చేసే విధానాలను పక్కనపెట్టి కాంట్రాక్టు వాళ్లకు,ఇన్సూరెన్స్ కంపెనీ వాళ్లకు అప్పజెప్పడం అన్యాయమని అన్నారు. సంవత్సరాలు గడిచినా కూడా భవన నిర్మాణ కార్మికులకు వచ్చేటువంటి బెనిఫిట్స్ ఇప్పటికీ రాలేదని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను విమర్శించారు.భవిష్యత్తులో ఐక్య పోరాటాలకు సిద్ధమై ఈ ప్రభుత్వాలను మెడలు వంచే విధంగా పనిచేయాలని కోరుతూ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి బుష్పాక లింగమయ్య,మధ్యాహ్న భోజనం మండల అధ్యక్షులు బల్మూరి లక్ష్మయ్య, గ్రామపంచాయతీ నాయకులు కొమ్ము జగతయ్య,ఈదమ్మ, మనేమ్మ ,లక్ష్మమ్మ , నీ పోరా , ఎల్ల వ్మ , ెంట య్ ృ రాములు,గెలమ్మ,దామోదర్,వావిళ్ళరాములు,సంత య్,చోక్ల ,తదిరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో కూటమి అభ్యర్థులకు బ్రహ్మరథం పట్టిన జనం

## 12 గ్రామాల్లో విస్తృత ఎన్నికల ప్రచారం



ద్వారకాతిరుమల మండలంలో కూటమి స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం హోరెత్తుతోంది. శనివారం మండలంలోని 12 గ్రామాల్లో కూటమి అభ్యర్థులు విస్తృతంగా పర్యటించగా, ఓటర్లు వారికి బ్రహ్మరథం పలికారు. కూటమి జడ్పీటీసీ అభ్యర్థిని కరుటూరి సత్య శ్రావణి , ఎంపీపీ అభ్యర్థిని ఏపూరి పావనితో కలిసి ఈ ప్రచారంలో పాల్గొన్నారు.ఉదయం నుంచే 12 గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ స్థానికులతో నేరుగా మమేకమయ్యారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలు, అభిప్రాయాలను అడిగి తెలుసుకుంటూ వారి ఆశీస్సులు కోరారు. గ్రామ గ్రామాన వీరికి పూలవర్షం, హారతులతో ఘన స్వాగతం లభించింది.ప్రజల ఆదరాభిమానాలు చూస్తుంటే రాబోయే ఎన్నికల్లో కూటమి విజయం ఖాయమని అభ్యర్థులు ధీమా వ్యక్తం చేశారు. విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఈ కార్యక్రమంలో కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రచారాన్ని విజయవంతం చేశారు.

# ఎన్నికల వేళ అప్రమత్తమైన ఎక్సైజ్ పోలీసులు

## ఒంటిమిట్టలో వైఎస్ఆర్సీపీ ఎన్నికల ప్రచారం జోరు జడ్పీటీసీ అభ్యర్థి మినుకు బాలక్కకు ప్రజల నుంచి ఘన స్వాగతం.. అడుగడుగునా బ్రహ్మరథం



: మండలంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. జడ్పీటీసీ అభ్యర్థిగా బరిలో నిలిచిన మినుకు బాలక్కకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె మండలంలోని పలు ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుస్తూ, వారి సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగుతున్నారు.
ఈ సందర్భంగా బాలక్కకు స్థానిక ప్రజలు ఘన స్వాగతం పలుకుతూ తమ సంఘీభావాన్ని తెలియజేస్తున్నారు. ప్రచారంలో భాగంగా ప్రతి ఇంటిని సందర్శిస్తూ ప్రజలతో మమేకమవుతున్న ఆమెకు అడుగడుగునా ప్రజల ఆదరణ లభిస్తుండటంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.
జడ్పీటీసీ అభ్యర్థి మినుకు బాలక్కకు వైఎస్ఆర్సీపీ మండల అధ్యక్షుడు టక్కోలు శివారెడ్డి, నందకిషోర్ రెడ్డి, నిత్యానంద రెడ్డి, మండల మైనార్టీ నాయకుడు జాకీర్ హుస్సేన్ తదితరులు సంఘీభావం తెలిపారు. ఆమె విజయానికి కృషి చేస్తామని పేర్కొంటూ ప్రచార కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నారు.
ఈ సందర్భంగా మినుకు బాలక్క మాట్లాడుతూ.. ప్రజల ఆశీస్సులు, ఆదరణ తనకు కొండంత బలమని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో ఓటర్లు తమ అమూల్యమైన ఓటును ఫ్యాన్ గుర్తుపై వేసి, జడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.
ఈ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో మండల మైనార్టీ నాయకుడు జాకీర్ హుస్సేన్‌తో పాటు వైఎస్ఆర్సీపీ నాయకులు, బ్రహ్మానంద రెడ్డి కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రచారాన్ని ఉత్సాహంగా కొనసాగించారు.

# దేవత్‌పల్లిలో అర్హులైన లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డుల పంపిణీ

## •పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంలో రేషన్ కార్డులు కీలకం



నాంపల్లి మండల పరిధిలోని దేవత్‌పల్లి గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు అర్హులైన లబ్ధిదారులకు గ్రామ ప్రజాప్రతినిధులు నూతన రేషన్ కార్డులను అందజేశారు.ఎన్నో రోజులుగా రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న కుటుంబాలకు కొత్త కార్డులు అందడంతో లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమైంది.
రేషన్ కార్డు అనేది కేవలం నిత్యావసర సరుకులు పొందేందుకు మాత్రమే కాకుండా పేద మరియు అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంలో కూడా ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంటుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.రేషన్ కార్డుల ద్వారా అర్హులైన కుటుంబాలకు ఆహార భద్రత కల్పించడంతో పాటు ప్రభుత్వ నిబంధనల ప్రకారం వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.
ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందాలంటే అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు అర్హత ఉన్నవారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రయోజనాలు అందేలా చూడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని పేర్కొన్నారు.గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు.
నూతన రేషన్ కార్డులు అందుకున్న లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ తమకు రేషన్ కార్డులు మంజూరు చేసి అందించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.రేషన్ కార్డులు లేని అర్హులైన కుటుంబాలకు కూడా భవిష్యత్తులో కార్డులు మంజూరయ్యేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.
ఈ కార్యక్రమంలో దేవత్ పల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ ముదిగొండ ఏసు ఉపసర్పంచ్ జక్కుల సత్యనారాయణ 3వ వార్డు సభ్యుడు పోలేపాక వెంకటయ్య 8వ వార్డు సభ్యుడు పోలేపాక రమణయ్య ఇతర వార్డు సభ్యులు గ్రామస్తులు రేషన్ కార్డుల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అందుగుల రాములు ప్రచారం



సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని ద్వారకాతిరుమల ఎంపీటీసీ-2 కూటమి అభ్యర్థి అందుగుల రాములు హామీ ఇచ్చారు. శనివారం ఆరో రోజు ప్రచారాన్ని కొనసాగించారు.సీనియర్ నాయకులు మల్లిపెద్ది వెంకటేశ్వరరావు, ఇమ్మడి రత్నాజీ, చిలుకూరి దర్శులు , కూటమి నాయకులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ప్రజల యోగక్షేమాలు తెలుసుకుని, కూటమి ప్రభుత్వ అభివృద్ధి పనులను వివరించారు.ప్రజలు తెలిపిన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి అధికారులతో సమన్వయం చేస్తామన్నారు. సీనియర్ల అనుభవం, యువత చొరవతో కూటమి విజయం ఖాయమని, సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కూటమినాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బియ్యం విక్రయ ధరలను తప్పనిసరిగా ప్రదర్శించాలి,

## •మంచిర్యాల జిల్లా పౌరసరఫరాల అధికారి వేణుగోపాల్,





బియ్యం విక్రయదారులు తమ విక్రయ కేంద్రాలలో వివిధ రకాల బియ్యం గరిష్ట విక్రయ ధరల వివరాలను ప్రజలకు కనిపించే విధంగా తప్పనిసరిగా ప్రదర్శించాలని మంచిర్యాల జిల్లా పౌరసరఫరాల అధికారి వేణుగోపాల్ అన్నారు. శనివారం మంచిర్యాల పట్టణంలోని మార్కెట్ ప్రాంతంలో గల శ్రీనాథ్ ట్రేడర్స్, హరి ఓం ట్రేడర్స్, మహేశ్వరి ట్రేడర్స్ బియ్యం విక్రయ దుకాణాలను డి.టి., ఆర్.ఐ., ఎన్ఫోర్స్మెంట్ అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పౌరసరఫరాల అధికారి వేణుగోపాల్, మాట్లాడుతూ పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు బియ్యం విక్రయదారులు తమ విక్రయ కేంద్రాలలో వివిధ రకాల బియ్యం గరిష్ట విక్రయ ధరలను తెలిపే ప్లెక్సీలను తప్పనిసరిగా ఏర్పాటు చేసి ప్రజలకు కనిపించే విధంగా ప్రదర్శించాలని తెలిపారు. బి పి టి బియ్యం కిలోకు 66 రూపాయలు, తెలంగాణ సోనా / హెచ్ఎంటి బియ్యం కిలోకు 74 రూపాయలు, జైశ్రీరామ్ బియ్యం కిలోకు 79 రూపాయలకు మించరాదని తెలిపారు. హోల్‌సేల్ వ్యాపారులు, కిరాణా వర్తకులు, మిల్లర్లు, బియ్యం విక్రయదారులు ఈ ధరలను తప్పనిసరిగా పాటించాలని, నిర్ణీత ధరలకు మించి బియ్యం విక్రయించరాదని సూచించారు. వినియోగదారులకు ధరలపై స్పష్టమైన అవగాహన కల్పించేలా విక్రయ కేంద్రాలలో ధరల పట్టికలు, ప్లెక్సీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట ధరలను ఉల్లంఘించి అధిక ధరలకు బియ్యం విక్రయించిన వారిపై నిత్యావసర వస్తువుల చట్టం--1955 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల విధులకు సంబంధించి పిఓ, ఎపిఓలకు శిక్షణ



స్థానిక మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిమిత్తం పోలింగ్ అధికారులు, అసిస్టెంట్ పోలింగ్ అధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. రిటర్నింగ్ ఆఫీసర్ సి.హెచ్. శిరీష మరియు అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ ఎం. భారతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగింది. ఈ శిక్షణా కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీలు కె. లీలమనోహర్, సి.హెచ్.ఎస్. వెంకటేశ్వర్లు, ఎ. ప్రసాద్, కె. నాగేశ్వరరావు ఎన్నికల నిర్వహణపై అధికారులకు తగు సూచనలు, మెలకువలు నేర్పించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి స్వామి నాయక్ పాల్గొని దిశానిర్దేశం చేశారు.

# కార్మికుల సంక్షేమమే ఏఐటీయూసీ ధ్యేయం : తోగటి కుమార్.

## •పోరాటాల బాటలో “ఏఐటీయూసీ” 107 వసంతాలు.



కార్మికుల హక్కుల పరిరక్షణ, శ్రమజీవుల సంక్షేమం, సమాన న్యాయం సాధించడమే లక్ష్యంగా ఏఐటీయూసీ సాగిస్తున్న పోరాట ప్రస్థానం ఆదర్శనీయమని సీపీఐ పినపాక మండల కార్యదర్శి తోగటి కుమార్ అన్నారు. కార్మికుల ఐక్యతతోనే సమస్యలను పరిష్కరించుకోవడంతో పాటు న్యాయమైన హక్కులను సాధించుకోవడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.ఏడూళ్ల బయ్యారం ప్రధాన కూడలిలోని హమాలీ సంఘం కార్యాలయం వద్ద శనివారం ఏఐటీయూసీ 107వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి తోగటి కుమార్, సహాయ కార్యదర్శి కప్ప వెంకటేశ్వర్లు సంఘం జెండాను ఆవిష్కరించి వేడుకలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్మిక వర్గ ప్రయోజనాల కోసం ఏఐటీయూసీ దశాబ్దాలుగా అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహిస్తోందని తెలిపారు. కార్మికులకు న్యాయమైన వేతనాలు, మెరుగైన పని పరిస్థితులు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత కల్పించాలనే డిమాండ్లతో నిరంతరం పోరాడుతోందని గుర్తుచేశారు. కార్మికుల చెమట చుక్కలతోనే దేశ ఆర్థిక వ్యవస్థ, పారిశ్రామిక రంగాలు ముందుకు సాగుతున్నాయని, అలాంటి శ్రమజీవులకు సమాజంలో తగిన గుర్తింపు, గౌరవం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.ప్రస్తుతం కార్మిక రంగం అనేక సమస్యలను ఎదుర్కొంటోందని, అసంఘటిత రంగ కార్మికులకు భద్రత, సంక్షేమ పథకాల అమలు, కనీస వేతనాల కల్పన వంటి అంశాలపై మరింత దృష్టి సారించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా హమాలీ కార్మికులు ప్రతిరోజూ శారీరక శ్రమతో కూడిన పనులు చేస్తూ ప్రజలకు అవసరమైన సేవలు అందిస్తున్నారని, వారి కష్టానికి తగిన ప్రతిఫలం, గౌరవం దక్కేలా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని కోరారు. 107 ఏళ్ల చరిత్ర కలిగిన ఏఐటీయూసీ కార్మిక ఉద్యమాలకు అండగా నిలుస్తూ, రాబోయే రోజుల్లో మరిన్ని పోరాటాలకు సిద్ధం కావాలని నాయకులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో హమాలీ యూనియన్ అధ్యక్షుడు భక్తుల అన్వీరెడ్డి, కుర్రి నర్సయ్య, కాసు, గణేష్, వెంకన్న, గంగరాజు తదితర కార్మికులు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

# రిటైర్ అవుతున్న సిరిల్‌కు ఘన సన్మానం



ఈరోజు అనగా. 31/10/2026 రాణిగంజ్ డిపో నందు రిటైర్మెంట్ అవుతున్న సిరిల్ హెల్పర్ గారిని ఎంప్లాయిస్ యూనియన్ తరపున శాలువతో మరియు పూలమాలతో సన్మానించడం జరిగింది, ఈ కార్యక్రమంలో డిఎం ,రవీందర్ గారు ,ఇద్దరు సీఐలు, ఎండి ఆలీ, గారు రాజశేఖర్ గార్లు, వీ ఖీ సరిత గారు ,ఎంప్లాయిస్ యూనియన్ డిపో సెక్రెటరీ చీ.శ్రీనివాస్ గారు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ వీ. పాండు గారు ,పబ్లిసిటీ సెక్రెటరీ జ. సునీల్ కుమార్ గారు, మెకానికల్ సెక్షన్ వీ.శ్రీనివాస్ గారూ ,పాల్గొనడం జరిగింది మొదటిసారి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర గుర్తింపు యూనియన్ గా డిపోలో సన్మాన కార్యక్రమంలో పాల్గొనడానికి సంతోషిస్తున్నాము ఉద్యోగులు ఇచ్చిన సహకారానికి మెకానిక్ సెక్షన్ ఉద్యోగులకు ధన్యవాదాలు తెలుపుచున్నాము .

ఇట్లు
ఎంప్లాయిస్ యూనియన్
డిపో ప్రెసిడెంట్ మహమ్మద్ రషీద్
సెక్రెటరీ ఎన్ శ్రీనివాస్

ట్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక

సాంస్కృతికం
మన సంస్కృతి.. మన గర్వం..

11
ఆదివారం నవంబర్ 01, 2026
www.trinetnews.com


# దేశ ఐక్యతను కాపాడుతూ వికసిత్ భారత్ నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలి

**సర్దార్ పటేల్ దూరదృష్టి, దృఢసంకల్పం స్ఫూర్తిదాయకం: లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా**

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 31:**

దేశ ఐక్యత, సమగ్రతను పరిరక్షిస్తూ అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణంలో యువత క్రియాశీల పాత్ర పోషించాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పిలుపునిచ్చారు. భారత ఉక్కు మనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్ జీవితం, ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకుని తమ ప్రతిభ, సృజనాత్మకత, సమష్టి కృషిని దేశ సేవకు అంకితం చేయాలని సూచించారు. పటేల్ జయంతి సందర్భంగా శనివారం సంవిధాన్ సదన్‌లోని సెంట్రల్ హాల్‌లో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డా, పార్లమెంటరీ వ్యవహారాలు, మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజిజు, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్, ఎంపీలు నితిన్ నబీన్, సోనియా గాంధీ తదితరులు పాల్గొని పటేల్‌కు నివాళులర్పించారు. మాజీ పార్లమెంట్ సభ్యులు, లోక్‌సభ సెక్రటరీ జనరల్ ఉత్పల్‌కుమార్ సింగ్, రాజ్యసభ సెక్రటరీ జనరల్ పీసీ మోదీ, ఉభయ సభల సచివాలయాల ఉన్నతాధికారులు కూడా పుష్పాంజలి సమర్పించారు.

ఈ సందర్భంగా వివిధ పాఠశాలలు, కళాశాలల నుంచి హాజరైన విద్యార్థులతో ఓం బిర్లా మాట్లాడుతూ.. ఆధునిక భారత జాతీయ ఐక్యతకు రూపశిల్పిగా నిలిచిన పటేల్ జీవితం దృఢసంకల్పం, అసాధారణ కార్యనిర్వహణ సామర్థ్యం, దూరదృష్టి, నిర్ణయాత్మక నాయకత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. స్వాతంత్ర్యానంతరం ఎన్నో ప్రతికూల పరిస్థితులు ఎదురైనా వందలాది సంస్థానాలను భారత యూనియన్‌లో విలీనం చేయడంలో ఆయన చారిత్రక పాత్ర పోషించారని




గుర్తుచేశారు. నేడు దేశం ఐక్యంగా నిలవడానికి పటేల్ నాయకత్వం, దూరదృష్టి బలమైన పునాదులు వేశాయని అన్నారు. చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించడం, అవసరమైనప్పుడు కఠిన నిర్ణయాలు తీసుకోవడం, ఉమ్మడి జాతీయ లక్ష్యసాధనకు అందరినీ కలుపుకొని ముందుకు సాగడం ఆయన నాయకత్వ ప్రత్యేకతలని వివరించారు.

విద్యార్థుల ఆలోచనా విధానం, ఆత్మవిశ్వాసం, నిర్ణయ సామర్థ్యం, ఆవిష్కరణల పట్ల ఆసక్తిని స్పీకర్ ప్రశంసించారు. దేశంలోని వివిధ ప్రాంతాల యువత వ్యక్తం చేస్తున్న భిన్నాభిప్రాయాలు, దృక్పథాలు భారత ప్రజాస్వామ్య బలానికి ప్రతీకలని చెప్పారు. సంస్కృతులు, భాషలు, రాజకీయ విధానాలు, అభిప్రాయాలు వేరైనా దేశ ఐక్యత, విశాల జాతీయ ప్రయోజనాల పట్ల నిబద్ధత అందరిలోనూ ఉమ్మడిగా ఉండాలని స్పష్టం చేశారు.

భారత జాతీయ ప్రస్థానంలో సంవిధాన్ సదన్‌కు విశిష్ట స్థానం ఉందని ఓం బిర్లా పేర్కొన్నారు. స్వాతంత్ర్య పోరాటం, రాజ్యాంగ రూపకల్పనకు సాక్షిగా నిలిచిన ఈ చారిత్రక ప్రాంగణం దేశ ఆర్థిక, సామాజిక అభివృద్ధికి సంబంధించిన అనేక కీలక చర్చలు, నిర్ణయాలకు వేదికైందని తెలిపారు. ఇక్కడ పొందిన స్ఫూర్తి, ఆలోచనలతో యువత వికసిత్ భారత్ లక్ష్యసాధనకు అర్థవంతమైన తోడ్పాటు అందిస్తుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

మహనీయులు తమ త్యాగాలతో స్వాతంత్ర్యాన్ని సాధించి నవభారత నిర్మాణానికి పునాదులు వేశారని, దేశాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే బాధ్యత ఇప్పుడు యువతపై ఉందని అన్నారు. విజ్ఞానశాస్త్రం, సాంకేతిక పరిజ్ఞానం, విస్తృతమైన జ్ఞానం, వనరులు, ఆత్మవిశ్వాసం, ఆవిష్కరణ సామర్థ్యాలతో నేటి యువతకు వివిధ రంగాల్లో అపార అవకాశాలు ఉన్నాయని వివరించారు. తమ సృజనాత్మకత, ఆధ్యాత్మిక చింతన, శాస్త్రీయ దృక్పథం, సాంకేతిక నైపుణ్యాలను దేశ సేవకు వినియోగించాలని సూచించారు. ఏ రంగంలో పనిచేసినా జాతీయ ప్రయోజనాలకే అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

పటేల్ దూరదృష్టి, కృషి, దృఢసంకల్పం, ఆత్మవిశ్వాసాన్ని యువత అలవరచుకోవాలని స్పీకర్ పిలుపునిచ్చారు. ఈ లక్షణాలతో భారత్ ప్రపంచానికి దిశానిర్దేశం చేసే శక్తిగా ఎదగడంతోపాటు అంతర్జాతీయ సవాళ్లకు పరిష్కారాలు అందించగలదని ఆశాభావం వ్యక్తం చేశారు.

అంతకుముందు 'ఎక్స్' వేదికగా పటేల్‌కు ఓం బిర్లా నివాళులర్పించారు. స్వాతంత్ర్య పోరాటంలోనూ, స్వతంత్ర భారత నిర్మాణంలోనూ ఆయన సేవలు అసమానమైనవని పేర్కొన్నారు. దేశ తొలి ఉపప్రధాని, హోంమంత్రిగా సంస్థానాల విలీనంలో నిర్ణయాత్మక పాత్ర పోషించి సమైక్య, శక్తిమంతమైన భారతదేశానికి పునాదులను బలోపేతం చేశారని కొనియాడారు. వైవిధ్యాన్ని బలంగా, జాతీయ ఐక్యతను గుర్తింపుగా కలిగిన స్వావలంబన దేశాన్ని పటేల్ ఆకాంక్షించారని తెలిపారు. జాతీయ ఐక్యతా దినోత్సవం దేశ సమైక్యత, సమగ్రత, భద్రతను కాపాడాల్సిన సమష్టి బాధ్యతను గుర్తుచేస్తుందని పేర్కొంటూ.. సామరస్యపూర్వక, బలమైన, అభివృద్ధి చెందిన భారత నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

# దేశ ఐక్యతకు పటేల్ కృషి చిరస్మరణీయం

**ఢిల్లీలో 'రన్ ఫర్ యూనిటీ'ని ప్రారంభించిన అమిత్ షా**

**2029 డిసెంబర్ 31 నాటికి మాదకద్రవ్య రహిత భారత్ లక్ష్యమని వెల్లడి**

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 31:**

సర్దార్ వల్లభభాయ్ పటేల్ దేశ చరిత్రనే కాకుండా భౌగోళిక స్వరూపాన్ని కూడా తీర్చిదిద్దిన మహనీయుడని కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా కొనియాడారు. అనేక సంస్థానాలను ఏకం చేసే క్లిష్టమైన బాధ్యతను చేపట్టి, నేడు మనం చూస్తున్న సమైక్య భారతదేశ పటాన్ని ఆవిష్కరించారని పేర్కొన్నారు. పటేల్ 151వ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా శనివారం న్యూఢిల్లీలో నిర్వహించిన 'రన్ ఫర్ యూనిటీ'ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పాల్గొన్న వారితో ఐక్యతా ప్రతిజ్ఞ చేయించారు.

కార్యక్రమంలో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ తరణ్‌జిత్ సింగ్ సంధు, కేంద్ర మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రులు నిత్యానంద రాయ్, బండి సంజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ.. నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పటేల్ జయంతిని జాతీయ ఐక్యతా దినోత్సవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. పటేల్ దేశ భౌగోళిక, రాజకీయ, సాంస్కృతిక ఏకీకరణకు కృషి చేయడంతోపాటు ప్రజలందరినీ ఒకే తాటిపైకి తీసుకొచ్చారని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో భారత్ విచ్ఛిన్నమవుతుందని ప్రపంచంలోని పలువురు అంచనా వేసినా, కేవలం 1,218 రోజుల్లోనే దేశాన్ని ఏకం చేసి అసాధ్యమనుకున్న కార్యాన్ని సుసాధ్యం చేశారని



పేర్కొన్నారు. ఎంతోమంది నాయకులు జీవితకాలంలో సాధించలేనిది పటేల్ స్వల్పకాలంలోనే సాధించారని కొనియాడారు.

ఈ ఏడాది మార్చి 31 నాటికి దేశం నక్సలిజం నుంచి విముక్తి పొందిందని అమిత్ షా పేర్కొన్నారు. ఇప్పుడు మాదకద్రవ్య రహిత దేశ నిర్మాణం దిశగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. 2029 డిసెంబర్ 31 నాటికి దేశాన్ని పూర్తిగా మాదకద్రవ్య రహితంగా తీర్చిదిద్దడం లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. ప్రధాని మోదీ ఆకాంక్షిస్తున్న వికసిత్ భారత్ నిర్మాణానికి మాదకద్రవ్య రహిత భారతమే తొలి మెట్టు అని స్పష్టం చేశారు. యువతకు, వారి భవిష్యత్తుకు ఇది అత్యంత ప్రయోజనకరమైన విజయంగా నిలుస్తుందని అన్నారు.

మోదీ హయాంలో ఆర్టికల్ 370 రద్దు, నక్సలిజం నిర్మూలన, ఏకీకృత పన్ను విధానం అమలు వంటి కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయని అమిత్ షా తెలిపారు. మాదకద్రవ్యాల నుంచి దేశానికి విముక్తి కల్పించడం కూడా అత్యంత ప్రాధాన్యమైన లక్ష్యమని పేర్కొన్నారు.

దేశంలోని భాషా, సాంస్కృతిక, సంప్రదాయ వైవిధ్యమే మన గొప్ప బలమని అమిత్ షా అన్నారు. భాషలు, వస్త్రధారణ, విశ్వాసాలు, మతాలు వేరైనా దేశం ఎప్పుడూ ఐక్యంగానే నిలిచిందని చెప్పారు. పరస్పర సంభాషణ, విశ్వాసం, అందరినీ కలుపుకొని వెళ్లే దృక్పథంతో ఉమ్మడి జాతీయ గుర్తింపును నిర్మించుకున్నామని పేర్కొన్నారు. పటేల్ అందించిన ఐక్యతా సందేశాన్ని అనుసరిస్తూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణం దేశ నాగరికత, జాతీయ చైతన్య పునరుజ్జీవనానికి ప్రతీకగా నిలిచిందని అన్నారు. ఆ ఆలయ పునర్నిర్మాణ సంకల్పానికి పటేల్ శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రధాని మోదీ నాయకత్వంలోని 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మనిర్భర్ భారత్' కార్యక్రమాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో భారత్‌ను అగ్రస్థానానికి తీసుకెళ్లే దిశగా మార్గనిర్దేశం చేస్తున్నాయని తెలిపారు.

పటేల్ సేవలకు తగిన గుర్తింపు దక్కకుండా ప్రతిపక్షాలు అనేక సంవత్సరాలు ప్రయత్నించాయని అమిత్ షా ఆరోపించారు. సూర్యుడి వెలుగును కప్పిపుచ్చలేనట్లే పటేల్ కీర్తిని మరుగునపరచడం సాధ్యం కాలేదని వ్యాఖ్యానించారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మోదీ సంకల్పించి పునాది వేసిన 'స్టాట్యూ ఆఫ్ యూనిటీ' పటేల్ మహోన్నత వ్యక్తిత్వాన్ని దేశ ప్రజల ముందుంచిందని అన్నారు. అదే ప్రాంగణంలో ప్రధాని మోదీ దేశవ్యాప్తంగా వచ్చిన పోలీసు దళాల కవాతు గౌరవ వందనాన్ని స్వీకరించి జాతీయ ఐక్యతా సందేశాన్ని అందించనున్నారని తెలిపారు.

## బంగాళాఖాత భద్రతకు బిమ్స్‌టెక్ తొలి సముద్ర విన్యాసాలు

**ఏడు సభ్యదేశాల సమన్వయం.. నవంబర్ 3 వరకు నిర్వహణ**

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 31:**



బంగాళాఖాతంలో సముద్ర భద్రత, ప్రాంతీయ స్థిరత్వం, సహకారాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో తొలి బిమ్స్‌టెక్ సముద్ర భద్రతా విన్యాసాలు జరుగుతున్నాయి. అక్టోబర్ 30న ప్రారంభమైన ఈ విన్యాసాలు నవంబర్ 3 వరకు కొనసాగనున్నాయి. బంగ్లాదేశ్, భూటాన్, భారత్, మయన్మార్, నేపాల్, శ్రీలంక, థాయ్‌లాండ్ దేశాలను భాగస్వామ్యం చేస్తున్న ఈ కార్యక్రమం.. సభ్యదేశాల మధ్య సముద్ర సహకారాన్ని ముందుకు తీసుకెళ్లడంలో కీలక మైలురాయిగా నిలుస్తోంది.'సమృద్ధి, సవాళ్లను తట్టుకునే సామర్థ్యం, బహిరంగత కలిగిన బిమ్స్‌టెక్' ఇతివృత్తంతో జరిగిన ఆరో బిమ్స్‌టెక్ శిఖరాగ్ర సదస్సు నిర్ణయాలకు అనుగుణంగా ఈ విన్యాసాలను నిర్వహిస్తున్నారు. ఉమ్మడి లక్ష్యాలను కార్యాచరణగా మార్చేందుకు, పరస్పర సముద్ర ప్రయోజనాలున్న రంగాల్లో సహకారాన్ని విస్తరించేందుకు ఇవి ఆచరణాత్మక వేదికగా ఉపయోగపడనున్నాయి. సభ్యదేశాల మధ్య కార్యాచరణ సంబంధాలను మెరుగుపరుస్తూ ప్రాంతీయ భద్రతా వ్యవస్థలను పటిష్ఠం చేయడం ప్రధాన ఉద్దేశంగా ఉంది.దక్షిణాసియా, ఆగ్నేయాసియాలను అనుసంధానించే బంగాళాఖాతం వాణిజ్యం, రవాణా అనుసంధానం, ఇంధన భద్రత, ఆర్థిక వృద్ధికి అత్యంత కీలకమైన సముద్ర ప్రాంతం. ఈ నేపథ్యంలో సభ్యదేశాలు కలిసి పనిచేసే సామర్థ్యాన్ని పెంచడం, సముద్ర ప్రాంతాల్లో పరిస్థితులపై అవగాహనను మెరుగుపరచడం, సమన్వయ వ్యవస్థలను బలోపేతం చేయడం, ఉత్తమ విధానాలను పరస్పరం పంచుకోవడం ఈ విన్యాసాల లక్ష్యాలు.అండమాన్ నికోబార్ దీవుల వ్యూహాత్మక ప్రాధాన్యాన్ని కూడా ఈ కార్యక్రమం చాటుతోంది. భారత తొలి సమీకృత త్రివిధ దళాల కమాండ్ అయిన అండమాన్ నికోబార్ కమాండ్ బంగాళాఖాత సముద్ర భద్రతలో కీలక పాత్ర పోషిస్తోంది. ప్రధాన సముద్ర రవాణా మార్గాలకు సమీపంలో ఉండటంతోపాటు సముద్ర నిఘా, మానవతా సహాయం, విపత్తు సహాయక చర్యలు, గాలింపు--రక్షణ కార్యకలాపాలు, ప్రాంతీయ సహకారంలో ఈ కమాండ్‌కు ఉన్న సామర్థ్యాలు ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకున్నాయి.'ఉమ్మడి సముద్రాలు.. ఉమ్మడి భద్రత.. ఉమ్మడి సమృద్ధి' స్ఫూర్తితో జరుగుతున్న ఈ తొలి విన్యాసాలు శాంతి, స్థిరత్వం, సుస్థిర అభివృద్ధి కోసం బిమ్స్‌టెక్ దేశాల సంఘీభావాన్ని ప్రతిబింబిస్తున్నాయి. సురక్షితమైన, బహిరంగమైన, అందరికీ భాగస్వామ్యం కలిగిన సముద్ర వాతావరణానికి సభ్యదేశాలు తమ నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నాయి.

## బ్యాలెట్ ఎన్నికలకు సిద్ధం.. ప్రభుత్వాన్ని రద్దు చేసి రావాలి: బండి సంజయ్ సవాల్

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 31:**



ఎస్ఐఆర్ (ఎ×=) ప్రక్రియను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆందోళనలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దేశాన్ని విచ్ఛిన్నం చేయాలనుకునే శక్తులతో కలిసి కాంగ్రెస్ పార్టీ ధర్నాలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. దొంగ ఓట్లు, మరణించిన వారి ఓట్లను తొలగిస్తుంటే కాంగ్రెస్‌కు ఎందుకు అభ్యంతరమని ప్రశ్నించారు. ఈవీఎంలపై ఆరోపణలు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దమ్ముంటే రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేసి బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలకు రావాలని సవాల్ విసిరారు. తెలంగాణలో బ్యాలెట్ ఎన్నికలకు బీజేపీ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన బండి సంజయ్.. ఎస్ఐఆర్ ప్రక్రియను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపేది లేదన్నారు. అర్హులందరికీ ఓటు హక్కు కల్పించి, అనర్హుల ఓట్లను తొలగించడమే ఈ ప్రక్రియ ఉద్దేశమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధారాలు లేకుండా ఎన్నికల సంఘంపై ఆరోపణలు చేస్తోందని విమర్శించారు. దేశంలో త్వరలో ఎన్ఆర్సీని తీసుకొస్తామని, మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదిస్తామని, డీలిమిటేషన్ ప్రక్రియను కూడా అమలు చేస్తామని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని ఎవరూ ఏమీ చేయలేరని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నేతలు రాజకీయ ఆరోపణలు మానుకుని ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని హితవు పలికారు.

## డిజిటల్ పాలనతో ప్రభుత్వ సేవల్లో మరింత పారదర్శకత, సమర్థత




**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 31:**

ప్రభుత్వ పాలనలో డిజిటల్ సాంకేతికతను విస్తృతంగా వినియోగించుకుంటూ పరిపాలనా ప్రక్రియలను మరింత సరళీకృతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్నారు. డిజిటల్ గవర్నెన్స్‌ను బలోపేతం చేయడం ద్వారా ప్రభుత్వ సేవల్లో పారదర్శకత, జవాబుదారీతనం, సమర్థత పెంపొందించవచ్చని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్‌లో ఈరోజు నిర్వహించిన ఈ హెచ్ఆర్ఎంఎస్ (జు-ఌ=మీ), ఈ-శాంక్షన్స్ (జు-ూుఅ‰శీఅం), వామిస్ (ఔూవీ×ూా) శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, ప్రభుత్వ శాఖల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. పరిపాలనా విధానాల్లో అనవసర జాప్యాన్ని తగ్గించి, ప్రభుత్వ ప్రక్రియలను వేగవంతం చేయడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించడంపై దృష్టి సారించాలని అన్నారు.

డిజిటల్ వ్యవస్థల అమలు ద్వారా ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకతను పెంచడం, అధికారుల పనితీరులో జవాబుదారీతనాన్ని నిర్ధారించడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా, సమర్థవంతమైన సేవలను అందించే పౌర కేంద్రిత పరిపాలన దిశగా అధికారులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ప్రభుత్వ కార్యదర్శులు, సీనియర్ పోలీసు అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల అధిపతులు (ఎశీణం) పాల్గొన్నారు. ఈ-హెచ్ఆర్ఎంఎస్, ఈ-శాంక్షన్స్, వామిస్ వ్యవస్థల వినియోగంపై నిర్వహించిన శిక్షణ ద్వారా ప్రభుత్వ శాఖల్లో డిజిటల్ పరిపాలనను మరింత విస్తరించడంపై దృష్టి సారించారు.

## కాచం సత్యనారాయణ కుటుంబానికి మంద కృష్ణ మాదిగ పరామర్శ

**భిక్షమయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు**



**నార్కట్‌పల్లి, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 31:**

తండ్రిని కోల్పోయిన తెలంగాణ ఉద్యమకారుడు కాచం సత్యనారాయణను ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పరామర్శించారు. నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలు గ్రామంలోని ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సత్యనారాయణ తండ్రి కాచం భిక్షమయ్య (86) బుధవారం తెల్లవారుజామున గుండెపోటుతో కన్నుమూశారు. ఈ విషయం తెలుసుకున్న మంద కృష్ణ మాదిగ గ్రామానికి చేరుకుని భిక్షమయ్య చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం సత్యనారాయణతో, కుటుంబ సభ్యులతో మాట్లాడి వారిని ఓదార్చారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సైదులు తదితరులు పాల్గొన్నారు.

## హెల్పింగ్ హాండ్స్ నూతన కార్యవర్గం ఎన్నిక

**- అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జె.దేవేందర్ (ప్రేమ్)**



**ట్రైనెట్ న్యూస్, హైదరాబాద్ అక్టోబర్ 31 :**

తెలంగాణ ఎస్సీ ఉ ఎస్టీ ఎంప్లాయీస్ హెల్పింగ్ హాండ్స్ అసోసియేషన్ (ూజూుఒఒనూూ-చారిటీ) వార్షిక సర్వసభ్య సమావేశం శనివారం అసోసియేషన్ అధ్యక్షులు గాయక్వాడ్ తులసిదాస్ మాంగ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జె.దేవేందర్ (ప్రేమ్) గత ఐదు సంవత్సరాల కాలంలో చేపట్టిన అసోసియేషన్ సేవా కార్యకలాపాలు మరియు ఆర్థిక అంశాలకు సంబంధించిన సమగ్ర నివేదికను సభ్యుల ముందుంచారు. అనంతరం సభ్యులందరూ వివిధ అంశాలపై చర్చించి, ఏకగ్రీవంగా తదుపరి మూడు సంవత్సరాల కాలానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం – అధ్యక్షులు: గాయక్వాడ్ తులసిదాస్ మాంగ్, ఉపాధ్యక్షులు: సి.హెచ్.గంగలక్ష్మి, ప్రధాన కార్యదర్శి: జె.ప్రేమ్ (దేవేందర్), సంయుక్త కార్యదర్శి: ఎం.సూరజ్ బిన్ని, కోశాధికారి: బి.గుణవంత్ రావ్, కార్యవర్గ సభ్యులు: కె.శైలజ, పి.సందీప్ కుమార్. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం మాట్లాడుతూ, సామాజిక బాధ్యతతో హెల్పింగ్ హాండ్స్ అసోసియేషన్ ఆశయాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. సభ్యుల సహకారంతో అసోసియేషన్‌ను మరింత బలోపేతం చేసి, సేవా కార్యక్రమాల్లో ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

ట్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక






ఆదివారం నవంబర్ 01, 2026
www.trinetnews.com


# జీవితాన్ని ప్రేమించు: నిజాన్ని స్వీకరించు -- నిమిషాన్ని ఆస్వాదించు

**అంగీకారమే ఆరంభం -- ఆస్వాదనతోనే సంపూర్ణం**

రాత్రి భోజనం ముగించుకొని అలా సోఫా మీద కాస్త వాలగానే ఆలోచనలు మొదలయ్యాయి. "ఈ ఉద్యోగంలో సంపాదించే జీతం ఎప్పుడు పెరుగుతుందో? ఒకవేళ పెరగకపోతే ఇలాగే గడిపేయాల్సి వస్తుందేమో.. ఒకవేళ వేరే ఉద్యోగం దొరకాలంటే ఈ వయసులో సాధ్యమవుతుందా? పిల్లలని ఊరు గాని ఊరు తీసుకువచ్చా. ఉద్యోగ రీత్యా ఒకవేళ మళ్లీ వేరే ఊరికి వెళ్లాల్సి వస్తే, అక్కడ ఎలాంటి వాతావరణం ఉంటుందో, వాళ్ళకి ఎలాంటి చదువు అందుతుందో, అసలు నేను ఇల్లు కట్టుకొని స్థిరపడగలనా? ఒకవేళ ఉద్యోగం మారాల్సి వస్తే, ఊరు మారాల్సి వస్తే, ఏ ప్రాంతంలో ఇల్లు కట్టుకోగలుగుతాను?" అంటూ ఇవే ఆలోచనలు. ఆ రాత్రి సరిగ్గా నిద్ర పట్టనే లేదు. ఇది ఈ ఒక్కరోజు జరిగింది కాదు. చాలా రోజుల నుంచి ఇవే ఆలోచనలతో పనిచేసుకోనివ్వని పగళ్ళు, నిద్రలేని రాత్రులు.

ఉదయం స్నానమయ్యాక అలా రైల్వే స్టేషన్ దగ్గర్లో ఉన్న ఒక టీ స్టాల్ దగ్గరికి వెళ్ళాడు. అతను ప్రతిరోజు అక్కడికి వెళ్లే వ్యక్తి కాబట్టి అతనిని చూడగానే గుర్తుపట్టి ఆ షాపు యజమాని కూతురు టీ తెచ్చి ఇచ్చింది. మీ నాన్నగారు లేరా అని అడిగాడు. అంతలోనే అటుగా వస్తున్న ఆ షాపు యజమాని "దగ్గర్లో మా కొత్త షాపు ప్రారంభించడం కోసం పనులు జరుగుతున్నాయి. అక్కడికే వెళ్లి వస్తున్నాను" అన్నాడు నవ్వుతూ.

ఆ యాజమాని ముఖంలో ఆ నవ్వుని చూసి "ఇంత సంతోషం నేను అద్దంలో చూసుకొని చాలా రోజులైంది




కదా" అనుకున్నాడు. వెంటనే " మీరు ఏం చదివారు? మీకెంతమంది పిల్లలు?" అని అడిగాడు. "చదివించే స్తోమత మా తల్లిదండ్రులకు లేకపోవడం వల్ల నేను పెద్దగా ఏమీ చదువుకోలేదు. నాకు ముగ్గురు పిల్లలు. ఇప్పుడు మీకు టీ తెచ్చి ఇచ్చింది నా చిన్న కూతురు." అని ఆ యజమాని సమాధానమిచ్చాడు. "మరి మీరు ఏం చదువుకోలేదు కదా. మీ పిల్లల చదువులు, వాళ్ల పెళ్లిళ్ల గురించి మీకేం దిగులుగా లేదా? అంత సంతోషంగా ఎలా ఉండగలుగుతున్నారు?" అని అడిగాడు. దానికి ఆ షాపు యజమాని సమాధానమిస్తూ "ఎందుకండీ దిగులు. నేను ఫలానా ఊళ్లో, ఫలానా వాళ్లకు పుట్టాలని అనుకున్నానా? ఫలానా స్నేహితులు కావాలని అడిగానా? జీవితం అలా జరిగిపోతూ ఉంటుంది. మనం కాలగమనంలో వెళుతూనే ఉండాలి. నదీ ప్రవాహంలో ఎన్నో రాళ్లు అడ్డు వస్తాయి కానీ వాటి దగ్గరే ఆ ప్రవాహం ఆగిపోదు కదా. ఆ రాళ్ల పక్క నుండి మరో దారి చూసుకొని నది వెళ్లిపోతూనే ఉంటుంది. జీవితం కూడా అంతే. ఏ ఒక్క కష్టం దగ్గరో జీవితం ఆగిపోకూడదు. ఇక భవిష్యత్తు గురించి అంటారా.. అది బాగుండాలని ఆశిస్తాం కానీ ఎలా ఉంటుందో? ఏమవుతుందో? అని అనుక్షణం భయపడుతూ ఉంటే నడిచే ఈ రోజులను ప్రశాంతంగా గడపలేం కదా" అని అన్నాడు.

"నేను పుస్తకాలు మాత్రమే చదివాను. అతను జీవితాన్ని చదివాడు" అనుకుంటూ టీ తాగి అక్కడ నుంచి వెనుతిరిగాడు.

ఇక్కడ మనం గమనించాల్సింది ఏమిటంటే భవిష్యత్తు గురించి ఆలోచన మంచిదే, దానికోసం ప్రయత్నమూ మంచిదే కానీ అస్తమానం నా జీవితం ఇలా ఎందుకు ఉంది? ఏమైపోతుందో? అనుకుంటూ నిరాశలో బ్రతికేయడం సరైనది కాదు. మన చేతిలో ఉన్న టీ కప్పు "ఏ రంగులో ఉంటే బాగుండేది? అది ఏ సైజులో ఉంటే అందంగా ఉండేది? కింద పడితే పగులుతుందా? పగిలితే మళ్ళీ అతుకుతుందా?" అనుకుంటూ ఇన్ని ఆలోచనల్లోనే ఉంటే ఆ "కప్పులో ఉన్న టీ ని ఎప్పుడు ఆస్వాదిస్తావు". జీవితం కూడా అంతే.

మూడు గంటలు రాసే ప్రశ్న పత్రంలో కూడా అన్నీ నువ్వు అనుకున్న ప్రశ్నలే రావు కదా. మనం చూసే సినిమాలో ప్రతి సన్నివేశం చివరిదాకా మనం అనుకున్నట్టుగానే ఉండదు కదా. అలా ఉంటే ఆ రెండున్నర గంటల సమయం మనకు బోర్ కొడుతుంది. మరి 60 – 70 ఏళ్ల మన జీవితం మొత్తం మనం అనుకున్నట్టుగానే జరిగిపోతూ ఉంటే మనకు మాత్రం జీవితం చప్పగా అనిపించదా?"మనిషి ఎంతైనా కష్టపడొచ్చు, కానీ బాధ పడకూడదు. కష్టం శరీరానికి సంబంధించినది, బాధ మనసుకి సంబంధించినది." అని నా ప్రియ మిత్రుడు రాఘవేంద్ర చెప్పిన వాక్యం ఇక్కడ గుర్తుచేసుకోవడం అవసరం.

ఎలాంటి పరిస్థితులు ఎదురైనా, ముందు దాన్ని అంగీకరించడం నేర్చుకో. "సరే అలా జరిగింది. ఇప్పుడు ఏం చేయాలి" అని ఆలోచించు. అంతేగాని "ఇలా ఎందుకు జరిగింది? నాకే ఎందుకు జరిగింది?" అంటూ నిరాశలో "ఏం జరుగుతుందో" అన్న భయంతో ఉండిపోకు. జీవితం ఎలా ఉన్నా ముందు దాన్ని అంగీకరించగలిగితే మున్ముందు జీవితాన్ని ఆస్వాదించగలుగుతావు.

రోజు మొత్తం రాత్రే ఉంటే పగటి వెలుగులు ఎలా తెలుస్తాయి? రోజు మొత్తం పగలే ఉంటే చంద్రుడి వెన్నెల ఎలా ఆస్వాదించగలవు? కాబట్టి రోజులో పగలు, రాత్రి ఎంత ముఖ్యమో జీవితంలో కష్టం, సుఖం రెండూ ముఖ్యమే. కష్టం నిన్ను మరింత చురుకైన వ్యక్తిగా తయారు చేస్తుంది. నీ మెదడుకు మరింత పదును పెడుతుంది. నిన్ను మరింత ఉన్నత స్థానానికి ఎదిగేలా తోడ్పడుతుంది.

నువ్వు అనుకున్నది జరగనప్పుడు ఇంకొక మార్గం ఉందేమో గమనించు. నా అనుకున్న వ్యక్తులు మోసం చేస్తే "మున్ముందు వారివల్ల మరింత పెద్ద నష్టం చవిచూసే పరిస్థితి నుండి బయటపడినందుకు" సంతోషించు. నీ కష్టానికి తగిన ప్రతిఫలం రాలేదంటే నీ శ్రమలో లేదా ఆలోచనలో ఎక్కడ సరి చేసుకోవాలో గమనించు. దారిని లేదా గమ్యాన్ని మార్చు. అంతే గానీ అక్కడే ఆగిపోకు.

సంగీతమో, నాట్యమో, పాడటమో నేర్చుకో...క్రికెట్, వాలీబాల్ లాంటి ఏదైనా ఆటలో ప్రావీణ్యం సంపాదించు. నిరాశ నిన్ను చుట్టుముడితే ఎవరో వచ్చి ఓదారుస్తారు అని ఎదురు చూడకు. ఆ సంగీతమో, నువ్వు నేర్చుకున్న ఏ ఆటలోనో నిమగ్నమై నువ్వే మళ్ళీ ప్రశాంతత పొందగలగాలి.

ఎవరూ కూడా అన్నీ నేర్చుకున్న తర్వాతనే పుట్టరు. పడుతూ లేస్తూ నేర్చుకుంటూనే ఉంటాం. జీవితంలో ఏదేమైనా సరే.. సంతోషంగా రోజులు గడపడం ప్రారంభించు..నీ చుట్టూ ఉన్న వాళ్ళతో నవ్వులు పూయించు. ఎన్ని కోట్లు పెట్టినా మళ్లీ ఈ జీవితాన్ని కొనలేవు. అంత విలువైన ఈ జీవితాన్ని నిరాశతో, నిస్పృహ తో నింపకు.

చివరిగా ఒక్క మాట:
పంచుకున్న సంతోషాలు
పెంచుకున్న నవ్వులు
తోడుగా నిలిచిన సందర్భాలు
ధైర్యం చెప్పిన క్షణాలు
తట్టుకుని నిలబడిన రోజులు
గెలిచిన సందర్భాలు..
ఏవైనా.. ఎంతైనా..
వీలైనన్ని ఎక్కువ జ్ఞాపకాలు నింపుకోవడమే జీవితం.

M. Jaya Krishna Reddy
M.S. (Counseling & Psychotherapy)
Motivational Speaker

# వేదాలు భారతీయ సంస్కృతికి ప్రాణం: గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

**యాదగిరిగుట్టలో 26వ తెలంగాణ వేద విద్వన్మహాసభల్లో గవర్నర్ సందేశం**
**వేద పరిరక్షణలో గురు-శిష్య పరంపర సేవలు అమూల్యం**
**వేద విద్యార్థులు, పండితులకు గవర్నర్ అభినందనలు**

**యాదాద్రి భువనగిరి, అక్టోబరు31/ట్రైనెట్ న్యూస్:**

వేద జ్ఞానమే భారతీయ నాగరికత, సంస్కృతులకు మూలాధారమని, వేదాలు కేవలం ఆధ్యాత్మిక చింతనకే పరిమితం కాకుండా ప్రకృతి పరిరక్షణ, మానవ జీవనం, నైతిక విలువలు, సామాజిక సామరస్యానికి మార్గదర్శకాలని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు.యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, తిరుమల తిరుపతి దేవస్థానం సౌజన్యంతో నిర్వహించిన 26వ తెలంగాణ వేద విద్వన్మహాసభల్లో శనివారం గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, తరతరాలుగా వేదాలను పరిరక్షిస్తూ వస్తున్న గురు-శిష్య పరంపర భారతీయ సంస్కృతిలో అత్యంత విశిష్టమైనదని కొనియాడారు. ఆచార్యులు తమ నిరంతర సాధన, అంకితభావంతో వేదాల శుద్ధ ఉచ్చారణ, స్వర, పాఠ సంప్రదాయాలను పరిరక్షిస్తూ వస్తున్నారని పేర్కొన్నారు.ఈ మహాసభల్లో భాగంగా నిర్వహిస్తున్న వేద పరీక్షల్లో పాల్గొంటున్న 500 మందికి పైగా విద్యార్థులకు గవర్నర్ శుభాకాంక్షలు తెలిపారు. వారి కృషి, క్రమశిక్షణ భారతీయ సాంస్కృతిక వారసత్వం ఉజ్వల భవిష్యత్తుకు నిదర్శనమని అన్నారు. జయపత్రాలు అందుకున్న 10 మంది వేద విద్వాంసులను ప్రత్యేకంగా అభినందించారు.

యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రం వేద అధ్యయనం, ఆధ్యాత్మిక సాధన, సాంస్కృతిక చైతన్యానికి ప్రముఖ కేంద్రంగా ఎదిగేందుకు అపార అవకాశాలు ఉన్నాయని గవర్నర్





పేర్కొన్నారు. ప్రాచీన భారతీయ జ్ఞాన సంపదకు, ఆధునిక విజ్ఞానానికి మధ్య సార్థకమైన అనుసంధానం అవసరమని అన్నారు. వేద విద్యా సంస్థలు, విద్వత్ సభలు, గురుకులాలకు మరింత ప్రోత్సాహం అందించాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మాట్లాడుతూ గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఈ వేద పాఠశాలకు రావడం వేద విద్యార్థులకు ఒక నిదర్శనం అని విద్యార్థులందరూ గవర్నర్ ను నిదర్శనంగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. సుదీర్ఘంగా చాలా సంవత్సరాలు మన వేద సంస్కృతిని అహర్నిశలు ప్రతి సందర్భం, ప్రతి సమయంలో ముందుకు తీసుకెళ్తూ గత 20 సంవత్సరాల నుంచి వేదాన్ని గురించి, వేదానికి ఉన్న మహత్యం గురించి, వేదం చదువుకోవాలనే ఒక పెద్ద సంకల్పంతో ముందుకు నడిపిస్తున్న ప్రముఖులు సాయినాథ్ శర్మ ఆశీస్సులు అందరికీ ఉండాలన్నారు. వేద విద్వన్మహా సభలు నిర్వహిస్తున్న తరుణంలో వేద సభలకు సంబంధించిన పరీక్షలు వ్రాస్తున విద్యార్థుల సంఖ్య మెరుగుపర్చాలన్నారు. ఈ వేద విద్యను పెంపొందించడానికి మన పిల్లల్లో ఒకళ్ళని వేద విద్యను నేర్చుకోవాలని వారిని ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు కూడా హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. చాలామంది వేద విద్యకు సంబంధించిన విద్యార్థులతో పెద్ద ఎత్తున ముందుకు తీసుకెళ్లాలని, ఈ ప్రాంగణంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడానికి తాను ప్రోత్సహం చేస్తానని తెలిపారు. ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య మాట్లాడుతూ వేదాన్ని పఠిస్తూ తెలంగాణ సాంప్రదాయంతో భారతదేశ సంస్కృతికి మూలం వేద విద్య అని అన్నారు.వేద విద్య జ్ఞానాన్ని పెంపొందిస్తూ శక్తి ఏకాగ్రత పెంపొందిస్తుందన్నారు. ఋగ్వేదం, సామవేదం,వివిధ వేదాలలో పరీక్షలో ప్రతిభ కనబరచిన వేద విద్యార్థులకు గవర్నర్ శాలువ, మెమెంటో లతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐ.టి మంత్రి డి. శ్రీధర్ బాబు, ప్రభుత్వ చీఫ్ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, జనార్దనా సరస్వతి స్వామి సంస్కృతి ట్రస్ట్ చైర్మన్ సాయినాథ్ శర్మ, గవర్నర్ స్పెషల్ సిఎస్ దాన కిషోర్, ధార్మిక సలహాదారు ఆర్. గోవింద్ హరి, దేవాదాయ శాఖ కమిషనర్ ఎం. హనుమంతరావు, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అక్షాంష్ యాదవ్,దేవస్థానం కార్యనిర్వహణాధికారి ,జె. భవానీ శంకర్, పూజ్య ఆచార్యులు, వేద పండితులు, భక్తులు పాల్గొన్నారు.

# నవంబర్ 8న శ్రీవారి ఆలయంలో దీపావళి ఆస్థానం

**తిరుమల, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 31:**

తిరుమల శ్రీవారి ఆలయంలో దీపావళి పండుగ సందర్భంగా నవంబర్ 8వ తేదీన దీపావళి ఆస్థానాన్ని టీటీడీ శాస్త్రోక్తంగా నిర్వహించనుంది. దీపావళి నాడు ఉదయం 7 నుండి 9 గంటల వరకు బంగారు వాకిలి ముందు గల ఘంటా మండపంలో దీపావళి ఆస్థానం జరుగుతుంది.

ఆస్థానంలో భాగంగా శ్రీమలయప్పస్వామి దేవేరులతో కలిసి ఘంటా మండపంలో ఏర్పాటుచేసిన సర్వభూపాల వాహనంలో గరుడాళ్వార్‌కు అభిముఖంగా వేంచేపు చేస్తారు. సేనాధిపతి అయిన శ్రీ విష్వక్సేనులవారిని కూడా స్వామివారి ఎడమ పక్కన మరొక పీఠంపై దక్షిణ ఆభిముఖంగా వేంచేపు చేస్తారు. ఆ తరువాత స్వామివారికి ప్రత్యేక పూజ, హారతి, ప్రసాద నివేదనలను అర్చకులు ఆగమోక్తంగా నిర్వహిస్తారు. దీంతో దీపావళి ఆస్థానం పూర్తవుతుంది.

కాగా సాయంత్రం 5 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు సహస్ర దీపాలంకరణ సేవలో పాల్గొని, ఆలయ నాలుగు మాడ వీధులలో విహరించి భక్తులను కటాక్షించనున్నారు.

ఆర్జిత సేవలు రద్దు

దీపావళి ఆస్థానం కారణంగా నవంబర్ 8న కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం సేవలను టీటీడీ రద్దు చేసింది. తోమాల, అర్చన సేవలను ఏకాంతంగా నిర్వహిస్తారు.

# తండ్రిని కోల్పోయిన బీటెక్ విద్యార్థినికి మంత్రి కోమటిరెడ్డి ఆర్థిక సాయం

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్**

అక్టోబర్ 31:లితండ్రిని కోల్పోయి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న బీటెక్ విద్యార్థిని సాహితి చదువుకు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అండగా నిలిచారు. ఆమె కాలేజీ ఫీజు రూ.55 వేలు చెల్లించి తన దాతృత్వాన్ని చాటుకున్నారు.

కరీంనగర్ జిల్లా జమ్మికుంటకు చెందిన సాహితి ఇటీవల గుండెపోటుతో తండ్రిని కోల్పోయింది. కుటుంబ ఆర్థిక పరిస్థితి, ఆమె ఇంజినీరింగ్ చదువుకు ఎదురవుతున్న ఇబ్బందులను సీనియర్ జర్నలిస్ట్ సత్యనారాయణ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

దీనిపై వెంటనే స్పందించిన మంత్రి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా రూ.55 వేల కాలేజీ ఫీజును చెల్లించాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు ఆయన పీఎస్ నరేందర్ రెడ్డి శనివారం సచివాలయంలో విద్యార్థిని సాహితికి ఫీజు మొత్తాన్ని అందజేశారు.

సాహితి భవిష్యత్తులో ఉన్నత చదువులు అభ్యసించేందుకు కూడా అండగా ఉంటానని మంత్రి హామీ ఇచ్చారు. బాగా చదువుకుని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఆర్థిక సాయం అందించడంతో పాటు భవిష్యత్తులోనూ అండగా ఉంటానని భరోసా ఇచ్చిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి సాహితి, ఆమె కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# 42 ఏళ్ల విశిష్ట సేవలకు వీడ్కోలు

**భారత వాయుసేన చీఫ్ ఏపీ సింగ్ పదవీ విరమణ**

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 31:**

దేశానికి 42 ఏళ్లపాటు విశిష్ట సేవలందించిన భారత వాయుసేన అధిపతి, ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ పీవీఎస్ఎం, ఏవీఎస్ఎం శనివారం పదవీ విరమణ చేశారు. నిష్ణాతుడైన యుద్ధ విమాన పైలట్‌గా, ప్రయోగాత్మక పరీక్షా పైలట్‌గా వాయుసేన కార్యాచరణ సామర్థ్యం, యుద్ధ సన్నద్ధత, ఆధునికీకరణకు ఆయన విశేష కృషి చేశారు.

వాయుసేన అధిపతిగా ఏపీ సింగ్ పదవీకాలం నిర్ణయాత్మక నాయకత్వానికి, నిరంతర కార్యాచరణ సన్నద్ధతకు ప్రతీకగా నిలిచిందని భారత వాయుసేన పేర్కొంది. ముఖ్యంగా 'ఆపరేషన్ సిందూర్' సమయంలో ఆయన నాయకత్వంలో వాయుసేన తన పోరాట సామర్థ్యం, కచ్చితత్వం, జాతీయ లక్ష్యాల సాధన పట్ల దృఢసంకల్పాన్ని ప్రదర్శించిందని తెలిపింది. విభిన్న కార్యాచరణ పరిస్థితుల్లో సమర్థంగా, నిర్ణయాత్మకంగా స్పందించే సామర్థ్యాన్ని ఆయన నాయకత్వం మరింత బలోపేతం చేసిందని వెల్లడించింది.

కార్యాచరణ నాయకత్వంతోపాటు అన్ని స్థాయిల వాయుసేన సిబ్బందితో ఏపీ సింగ్ ఏర్పరచుకున్న ఆత్మీయ అనుబంధం ప్రత్యేక గుర్తింపును తెచ్చింది. వాయుసేనకు అసలైన బలం సిబ్బందేనన్న విశ్వాసంతో క్షేత్రస్థాయిలో వారితో తరచూ మమేకమయ్యారు. యువ అధికారులు, వాయుసేన సిబ్బంది, క్యాడెట్లతో సంభాషిస్తూ వృత్తి నైపుణ్యం, జవాబుదారీతనం, చొరవ, సేవ పట్ల గర్వభావం ప్రాధాన్యాన్ని వివరించేవారు. యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తూ భావితరాల వాయు యోధులు, నాయకులను తీర్చిదిద్దేందుకు కృషి చేశారు.

సాంకేతికంగా బలోపేతమైన, భవిష్యత్ అవసరాలకు సిద్ధంగా ఉండే వాయుసేన నిర్మాణంపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. స్వదేశీకరణ, ఆవిష్కరణలు, అభివృద్ధి చెందుతున్న నూతన సాంకేతికతల అనుసంధానానికి ప్రాధాన్యమిచ్చారు. సమర్థమైన, విశ్వసనీయమైన, యుద్ధానికి సర్వసన్నద్ధమైన దళంగా వాయుసేనను తీర్చిదిద్దాలన్న సంకల్పానికి ఆయన దూరదృష్టి, మార్గదర్శకత్వం మరింత బలాన్ని చేకూర్చాయని వాయుసేన పేర్కొంది.



పదవీ విరమణ సందర్భంగా ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్, ఆయన సతీమణి సరితా సింగ్‌కు భారత వాయుసేన శుభాకాంక్షలు తెలిపింది. ఆయన నాయకత్వం, కార్యాచరణలో దృఢసంకల్పం, సిబ్బందితో కొనసాగించిన అనుబంధం రాబోయే తరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని వెల్లడించింది.

# బావుపేట వద్ద రోడ్డు ప్రమాదం.. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి: మంత్రి పొన్నం

**ఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 31:**

జిల్లా కొత్తపల్లి మండలం బావుపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు.సిరిసిల్ల ఆర్టీసీ డిపోకు చెందిన బస్సును కంటైనర్ లారీ ఢీకొట్టడంతో డ్రైవర్‌తో పాటు పలువురు ప్రయాణికులు గాయపడటం బాధాకరమని మంత్రి పేర్కొన్నారు. క్షతగాత్రులకు కరీంనగర్ ఆసుపత్రిలో మెరుగైన, నాణ్యమైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్, ఆర్టీసీ ఎండీ, పోలీస్ కమిషనర్‌ను ఆదేశించారు.బాధితుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. క్షతగాత్రులకు వైద్య సేవల విషయంలో నిర్లక్ష్యం వహించకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు.



edited, Printed, Published and Owned by:Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA. www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136